సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 16

సంచిక: 259

ఆదివారం

10-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



సఫారీ సవాల్‌కు సై

భారత గడ్డపై వన్డే ప్రపంచకప్‌ను ఎగరేసుకుపోయిన ఆస్ట్రేలియాను పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా గట్టి దెబ్బ కొట్టింది. ఇప్పుడు కూడా దాదాపు అలాంటి జట్టుతోనే దక్షిణాఫ్రికాతో కఠిన సవాల్‌కు టీమిండియా సై అంటోంది.


- వివరాలు 12లో



అయిదు పడవల ప్రయాణం

రెండు పడవల మీద ప్రయాణం చాలామందికి కష్టమేమోగానీ కొద్దిమందికి మాత్రం చాలా ఇష్టం. థియేటర్ ఆర్టిస్ట్, మోడల్, హీరోయిన్, ప్రొడ్యూసర్‌గా పేరు తెచ్చుకున్న హుమా ఖురేషి 'జేబా: యాన్ యాక్సిడెంటల్ సూపర్‌హీరో' పుస్తకంతో రైటర్‌గా మారింది. రైటర్‌గా తన అనుభవాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది.

'ప్రపంచాన్ని కాపాడిన మహిళ కథ ఇది. సామాజిక కట్టుబాట్లకు అతీతంగా అన్ని వర్గాల వారికోసం రాసిన పుస్తకం' అంటుంది ఖురేషి. నవరసాలలో హాస్యరసం తనకు కష్టం అంటుంది ఖురేషి. 'నేను రాసిన హ్యూమర్ నాకు విపరీతంగా నవ్వు తెప్పించవచ్చు. ఇతరులు అసలే నవ్వకపోవచ్చు. అందుకే హ్యూమర్ రాయడం చాలా కష్టం' అంటుంది ఖురేషి. ఈ పుస్తకంలో కథానాయిక 'జేబా'తో పాటు ఎన్నో క్యారెక్టర్లు ఉన్నాయి. అన్ని క్యారెక్టర్లు తనకు ఇష్టమే అని చెబుతున్న హుమా ఖురేషి రైటర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకోవాలని ఆశిద్దాం.



లిటిల్ స్టార్స్ ఇన్ ఫైవ్‌స్టార్

ఒక వ్యక్తి కొంత మంది పిల్లలను ఫైవ్‌స్టార్ హోటల్‌కు తీసుకువెళ్లి వారికి ఇష్టమైన పదార్థాలు తినిపించిన వీడియో వైరల్ అయింది. ఆ పిల్లలకు ఈయన తండ్రి కాదు. కనీసం దూరపుచుట్టం కాదు. వీరు వీధిబాలలు. ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ వీడియో 39 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది. కవల్‌చాబ్ర అనే వ్యక్తి కారు ట్రాఫిక్ జామ్‌లో నిలిచిపోయినప్పుడు కొందరు పిల్లలు కారు అద్దాలను తుడవడం మొదలు పెట్టారు. వారిని చూడగానే చాబ్రకు 'అయ్యో!' అనిపించింది. వెంటనే పిల్లలను కారులో కూర్చోబెట్టుకొని ఫైస్టార్ హోటల్‌కు తీసుకువెళ్లాడు. ఈ వైరల్ వీడియో ఎంతోమందిని ఇన్‌స్పైర్ చేస్తోంది.





1970లలో బొంబాయి మొత్తంలో 10 ఇంపాలా కార్లు ఉంటే వాటిలో ఒకటి జూనియర్ మెహమూద్‌ది. 1960-70ల మధ్య సినిమాల్లో జూనియర్ మెహమూద్ ఒక సూపర్‌స్టార్‌లా వెలిగాడు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా అతని ప్రాభవం వైరల్‌గా ఉండేది. శుక్రవారం జూనియర్ మెహమూద్ కన్నుమూశాడు. అభిమానులు అతని పాత పాటలను, సన్నివేశాలను మళ్లీ వైరల్ చేస్తున్నారు.

ఓన్లీ సూపర్‌స్టార్

'హమ్ కాలే హైతో క్యా హువా దిల్ వాలే హై'... పాట 'గుమ్‌నామ్' (1965)లో పెద్ద హిట్. కమెడియన్ మెహమూద్ ఈ పాటకు డాన్స్ చేశాడు. సరిగ్గా మూడేళ్ల తర్వాత 1968లో అదే పాటకు 'బ్రహ్మచారి'లో జూనియర్ మెహమూద్ డాన్స్ చేశాడు. అతని అసలు పేరు నయీమ్ సయీద్. అప్పటికి అతనికి ఏడెనిమిదేళ్లు కూడా లేవు. తనను ఇమిటేట్ చేసిన నయీమ్ సయీద్‌కు మెహమూద్ 'జూనియర్ మెహమూద్' అనే బిరుదు ఇచ్చి ఆశీర్వదించాడు. చనిపోయే వరకూ నయీమ్ అసలు పేరుతో కాకుండా జూనియర్ మెహమూద్‌గానే గుర్తింపు పొందాడు. 1968-70ల మధ్యకాలంలో జూనియర్ మెహమూద్ సూపర్‌స్టార్‌గా వెలిగాడు. సినిమాకు లక్ష రూపాయలు తీసుకునేవాడు. 1969లో రోజుకు 3000 రూపాయలు చార్జ్ చేసేవాడు. రాజేష్ ఖన్నా, జితేంద్ర, సంజీవ్ కుమార్‌లాంటి పెద్ద పెద్ద హీరోలతో కలిసి పని చేశాడు.



ఇంపాలా కారులో తిరిగేవాడు. ఇతను స్టార్ అయ్యే ముందు వరకూ కుటుంబం చాలా పేదరికంలో ఉండేది. అతని తండ్రి రైల్వే డ్రైవర్. కాని ఆ తర్వాత జూనియర్ మెహమూద్ సంపాదనతో అందరూ స్థిరపడ్డారు. రిలీజైన సినిమాకు ఫ్లాప్ టాక్ వస్తే జూనియర్ మెహమూద్‌తో పాట తీసి యాడ్ చేసి ఆడించిన సందర్భాలున్నాయి. శుక్రవారం 67 ఏళ్ల వయసులో జూనియర్ మెహమూద్ ముంబైలో కన్నుమూశాడు. భారతీయ చలనచిత్ర చరిత్రలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా స్టార్‌డమ్‌ను చూసిన జూనియర్ మెహమూద్‌ను అభిమానులు తలచుకుని అతని సినిమా సన్నివేశాలను వైరల్ చేస్తున్నారు.

వైరల్

ఈ రెస్టారెంట్‌లో చెంపదెబ్బలు వడ్డిస్తారు!

అనగనగా జపాన్‌లో 'షచిభొకయ-యా' అనే రెస్టారెంట్ ఉంది. నాగోయ నగరంలో ఉన్న ఈ రెస్టారెంట్‌కు రుచుల కోసం కాదు చెంపదెబ్బల కోసం కస్టమర్‌లు క్యూ కట్టేవారు. రెస్టారెంట్‌లోకి అడుగు పెట్టగానే కస్టమర్ చెంప చెళ్లుమనిపిస్తుంది వెయిటర్. ఈ రెస్టారెంట్‌లో ఒక లేడి వెయిటర్ కస్టమర్ చెంప చెళ్లుమనిపిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

'ఇదెక్కడి చోద్యమమ్మా' అని ప్రపంచం బిత్తరపోతుండగానే రెస్టారెంట్ వాళ్లు 'ఎక్స్' వేదికగా ప్రకటన చేశారు. 'మా రెస్టారెంట్‌లో ప్రస్తుతం చెంపదెబ్బలు లేవు. రెస్టారెంట్‌కు రావడానికి ముందు ఈ విషయాన్ని గమనించాలని మనవి' అనేది ఆ ప్రకటన సారాంశం.

పబ్లిసిటీ కోసం చెంపదెబ్బల సంప్రదాయాన్ని ప్రవేశ



పెట్టారా? లేక దీని వెనుక 'ఈ రెస్టారెంట్‌లో చెంపదెబ్బ తింటే కలిసి వస్తుంది' అనే సెంటిమెంట్ దాగుందా అనేది తెలియదుగానీ రుచులతో సంబంధం లేకుండానే ఈ రెస్టారెంట్ పేరు ప్రపంచవ్యాప్తంగా సుపరిచితం అయింది.

చలిపులికి సవాలు విసురుతూ....

మైనస్ 16 డిగ్రీ సెల్సియస్ టెంపరేచర్‌లో చలికి చేతులు కొంకర్లు పోతాయి. అడుగు తీసి అడుగు వేయాలంటే కష్టం. అలాంటి వాతావరణంలో పుషప్‌లు చేయడం అంత ఈజీ కాదు. అయితే ప్రముఖ ఫిట్‌నెస్ కోచ్ నేహా బంగియాకు అలాంటి వాతావరణం అవరోధం కాలేదు. కశ్మీర్‌కు వెళ్లిన నేహా అక్కడి ఆర్మీ సోల్జర్‌తో కలిసి స్పీడ్‌గా పుషప్‌లు చేస్తున్న వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయింది. 'ఇలాంటి అతిశీతల వాతావరణంలో కొన్నిరోజులు ఉండడానికే మాకు కష్టంగా అనిపించింది. మన సైనికులు మాత్రం ఇలాంటి వాతావరణాన్ని కూడా తట్టుకొని దేశంకోసం పనిచేస్తున్నారు' అని కాప్షన్‌లో రాసింది నేహా బంగియా.





ఏమోయి? తెలుసునా మోయి మోయి!

'ఇంటర్‌నెట్టున ఏ నిమిషానికి ఏ ట్రెండు వచ్చునో ఎవరు ఊహించెదరు' అని పాడుకోవాల్సిన టైమ్ ఇది. ప్రస్తుతం 'మోయి మోయి' అనేది వైరల్ ట్రెండ్‌గా మారింది.'టిక్‌టాక్'లో వైరల్ అయిన సెర్బియన్ పాట నుంచి ఈ ట్రెండ్ వచ్చింది. ఈ ట్రెండ్‌లో భాగంగా రకరకాల మీమ్స్, పేరడీలు, రీల్స్ వస్తున్నాయి. 'మోయి మోయి'కి సొంత డ్యాన్స్‌ను కూడా క్రియేట్ చేశారు.

సెర్బియన్ సింగర్-సాంగ్‌రైటర్ టియా డోర 'మోయి మోయి' సాంగ్ యూట్యూబ్‌లో 60 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది. నిజానికి పాటలో 'మోయి మోర్' అని ఉంటుంది. అయితే మిస్టేక్ వల్ల'మోర్' కాస్త 'మోయి'గా మారింది.

తన పాట ట్రెండ్ కావడంతో టియా డోర ఆనందంతో తబ్బిబ్బైపోతూ'థ్రెడ్స్'లో ఇలా స్పందించింది... 'సెర్బియన్ మ్యూజిక్ ప్రపంచవ్యాప్తం కావడం సంతోషంగా ఉంది. ప్రతిరోజూ ప్రపంచం నలుమూలల నుంచి అభినందన సందేశాలు వస్తున్నాయి. ఐ లవ్ యూ'

'మోయి మోయి' ట్రెండ్ నేపథ్యంలో బాలీవుడ్ నటీమణులు ఉర్ఫీ జావెద్, డాలీ సింగ్‌లు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో వైరల్ అయింది. ఈ వీడియోలో ఉర్ఫీ, డాలీసింగ్‌ల 'మోయి మోయి' డ్యాన్స్‌కు ప్రేక్షకులు 'వావ్' అంటున్నారు.



హెల్త్

చెప్పుకోలేని బాధ... ఫిస్టులా!



మల ద్వారం దగ్గర వచ్చే 'ఫిస్టులా' సమస్య బయటకు చెప్పుకోలేని బాధ. మల ద్వారం దగ్గర పెద్ద పేగు తెరచుకుని, జీర్ణమయ్యాక మిగిలిపోయిన వ్యర్థాల్ని అక్కడ్నుంచి బయటకు విసర్జింపచేస్తుంది. అలాంటి ఆ పెద్దపేగు గోడకు రంధ్రాలు పడి... ఆ సన్నటి రంధ్రాలు లోపలివైపునకు పెరుగుతూ పోతే... ఆ కండిషన్‌ను 'ఫిస్టులా' అంటారు. ఇది... మలద్వారం దగ్గరి పెద్దపేగు గోడల్లోకి... సన్నటి క్రాక్‌లు బయల్దేరినట్టుగా లోపలివైపునకు పెరుగుతూ పోతూ, ఇన్ఫెక్షన్లకు తావిస్తూ ఉంటాయి. ఇరుకైన ప్రదేశం... పైగా పేగులోపలి వైపునకు ఇన్ఫెక్షన్ పాకుతూ పోతుండటంతో చికిత్స చేయడం, నయం చేసి తగ్గించడం కష్టమవుతుంది. ఇలాంటి ఈ 'ఫిస్టులా' సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

సాధారణంగా ఫిస్టులా అనేది మలద్వారం గోడ చివరి భాగంలో ఒక గడ్డలా మొదలవుతుంది. ఆ గడ్డను పెరి-యానల్ ఆబ్సెస్ అంటారు. చికిత్స కోసం సర్జరీ చేసినప్పుడు లేదా కొన్నిసార్లు దానంతట అదే గడ్డ చిటికిపోతుంది. ఒకసారి అలా చిటికాక... ఆ గడ్డ ఉన్న ప్రదేశంలో ఓ రంధ్రం మొదలై... అది పేగుగోడలోకి పాకుతూ ఫిస్టులాగా రూపొందుతుంది. మిగతా శరీరంలో ఎక్కడ పుండు అయినా మాన్పడం చాలా తేలిక. కానీ మలం బయటకు రాకుండా ఏర్పాటైన స్ఫింక్టర్ కండరాలు ఉన్న చోటూ, అలాగే ప్రతినిత్యం పై నుంచి వ్యర్థ పదార్థాలు మల రూపంలో వస్తూ ఉండే చోటు కావడంతో నయం కావడం కష్టంగా మారుతుంటుంది.

లక్షణాలు...

పెరీయానల్ ఆబ్సెస్ గడ్డ సరిగ్గా మలద్వారం పెదవి అంచున పెరిగి... పగిలి... ఎప్పటికీ మానని పుండులా అనిపిస్తూ ఉంటుంది. ఒకవేళ మానినా అది తాత్కాలికమే అన్నట్టుగా ఉంటుంది.

ముందస్తు వైద్య పరీక్షలివి... : ఫిస్టులా బాధితులకు చికిత్స చేసే ముందు... వారికి డయాబెటిస్ లేదా కిడ్నీ ఫెయిల్యూర్ వంటి ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉన్నాయా లేవా అన్న విషయాలను తెలుసుకోవాలి. ఉంటే ముందుగా నియంత్రణలో ఉంచుకోవాలి.

- తర్వాత మలద్వారం నుంచి లోపలికి గొట్టాన్ని పంపించి చేసే సిగ్మాయిడోస్కోపీ లేదా కొలనోస్కోపీ వంటి పరీక్షలు చేసి, మలద్వారానికి సంబంధించిన ఇతర వ్యాధులేవీ లేవని నిర్ధారణ చేసుకోవాలి. ఫిస్టులా మొదటిసారే వచ్చి... అది సంక్లిష్టంగా లేనట్లయితే పర్లేదు. కానీ... ఒకవేళ అది మాటిమాటికీ తిరగబెడుతుంటే, దాని తీవ్రతను తెలుసుకునేందుకు ఫిస్టులోగ్రామ్ అనే పరీక్ష చేయాలి. ఎమ్మార్ ఫిస్టులోగ్రామ్ ద్వారా కూడా ఈ పరీక్ష చేయవచ్చు.
- ఫిస్టులాకు శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించే ముందుగా కూడా ఈ ఎమ్మార్ ఫిస్టులోగ్రామ్ చేస్తారు.
- మలద్వారం ద్వారా ఫిస్టులాలోకి అల్ట్రాసౌండ్ ప్రోబ్ అనే ఉపకరణాన్ని లోపలికి పంపుతూ చేసే 'ఎండో-యానల్ అల్ట్రాసౌండ్' అనే పరీక్షతో ఫిస్టులా అన్నది పెద్దపేగు గోడల్లోకి ఎంత లోపలికి వ్యాపించిందో తెలుసుకోవచ్చు.

ఫిస్టులాకు చికిత్సలు...

- **దారంతో చికిత్స:** మందు పూసి ఉన్న ఒక దారాన్ని ఫిస్టులా ముఖద్వారం గుండా... ఆ పైప్‌లోలోనికి వెళ్లగలిగినంత మేరకు ప్రవేశపెట్టే చికిత్స నిర్వహిస్తారు. అప్పుడు ఆ దారానికి అంటి ఉన్న మందు... ఫిస్టులా పైప్‌ను క్రమంగా లోపలి నుంచి ముఖద్వారం వైపునకు మూసుకుపోయేలా చేస్తుంది. ఇలా చేసే చికిత్సలో మలద్వారం స్ఫింక్టర్‌కు అతి తక్కువ నష్టం (డ్యామేజ్) జరుగుతుంది. ఇది ఒకే సిట్టింగ్‌లో కాకుండా... అనేక సిట్టింగ్‌లలో చేసే చికిత్స.
- **ఫిస్టులా ముఖ ద్వార మార్గాన్ని మూసివేసే శస్త్ర చికిత్స:** శరీరంలో మరోచోట ఉన్న మ్యూకోజా కండరాలను సేకరించి ఫిస్టులా ముఖద్వార మార్గాన్ని 'మ్యూకోజల్ అడ్వాన్స్‌మెంట్ ఫ్లాప్' అనే శస్త్ర చికిత్స ద్వారా మూసేస్తారు.
- **వ్యాఫ్ట్ శస్త్రచికిత్స:** 'వ్యాఫ్ట్' అనే సంక్షిప్త రూపానికి... 'వీడియో అసిస్టెడ్ యానల్ ఫిస్టులా ట్రీట్‌మెంట్' విస్తరణ రూపం. ఇందులో బాగా చిన్నదీ, అతి సునిశితమైనదీ అయిన ఓ టెలిస్కోప్‌కు అత్యంత చిన్నదైన వీడియో కెమెరాను అమర్చి ఫిస్టులా పైప్ లోపలికి పంపుతారు. ఫిస్టులా లోపలి మార్గాలను స్పష్టంగా చూస్తూ... క్రమంగా లోపలి నుంచి ఫిస్టులా మార్గాల్ని మూసుకుపోయేలా కాల్చేస్తూ బయటి వైపునకు వస్తారు. ఈ ప్రక్రియను కాటరైజేషన్ అంటారు. లోపల్నించి ఇలా కాటరైజ్ చేస్తూ వస్తున్నందున క్రమంగా ఫిస్టులా మానిపోతుంది.
- ఫిస్టులా పైప్‌లోకి కొన్ని పూడిక పదార్థాలను ఇంజెక్షన్ ద్వారా పంపి, ఆ మార్గమంతా పూడిపోయేలా చేయడం కూడా ఒక చికిత్సా ప్రక్రియ. ఇది గతంలో చేసే పాత పద్ధతి. ఇప్పుడిలా ఎవరూ పెద్దగా చేయడం లేదు.
- **అరుదుగా కొలొస్టమీ :** ఫిస్టులా పదే పదే తిరగబెడుతూ ఇబ్బంది పెడుతుంటే... మల ద్వారాన్ని కొన్నాళ్లపాటు మూసేసే 'కొలొస్టమీ' శస్త్రచికిత్స చేస్తారు. ఇలా చేయాల్సి వచ్చినప్పుడు మలం బయటకు వెళ్లడానికి శస్త్ర చికిత్సతో మరో మార్గాన్ని ఏర్పరచి, అప్పుడు మల ద్వారాన్ని మూసేస్తారు. ఇది చేయడం వల్ల మాటిమాటికీ ఆ మార్గంలో మలం ప్రయాణం చేయదు కాబట్టి ఫిస్టులా పైపులను మూసేయడానికి చేసే చికిత్స సులువవుతుంది.

ఫిస్టులా రకాలు...

- పగిలిన పుండు తెరచుకునే ప్రదేశం ఆధారంగా ఫిస్టులాను రెండు రకాలుగా చెప్పవచ్చు. మొదటిది లో- ఫిస్టులా. ఫిస్టులా తెరచుకునే ముఖద్వారం సరిగ్గా మలద్వారం అంచునే ఉండి, బయటకు కనిపిస్తుంటే దాన్ని లో- ఫిస్టులాగా అంటారు.
- ఇక ఈ పగిలిన ఆబ్సెస్ ఏర్పరచిన రంధ్రం అంతకంటే లోపల (అంటే మలద్వారం లోపలే) ఉంటే దాన్ని హై - ఫిస్టులాగా చెబుతారు.
- కొన్నిసార్లు ఈ ఫిస్టులా ముఖద్వారం... మలద్వారాన్ని మూసి ఉంచే స్ఫింక్టర్ కండరాల్లో ఉండవచ్చు. కొన్ని సందర్భాల్లో ఫిస్టులా అన్నది కేవలం ఒకే పైప్‌లా కాకుండా అనేక పైప్‌లు కలిసిన కాంప్లెక్స్ ట్రాక్స్ (సంక్లిష్ట మార్గాల్లా) కూడా ఉండవచ్చు.

నివారణ ఇలా...

శస్త్రచికిత్స తర్వాత లేదా ముందు నుంచే ఫిస్టులా రాకుండా నివారించుకోవడానికి గాని కొన్ని సూచనలు పాటించడం అవసరం. అవి... మలబద్ధకం లేకుండా చూసుకోవడం, సుదీర్ఘకాలం కూర్చుని ఉండకుండా పనిచేసే సమయంలో తరచూ కుర్చీలోంచి లేస్తూ ఉండటం, బిగుతైన దుస్తులు ధరించకుండా కాస్తంత వదులైన దుస్తులు ధరించడం వంటి సూచనల ద్వారా ఫిస్టులాను చాలావరకు నివారించవచ్చు.



డా॥ ప్రశాంత్ కొయ్యాడ
సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్

పుట్టు కామెర్లు!

అప్పుడే పుట్టిన చిన్నారికి ఎదురయ్యే వైద్య సమస్య 'పుట్టుకామెర్లు'! తమ బతుకు పోరాటం మొదలుపెట్టే పెట్టకముందే కనీసం 60 శాతం మంది బుజ్జిపాపాయిలకు ఈ సమస్య ఎదురవుతుంది. చాలామందిలో దానంతట అదే తగ్గిపోయే ఈ సమస్యను చూసి... అప్పుడే బిడ్డనెత్తుకున్న తల్లులూ, తండ్రులూ బెంబేలెత్తుతారు. పైగా బిడ్డను కాపాడుకోవడానికి తమకు తెలిసిన గృహ వైద్యాలూ, చిట్కావైద్యాలు చేస్తారు. అసలు సమస్య కంటే ఆదుర్దాలో తెలిసీతెలియక చేసే ఈ వంటగది చిట్కావైద్యాలే కొన్నిసార్లు ప్రమాదకరంగా పరిణమించవచ్చు. ఈ సమస్యపై అవగాహన కోసం, అపోహలు తొలగించుకోవడం కోసం ఉపయోగపడేదే ఈ కథనం.



బిడ్డపుట్టిన ఆనందాన్ని కాసేపు కూడా ఉండనివ్వకుండానే దాపురించే ఈ సమస్య అసలు ఎందుకొస్తుందనే సందేహం చాలామందిలో ఉంటుంది. పైగా అప్పటికి బిడ్డ ఏదీ తినలేదూ... తాగలేదు. అంతలోనే... కొత్తగా ఈలోకంలోకి వచ్చీరాగానే వచ్చే పుట్టుకామెర్లకు కారణం తెలుసుకోవాలనే ఆసక్తి కూడా ఉంటుంది.

పుట్టుకామెర్లు ఎందుకొస్తాయంటే...?

అప్పుడే పుట్టిన బిడ్డ తాలూకు చిన్ని కాలేయానికి... బిడ్డలో స్రవించే బిలురుబిన్‌ను ప్రాసెస్ చేసే సామర్థ్యం ఇంకా అలవడదు. దాంతో... జీర్ణ వ్యవస్థలోకి వెళ్లాల్సిన ఆ బిలురుబిన్ రక్తంలో కలుస్తుంది. ఫలితంగా కామెర్లు బయటపడతాయి. అయితే... సమయం గడిచే కొద్దీ కాలేయం తన సామర్థ్యాన్ని పెంచుకుంటుంది. దాంతో బిలురుబిన్‌ను ప్రాసెస్ చేయడం మొదలుపెడుతుంది. ఫలితంగా ఈ కామెర్లు వారం లోపే తగ్గిపోతాయి.

చికిత్స ఎప్పుడంటే?

జీవకార్యకలాపాలు మొదలు కాగానే... వాటిని పూర్తిగా నిర్వహించలేకపోవడంతో వచ్చే (పుట్టు)కామెర్లు కావడంతో వీటిని ఫిజియలాజికల్ జాండిస్ అంటారు. ఫిజియలాజికల్ కార్యకలాపాలు ముమ్మరం కాగానే తగ్గుతాయి కాబట్టి వాటికి ఆ పేరు. అయితే కొన్నిసార్లు... (చాలా అరుదుగానే)... అవి కాస్త ప్రమాదకరంగా మారవచ్చు. అప్పుడు వాటిని పాథలాజికల్ జాండిస్ లేదా ఎగ్జాజరేటెడ్ జాండిస్ అంటారు.

పాథలాజికల్ జాండిస్ ఎందుకంటే...?

కొన్ని అంశాలు పాథలాజిల్ జాండిస్ / ఎగ్జాజరేటెడ్ జాండిస్‌కు దారితీస్తాయి. ఉదాహరణకు... పుట్టిన బిడ్డకు ఉన్న బ్లడ్‌గ్రూపునకూ, తల్లి బ్లడ్ గ్రూపునకు మధ్య సమన్వయం కుదరనప్పుడు;

- తల్లులు బిడ్డలకు సరైన రీతిలో పాలు పట్టకపోవడంతో బిడ్డల్లో ద్రవాహారంలో లోపాలు, ఖనిజ లవణాల లోపం రావడం (డీ-హైడ్రేషన్)తో
- బిడ్డలో స్రవించే జీ6పీడీ అనే ఎంజైమ్ లోపించడం... వంటి సమస్యలతో కామెర్లు మరింత పెరగవచ్చు.

చికిత్సలు...

జాండిస్ పెరిగినప్పటికీ... ఇప్పుడున్న వైద్యసదుపాయాలతో ఆ పరిస్థితిని తేలిగ్గా చక్కదిద్దవచ్చు. బిడ్డలో స్రవిస్తున్న అదనపు బిలురుబిన్‌ను తొలగించడం ద్వారా ఈ పరిస్థితిని అధిగమించవచ్చు. దీనికి చేయాల్సిందల్లా బిడ్డకు తగినంత ద్రవాహారం లభ్యమయ్యేలా చూడటమే. అంటే... బిడ్డకు పుష్కలంగా తల్లిపాలు అందేలా చూడాలి.

దీనికి తోడు ఫొటోథెరపీ అనే చికిత్సలో బిడ్డను కొన్నిరకాల కాంతిపుంజాలకు ఎక్స్‌పోజ్ చేయడం ద్వారా డాక్టర్లు పరిస్థితిని చక్కదిద్దుతారు. చాలా అరుదైన సందర్భాల్లో... పరిస్థితి మరింత జటిలం అయినప్పుడు బిడ్డకు రక్తమార్పిడి చికిత్స చేయాల్సి రావచ్చు.

అపోహలూ... మూఢనమ్మకాలు

ఇంత తేలిగ్గా అధిగమించగల సమస్యను కొందరు తమ అపోహలతో, మూఢనమ్మకాలతో పరిస్థితిని మరింత తీవ్రరూపం దాల్చేలా చేస్తారు.

కొత్తగా తల్లిదండ్రులైన వారు తెలుసుకోవాల్సిన విషయాలివి...

- తల్లి పాలు పట్టడం వల్ల బిడ్డలో కామెర్లు మరింతగా పెరుగుతాయనేది కేవలం అపోహ మాత్రమే. నిజానికి తల్లిపాలతో ఎలాంటి హానీ ఉండకపోగా... తల్లిపాలు పట్టడం వల్లనే బిడ్డకు తగినన్ని ద్రవాలు సమకూరి (హైడ్రేషన్ జరిగి) అది జాండిస్ తగ్గడానికి దోహదపడుతుంది.
- బిడ్డకు నీళ్లు పట్టించడం లేదా కొన్ని ద్రవాల మిశ్రమాన్ని ఇవ్వడం ద్వారా ఈ కామెర్లకు చికిత్స చేయవచ్చునని కొందరు చెబుతారు. కానీ... హైడ్రేషన్ దీనికి మంచిదే అయినప్పటికీ అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లి పాలకు మించిన ఆహారం లేదు. కాబట్టి నీళ్లు పట్టించడం, ఇతర ద్రవాల మిశ్రమాలు అప్పుడే పుట్టిన బిడ్డకు ఇవ్వడం ఎంతమాత్రమూ సరికాదు. మంచిదీ కాదు.
- ఉదయపు లేత ఎండ కాంతి పుట్టుకామెర్లకు మంచి చికిత్స అని కొందరు భావిస్తారుగానీ.. లేత ఎండ ద్వారా చర్మం గ్రహించే కాంతితోనే మొత్తం జాండిస్ తగ్గదు. పూర్తిగా తగ్గాలంటే ఫొటో థెరపీ చికిత్సను బిడ్డకు అందించాలి. పైగా ఒక్కోసారి ఎండ వల్ల చర్మం కమిలి బిడ్డకు సన్‌బర్న్స్ రావచ్చు.
- ఇళ్లలోని ట్యూబ్‌లైట్ కాంతితోనూ పుట్టుకామెర్లకు చికిత్స చేస్తేచాలని కొందరు అపోహ పడుతుంటారు. ఆసుపత్రిలో ఈ చికిత్సకు ఉపయోగించే లైట్... మన ఇంటి ట్యూబ్‌లైట్ లాగానే అనిపించినా, ఆ కాంతి వెలువరిచే వేవ్‌లెంగ్త్ వేరు... చికిత్సలో ఉపయోగించే తరంగాల వేవ్‌లెంగ్త్ వేరు.

పుట్టుకామెర్ల (ఫిజియలాజికల్ జాండిస్) వల్ల బిడ్డ మానసిక, శారీరక ఎదుగుదలకు ఎలాంటి లోపమూ ఉండదు. ఇది తాత్కాలికంగా వచ్చిపోయే చిన్ని సమస్య అని గుర్తిస్తే... అప్పుడు బిడ్డను కన్న కొత్త తల్లిదండ్రులకు చిన్నారి సమస్య పట్ల అవగాహన, భరోసాతో పాటు, బిడ్డపుట్టిన ఆనందమూ సొంతమవుతుంది.



డా॥ లక్ష్మీ వేద ప్రకాశ్
సీనియర్ నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్

పొట్టలో గ్యాస్ సమస్య తగ్గించుకోవడం ఇలా...

పొట్టలోని గ్యాస్ చేరి అది బయటకు వెళ్లేవరకు బాధితులకు ఓ సమస్యే. కొన్నిసార్లు గ్యాస్ వల్ల ఛాతీలో నొప్పి వచ్చి, అది గుండెపోటేమో అన్న అనుమానం కలిగించి, మానసికంగా, ఆర్థికంగా కూడా సమస్యాత్మకమవుతుంది.

గ్యాస్ సమస్యను అధిగమించడం ఎలాగంటే...

- మెల్ల మెల్లగా బాగా నమిలి తినాలి. తక్కువ మోతాదుల్లో ఎక్కువసార్లు తినాలి.
- తినేటప్పుడు గాలి నోట్లో పోకుండా, పెదవులను మూసి ఆహారాన్ని నమలాలి.
- కొవ్వు ఎక్కువగా ఉండేవీ, డీప్ ఫ్రై వేపుళ్ల వీలైనంత తక్కువగా తీసుకోవాలి.
- పాలల్లో ల్యాక్టోజ్ రహిత పాలు, పాల ఉత్పాదనలను తీసుకోవడం మేలు.
- సోడాలు, కార్బొనేటెడ్ డ్రింక్స్, కూల్‌డ్రింక్స్ వంటి బీవరేజెస్‌కు దూరంగా ఉండాలి.
- కాఫీ, టీ పరిమితంగా తీసుకోవాలి.
- రోజూ కనీసం రెండు లీటర్ల కంటే ఎక్కువగా మంచినీళ్లు తాగాలి.
- బరువు పెరగకుండా చూసుకోవాలి. రోజూ వ్యాయామం చేస్తూ చురుగ్గా ఉండాలి.
- పొగతాగడం పూర్తిగా మానేయాలి. ఆల్కహాల్ బీవరేజెస్‌కు దూరంగా ఉండాలి.
- కట్టుడు పళ్లు ఉన్నవారు డెంటిస్ట్ సహాయంతో అవి సరిగా అమరేలా చూసుకోవాలి.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 | సంచిక: 259

SUNDAY Special | ఆదివారం | 10-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



కాశ్వీ బన్‌గయీ కరోడ్‌పతి

ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్ కోసం జరిగిన మినీ వేలంలో అత్యధికంగా కాశ్వీ గౌతమ్‌కు రూ. 2 కోట్లు దక్కాయి.

- వివరాలు 12లో



మోదీ హామీలపైనే ప్రజలకు భరోసా

తప్పుడు హామీలతో విపక్షాలు సాధించేదేమీ ఉండదని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. కానీ ఈ వాస్తవాన్ని అవి ఇప్పటికీ అర్థం చేసుకోవడం లేదన్నారు.

- వివరాలు 6లో



అసెంబ్లీల్లో కొత్తనీరు

దేశవ్యాప్తంగా చట్టసభల్లోకి కొత్త నీరు చేరుతోంది. తాజాగా ముగిసిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ధోరణి కన్పించింది.

- వివరాలు 6లో



మాట వినే లక్షణమేదీ?

నేటి సమాజంలో ఇతరులు చెప్పేది వినే లక్షణం లోపిస్తోందని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆవేదన వెలిబుచ్చారు.

- వివరాలు 6లో



పది అల్మారాలు.. రూ. 290 కోట్లు

ఒడిశా కేంద్రంగా పనిచేస్తున్న డిస్టిలరీ గ్రూప్, అనుబంధ సంస్థల్లో ఐటీ అధికారులు చేపట్టిన సోదాల్లో భారీగా నల్లధనం వెలుగులోకి వస్తోంది. మొత్తంగా రూ.290 కోట్ల వరకు ఉండొచ్చని చెబుతున్నారు. ఇప్పటి వరకు లెక్కించిన రూ.250 కోట్లను అధికారులు ఒడిశాలోని ఎస్‌బీఐ శాఖల్లో జమ చేశారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్


ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీ



తెలంగాణ శాసనసభ ప్రొటెమ్ స్పీకర్‌గా చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ శనివారం ప్రమాణం చేశారు. శనివారం ఉదయం 8.30కు రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఒవైసీతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రమాణం చేయించారు.

- వివరాలు 11లో

14న స్పీకర్ ఎన్నిక



రాష్ట్ర మూడో శాసనసభ తొలి విడత సమావేశాలు ఈ నెల 14న ప్రారంభమై 16 వరకు కొనసాగే అవకాశముంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో స్పీకర్ ఎన్నిక, గవర్నర్ ప్రసంగం, గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు వంటి అంశాలు ఎజెండాలో ఉంటాయి.

- వివరాలు 11లో

సలహాదారులకు ఉద్వాసన

గత ప్రభుత్వం నియమించిన సలహాదారుల పదవులను రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక తొలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న రాజీవ్‌శర్మ, డీజీపీగా కొనసాగిన అనురాగ్ శర్మలు ఇంతకాలం సలహాదారులుగా కొనసాగుతున్నారు. వీరి పదవీ కాలం శుక్రవారంతోనే ముగిసిందని సీఎస్ స్పష్టం చేశారు.

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



మీరు ఇలా చెబితే..
ఇంకెవరు పోటీ చేస్తారులెండి సార్!

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రులు సీతక్క, కొండా సురేఖ. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి, పొన్నం, మాణిక్‌రావ్ ఠాక్రే, పొంగులేటి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, సీఎస్ శాంతికుమారి



గ్యారంటీగా అమలు చేస్తాం

100 రోజుల్లో హామీలన్నీ నిలబెట్టుకుంటాం

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

2లో

కొలువుదీరిన మూడో శాసనసభ



- ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించిన ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్
- అక్బరుద్దీన్ సహా ప్రమాణం చేసిన 101 మంది ఎమ్మెల్యేలు..
- కేసీఆర్ సహా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకాని 18 మంది సభ్యులు

11లో

సీనియర్లకు ప్రాధాన్యం.. జూనియర్లకు కీలకం

మంత్రులకు శాఖలను కేటాయించిన సీఎం రేవంత్

- పురపాలక, హోం శాఖలు రేవంత్ వద్దనే..
- భట్టికి ఆర్థిక, విద్యుత్.. ఉత్తమ్‌కు పౌరసరఫరాలు, సాగునీరు
- విద్య, వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్లు సహా పలు శాఖలు పెండింగ్... మిగతా ఆరుగురు మంత్రులు ఖరారయ్యాక వారికి కేటాయింపు

2లో

మంత్రులకు శాఖల కేటాయింపు ఇలా..

మంత్రి	శాఖలు
ఎ.రేవంత్‌రెడ్డి (సీఎం)	పురపాలక-పట్టణాభివృద్ధి, సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు (హోం), మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు
మల్లు భట్టి విక్రమార్క	ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖలు
ఉత్తమ్‌కుమార్‌రెడ్డి	సాగునీరు, ఆయకట్టు అభివృద్ధి, ఆహారం-పౌరసరఫరాలు
దామోదర రాజనర్సింహ	వైద్యం-ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, శాస్త్ర-సాంకేతిక శాఖలు
కోమటిరెడ్డి వెంకటరెడ్డి	రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ
దుద్దిళ్ల శ్రీధర్‌బాబు	ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, వాణిజ్యం-పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు
పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి	రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖలు
పొన్నం ప్రభాకర్	రవాణా, బీసీ సంక్షేమం
కొండా సురేఖ	దేవాదాయ, అటవీ-పర్యావరణం
సీతక్క	పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి (గ్రామీణ నీటి సరఫరా), మహిళా-శిశు సంక్షేమం
తుమ్మల నాగేశ్వర్‌రావు	వ్యవసాయం, మార్కెటింగ్-సహకార, చేనేత-జౌళి
జూపల్లి కృష్ణారావు	ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటక-సాంస్కృతిక-పురావస్తు శాఖలు

• కోలుకుంటున్న కేసీఆర్



యశోద ఆస్పత్రిలో వైద్యుల సమక్షంలో వాకర్ సాయంతో నడుస్తున్న కేసీఆర్

బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష నేతగా కేసీఆర్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న పార్టీ శాసనసభ్యులు
- పోచారం ప్రతిపాదన.. కడియం, తలసాని మద్దతు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో బీఆర్‌ఎస్ శాసన సభా పక్ష నేతగా పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన ఆ పార్టీ ఎమ్మెల్యేలు శనివారం ఉదయం 9 గంటలకు తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్, ఆయనకు తోడుగా ఉన్న పార్టీ

మిగతా 3వ పేజీలో ▶

మాజీ మంత్రుల ఆఫీసుల్లో దస్త్రాల చోరీ!

- పశుసంవర్ధక శాఖలో ఫైల్స్ తరలించుకుపోయారని ఫిర్యాదు
- మాజీ మంత్రి తలసాని ఓఎస్డీపై కేసు నమోదు
- విద్యా పరిశోధన కేంద్రంలోనూ ఫైల్స్ ఎత్తుకెళ్లినట్టు ప్రచారం
- పోలీసులు రావడంతో పరారైన వ్యక్తులు

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ కల్యాణ్‌పై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మాసబ్‌ట్యాంక్‌లోని పశు సంవర్ధకశాఖ కార్యాలయంలోనికి అక్రమంగా ప్రవేశించిన కల్యాణ్ బీరువాలో ఉన్న దస్త్రాలను కారులో తరలించుకునిపోయారు. వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేశారు. అతడికి సహకరించిన కంప్యూటర్ ఆపరేటర్స్ ఎలిజ మోహన్, అటెండర్లు వెంకటేశ్, ప్రశాంత్‌లపైనా కేసులు నమోదు చేశారు.

- వివరాలు 13లో

టాప్ కాలేజీల్లో ఇంజనీరింగ్ సీట్ల పరిమితి ఎత్తివేత!

2024 నుంచి అమలుకు సన్నాహాలు

- మూడేళ్ల ఫలితాలు, నియామకాలు కొలమానం
- రాష్ట్రంలో పది కాలేజీలకు ఈ హోదా లభించే అవకాశం
- ముసాయిదా విడుదల చేసిన ఏఐసీటీఈ
- డ్రాఫ్ట్‌పై తెలంగాణ ఉన్నతాధికారుల సమీక్ష

14లో

అతడి గుండె చెదురుతోంది!

మహిళలతో పోలిస్తే పురుషుల్లోనే గుండెపోటు మరణాలు ఎక్కువ

- గతేడాది రాష్ట్రంలో 284 మంది గుండెపోటుతో మృతి
- ఇందులో 257 మంది పురుషులు; 27 మంది మహిళలు

14లో

'రైతుబంధు' ఇంకా ఇవ్వలేదేం?

- ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో డబ్బు ఎందుకు జమ చేయలేదు?
- రూ. 500 బోనస్ ఇచ్చి వడ్లు కొంటామన్న హామీని నిలబెట్టుకోవాలి
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

అధికారంలోకి రాగానే రైతుబంధును పెంచిన డబ్బును రైతుల ఖాతాల్లో వేస్తామన్న మాటేమైందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో డిసెంబర్ 9న రైతుబంధు సొమ్మును రైతుల ఖాతాల్లో వేస్తామని చెప్పారని, ఇచ్చిన మాటపై రైతులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- వివరాలు 3లో



శనివారం హైదరాబాద్‌లో అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు



అమర వీరుల స్మారకం వద్ద వారి త్యాగాలను స్మరించుకుంటున్న బీఆర్‌ఎస్ శాసన సభ్యులు, నేతలు



అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు

సీనియర్లకు ప్రాధాన్యం.. జూనియర్లకు కీలకం

మంత్రులకు శాఖలను కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి

- భట్టికి ఆర్థిక, విద్యుత్.. ఉత్తమ్‌కు పౌరసరఫరాలు, సాగునీరు
- కోమటిరెడ్డికి ఆర్‌అండ్‌బీ.. దామోదరకు వైద్యారోగ్యం.. తుమ్మలకు వ్యవసాయం
- జూపల్లికి ఎక్సైజ్, టూరిజం.. కొండా సురేఖకు అటవీ... పొంగులేటికి రెవెన్యూ
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిగా సీతక్క.. పొన్నంకు రవాణా, బీసీ సంక్షేమం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ కేబినెట్ ఏర్పాటైన మూడో రోజున మంత్రులకు శాఖల పంపిణీ జరిగింది. మంత్రివర్గ సహచరులకు సీఎం రేవంత్ శనివారం శాఖలను కేటాయించారు. పురపాలక, హోంశాఖలను తన వద్దనే పెట్టుకున్న రేవంత్.. విద్య, వాణిజ్య పన్నులు, స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, పశుసంవర్ధక శాఖ, కార్మిక, దళిత అభివృద్ధి, మైనార్టీ, ఎస్టీ సంక్షేమ శాఖలను పెండింగ్‌లో పెట్టారు. మరో ఆరుగురిని మంత్రివర్గంలోకి తీసుకునే వెసులుబాటు ఉండటంతో వారి నియామకం తర్వాత శాఖలను కేటాయించనున్నారు.

సీనియర్లకు తగిన ప్రాధాన్యమిస్తూ..

మంత్రులకు శాఖల కేటాయింపులో అటు పార్టీ అధిష్టానం, ఇటు సీఎం రేవంత్ మార్కు స్పష్టంగా కనిపించిందని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. సీనియర్ ఎమ్మెల్యేలు, గతంలో మంత్రులుగా పనిచేసిన నేతలకు ప్రాధాన్య శాఖలు దక్కాయని అంటున్నాయి. ఉప ముఖ్యమంత్రి హోదాలో భట్టికి రెండు కీలక శాఖలు కేటాయించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక, విద్యుత్ ఇబ్బందుల దృష్ట్యా.. ప్రభుత్వాన్ని సజావుగా నడపడంలో కీలకమైన ఆర్థిక, విద్యుత్ శాఖలను ఆయనకు కేటాయించారు. భట్టి మంత్రిగా పనిచేయడం మొదటిసారే అయినా అపార రాజకీయ అనుభవంతో ఈ రెండు శాఖలను నెట్టుకురాగలరన్న నమ్మకంతోనే అప్పజెప్పారనే చర్చ జరుగుతోంది. ఇక గతంలో మంత్రిగా పనిచేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నదీ జలాల పంపిణీ, ప్రాజెక్టులు వంటి కీలక అంశాలను పర్యవేక్షించాల్సిన సాగునీటి శాఖ, ప్రజలతో నేరుగా సంబంధముండే పౌరసరఫరాల శాఖను కేటాయించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రోడ్లు, భవనాల శాఖ అప్పగించడం కూడా వ్యూహంలో భాగమేనని.. ఎంపీగా జాతీయ స్థాయిలో మంచి సంబంధాలున్న వెంకట్‌రెడ్డి జాతీయ రహదారుల విషయంలో చురుకుగా వ్యవహరించగలరనే అంచనా ఉందని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి.

శ్రీధర్‌బాబుకు కీలక బాధ్యతలు

కాంగ్రెస్ మరో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కీలకమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), వాణిజ్యం–పరిశ్రమల శాఖలతోపాటు శాసనసభా వ్యవహారాలనూ అప్పగించారు. అసెంబ్లీలో ప్రతిపక్షం బలంగా ఉన్న నేపథ్యంలో ఫ్లోర్ మేనేజ్‌మెంట్‌కు ఆయన అనుభవం ఉపయోగపడుతుందన్న అంచనా, సభా వ్యవహారాలు, రూలింగ్స్‌పై పట్టు ఉండటం నేపథ్యంలో.. శ్రీధర్‌బాబుకు శాసనసభా వ్యవహారాల శాఖ ఇచ్చారని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. మరో సీనియర్ నేత దామోదర రాజనర్సింహకు పేదల ఆరోగ్యాన్ని కాపాడే మెడికల్ అండ్ హెల్త్ శాఖను కేటాయించారు. రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చిపెట్టే ప్రధానమైన ఎక్సైజ్‌తోపాటు పర్యాటక శాఖను జూపల్లి కృష్ణారావుకు అప్పగించారు. రైతుల అంశానికి సంబంధించి కీలకమైన వ్యవసాయ శాఖను తుమ్మల నాగేశ్వరరావుకు ఇచ్చారు. గతంలో మంత్రిగా పనిచేసిన మహిళా నేత కొండా సురేఖకు అటవీ, పర్యావరణం, దేవాదాయశాఖలను అప్పగించారు. గత ప్రభుత్వం హరిత హారం వంటి కార్యక్రమాలను నిర్వహించిన నేపథ్యంలో అటవీ శాఖకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా సురేఖకు ఈ శాఖ అప్పగించారని నేతలు చెప్తున్నారు.

తొలిసారి మంత్రులు అయినా..

ఇప్పుడే తొలిసారి మంత్రి అయినవారికీ ప్రాధాన్య శాఖలు లభించాయి. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి పదవి చేపట్టిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎంతో సీనియార్టీ ఉన్న మంత్రులకిచ్చే రెవెన్యూ శాఖను అప్పగించారు. ధరణి పోర్టల్, భూసంబంధిత వ్యవహారాలకు సంబంధించిన ఈ శాఖను నిర్వహించడం పొంగులేటికి కత్తిమీద సాము వంటిదేనని, అయినా ప్రజలతో మమేకమై ఉండే పొంగులేటి ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలరన్న నమ్మకం ఉందని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. దీనికితోడు గృహ నిర్మాణం, సమాచార శాఖలను కూడా ఆయనకు అప్పగించారు. ఇక సీతక్కకు ప్రజాసంబంధాలు ఉండే పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధితోపాటు మహిళాశిశు సంక్షేమ శాఖలను ఇచ్చారు. మరో కొత్త మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కీలకమైన రవాణా, బీసీ సంక్షేమ శాఖలను అప్పగించడం గమనార్హం. మొత్తమ్మీద పాత, కొత్త కలయిక, అనుభవానికి తగిన ప్రాధాన్యం, కొత్తవారైనా నమ్మకంతో మంత్రులకు శాఖల పంపిణీ ఉందనే చర్చ జరుగుతోంది.

పెండింగ్‌లో ఉన్న శాఖలు ఇవీ..

విద్య, వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్లు, పశుసంవర్ధకం, కార్మిక, దళిత అభివృద్ధి, ఎస్టీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమం. మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు.

ఆ జిల్లాలకు.. అవే శాఖలు

బీఆర్‌ఎస్ సర్కారులో ఏయే జిల్లాల మంత్రులు ఏయే ప్రభుత్వ శాఖలు నిర్వహించారో.. తాజాగా కాంగ్రెస్ సర్కారులో ఆ జిల్లాలకు చెందిన మంత్రులకు దాదాపుగా అవే శాఖలు రావడం విశేషం. బీఆర్‌ఎస్ సర్కారులో వరంగల్‌కు చెందిన ఎర్రబెల్లి దయాకర్‌రావు పంచాయతీరాజ్ బాధ్యతలు నిర్వహించగా.. ఇప్పుడు అదే జిల్లాకు చెందిన సీతక్కకు ఆ శాఖ కేటాయించారు. గత సర్కారులో ఎక్సైజ్ మంత్రిగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శ్రీనివాస్‌గౌడ్ పనిచేయగా.. ఇప్పుడు అదే జిల్లాకు చెందిన జూపల్లి కృష్ణారావుకు ఆ శాఖ దక్కింది. బీసీ సంక్షేమ మంత్రిగా కరీంనగర్‌కు చెందిన గంగుల కమలాకర్ పనిచేయగా.. ఇప్పుడు అదే జిల్లాకు చెందిన పొన్నం ప్రభాకర్‌కు ఈ శాఖను కేటాయించారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన హరీశ్‌రావు గత ప్రభుత్వంలో వైద్యారోగ్య శాఖ నిర్వహించగా.. ఇప్పుడు అదే జిల్లాకు చెందిన దామోదర రాజనర్సింహ ఆ శాఖను నిర్వహించనున్నారు.

మంచి శాఖలు కేటాయించారు, ప్రజలకు సేవచేస్తా..

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్/కాచిగూడ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖలను తనకు కేటాయించడంపట్ల మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో సీతక్క మాట్లాడుతూ.. తనకు మంచి శాఖలను కేటాయించారని, గ్రామస్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. సర్పంచ్‌ల సమస్యలపై దృష్టి సారిస్తామని తెలిపారు. తండాలను పంచాయతీలుగా చేసినా వాటి అభివృద్ధికి గత ప్రభుత్వం నిధులు కేటాయించలేదని, అడవి బిడ్డగా గిరిజన, ఆదివాసీ తెగలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కాగా, మంత్రి సీతక్కను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పలువురు బీసీ నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బీసీల సమస్యలు పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేత నీరడి భూపేష్ సాగర్, నీలం వెంకటేష్, వేముల రామకృష్ణ, నిఖిల్ పాల్గొన్నారు.



మంత్రి సీతక్కను కలసి అభినందనలు తెలియజేస్తున్న ఆర్.కృష్ణయ్య, ఇతర బీసీ నేతలు




భువనగిరిలో ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణిస్తూ జీరో చార్జీ టికెట్‌లు చూపుతున్న మహిళలు. హైదరాబాద్‌లో సిటీ బస్సెక్కిన మహిళల సంతోషం

గ్యారంటీగా అమలు చేస్తాం

100 రోజుల్లో హామీలన్నీ నిలబెట్టుకుంటాం

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- సోనియాగాంధీ స్ఫూర్తి, ఆలోచనలతోనే ఆరు గ్యారంటీలు
- గతంలో తెలంగాణ ఇచ్చి మాట నిలబెట్టుకున్నాం
- ఇప్పుడు సంక్షేమ, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ''తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని 2004లో కరీంనగర్ గడ్డ మీద సోనియాగాంధీ మాట ఇచ్చారు. ఆ మాట మీద నిలబడి 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. నాది తెలంగాణ అని గర్వంగా చెప్పుకొనే అవకాశం కల్పించారు. ఆ స్ఫూర్తి, ఆలోచనతోనే ఈ ఏడాది సెప్టెంబర్ 17న తుక్కుగూడ సభలో ఆరు గ్యారంటీల పేరుతో రాష్ట్ర ప్రజలకు హామీలు ఇచ్చారు. ఆ ఆరు గ్యారంటీల్లో రెండింటిని సోనియా జన్మదినం సందర్భంగా శనివారం నుంచి అమల్లోకి తెస్తున్నాం. తెలంగాణ ఇచ్చినట్టుగానే ఆరు గ్యారంటీలనూ అమలు చేస్తాం..''అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. శనివారం శాసనసభలో కొత్త ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం.. అసెంబ్లీ ప్రాంగణంలోనే చేయూత, మహాలక్ష్మి పథకాలకు పచ్చజెండా ఊపారు. 'చేయూత'పథకం కింద రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంపు, 'మహాలక్ష్మి'పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ, ఇతర మంత్రులు, శాసనసభ్యులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. తాము ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో నిక్కచ్చిగా అమలు చేస్తామని చెప్పారు. తెలంగాణను సంక్షేమ రాజ్యంగా, అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డిసెంబర్ 9 తెలంగాణకు పండుగ రోజు అని వ్యాఖ్యానించారు.

లోగో ఆవిష్కరించి.. జెండా ఊపి..

'చేయూత'పథకంలో భాగంగా రాష్ట్రంలోని పేదలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సల పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతూ లోగో, పోస్టర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. తర్వాత మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతోపాటు మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేలతో కలసి మహిళల ఉచిత ప్రయాణ బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఉచిత టికెట్‌ను ఆవిష్కరించారు. ఉప్పల్ డిపోకు చెందిన టీఎస్08జెడ్ 0143 నంబర్ బస్సులో మహిళా ప్రయాణికులతో కలసి లోయర్ ట్యాంక్ బండ్ ప్రాంతంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రయాణించారు. ఈ బస్సులో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, సీఎస్ శాంతికుమారి, మహిళా ఐఏఎస్ అధికారులు వాణీప్రసాద్, టీకే శ్రీదేవి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, మహిళా ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, యశస్వినిరెడ్డి, ఎమ్మెల్యేల బంధువులు ప్రయాణించారు. ఈ సందర్భంగా తొలి ఉచిత టికెట్‌ను తెలంగాణకు చెందిన ప్రఖ్యాత బాక్సర్ నిఖత్ జరీన్‌కు రేవంత్‌రెడ్డి అందజేశారు. ఈ బస్సుతోపాటు ఏర్పాటు చేసిన మరో రెండు బస్సుల్లో జీహెచ్‌ఎంసీ కార్మికులు, విద్యార్థినులు ప్రయాణించారు. ఈ కార్యక్రమంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఆర్టీసీ ప్రారంభించింది.

అంబేడ్కర్‌కు ఘనంగా నివాళి అర్పించి..

అసెంబ్లీ నుంచి బస్సులో ట్యాంక్‌బండ్ వరకు వెళ్లిన సీఎం రేవంత్, మంత్రులు, అధికారులు.. అక్కడ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తర్వాత సీఎం సహా అందరూ అదే ఆర్టీసీ బస్సులో తిరిగి వెళ్లారు. ఈ సందర్భంగా రేవంత్ బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ఉండగా.. మంత్రి సీతక్క, కొండా సురేఖ ఇద్దరూ మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నేటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అంటూ పోస్టర్లను ప్రదర్శించారు.

'మహాలక్ష్మి'తో మరింత సంతోషం: రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

కొత్త ప్రభుత్వంలో తనకు రవాణాశాఖ దక్కడం సంతోషంగా ఉందని.. తనకు ఆ శాఖను కేటాయించిన తొలిరోజే ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే పథకాన్ని ప్రారంభించటం మరింత సంతోషాన్ని కలిగించిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ''ఇది గొప్ప పథకం, మహిళలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. దీన్ని అంతా కలసి విజయవంతం చేయాలి. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వెసులుబాటు ఉందన్న ఉద్దేశంతో.. అంతగా అవసరం లేకున్నా బస్సుల్లో ప్రయాణిస్తూ ఉంటే తోటివారికి ఇబ్బందిగా ఉంటుంది. అందుకే అవసరమున్న మహిళలు దీన్ని వినియోగించుకోవాలని కోరుతున్నా. ఓ రెండు వారాలు దీన్ని సమీక్షిస్తూ తదనుగుణంగా చర్యలు తీసుకుంటాం. నేను కొత్త మంత్రిని అయినందున శాఖపై పూర్తి అవగాహన రావాల్సి ఉంది. త్వరలోనే కార్యాచరణ ప్రారంభిస్తాను''అని పొన్నం ప్రభాకర్ చెప్పారు.

కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదలకు వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రారంభించిన 'చేయూత'పథకం ద్వారా రాష్ట్రంలోని పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించనున్నారు. ఈ పథకంలో భాగంగా నిరుపేదలకు ఆరోగ్య భద్రతను కల్పించే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఒక్కో కుటుంబానికి ఏటా రూ.10 లక్షల వరకు ఉచితంగా వైద్య సాయం అందుతుంది. దారిద్య్రరేఖకు దిగువన ఉన్న 90.10 లక్షల కుటుంబాలు ఈ పథకం కింద లబ్ధి పొందుతాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వైద్యపరంగా మొత్తం 1,672 ప్యాకేజీలు అమలుకావడంతోపాటు 21 స్పెషాలిటీ సేవలు అందుతాయని వెల్లడించాయి.

నిఖత్‌కు రూ. 2 కోట్ల చెక్కు

నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రఖ్యాత బాక్సర్ నిఖత్ జరీన్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు ఆర్థిక సాయాన్ని అందజేసింది. అసెంబ్లీ ప్రాంగణంలో మహాలక్ష్మి, చేయూత పథకాలను ప్రారంభించిన సమయంలోనే సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కలసి నిఖత్ జరీన్‌కు చెక్కును అందజేశారు. ఆమెకు శాలువా కప్పి సన్మానించారు.



నిఖత్ జరీన్‌కు చెక్కు అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు సీతక్క, సురేఖ, దామోదర, పొంగులేటి, తుమ్మల తదితరులు

బస్సుల్లో మహిళల రద్దీ

ఉచిత ప్రయాణం తొలిరోజే కిక్కిరిసిన బస్సులు

- శని, ఆదివారాలు సెలవు కావటంతో రద్దీపై అంచనా ఉండదన్న అధికారులు
- ప్రయాణికుల సంఖ్యపై సోమవారం స్పష్టత వస్తుందని వెల్లడి
- ఉచిత ప్రయాణంపై ఆనందం వ్యక్తం చేసిన మహిళలు
- ఆటోలు, క్యాబ్‌లు, సెట్విన్ బస్సులపై ప్రభావం



ఉచిత ప్రయాణంపై ఆనందం వ్యక్తం చేస్తున్న స్కూల్ విద్యార్థినులు, మహిళలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడాయి. 'మహాలక్ష్మి'పథకంలో భాగంగా ఉచిత ప్రయాణ వెసులుబాటు కల్పించడంపై చాలా మంది మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. శాసనసభ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన వెంటనే.. రాష్ట్రవ్యాప్తంగా దీన్ని అమల్లోకి తీసుకొచ్చారు. బస్సుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో ప్రయాణించే అవకాశం ఉన్నందున.. కిక్కిరిసి ఇబ్బందులు తలెత్తుతాయని అధికారులు ముందే ఊహించారు. కీలక ప్రాంతాల్లో సిబ్బందిని ఏర్పాటు చేసి.. ఎప్పటికప్పుడు సమీక్షించారు. అవసరమైతే అదనపు బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నారు. శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడంతో రద్దీపై స్పష్టత ఉండదని.. సోమవారం నుంచి ఉచిత ప్రయాణ ప్రభావం ఎంతనేది తెలుస్తుందని ఆర్టీసీ అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో కీలక పాయింట్ల వద్ద సోమవారం అదనపు సిబ్బందిని పెట్టి బస్సులను, రద్దీని పర్యవేక్షించనున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న రూట్లను గుర్తించి.. అంతగా రద్దీ లేని రూట్ల నుంచి వాటివైపు బస్సులను మళ్లించాలని భావిస్తున్నారు.

గుర్తింపు కార్డులు అడగకుండానే..

ఉచిత ప్రయాణ పథకం కేవలం తెలంగాణ ప్రాంత మహిళలకే వర్తిస్తుందని ఆర్టీసీ స్పష్టం చేసింది. ఉచితంగా ప్రయాణించాలంటే తెలంగాణ ప్రాంతానికి చెందినవారని ధ్రువపరిచే గుర్తింపు పత్రాలను కండక్టర్లకు చూపాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే ఒక వారం రోజుల పాటు అలాంటి పత్రాల కోసం పట్టుబట్ట వద్దని, మహిళలందరినీ అనుమతించాలని ఆదేశించారు. దీంతో తొలిరోజున ఎక్కడా గుర్తింపు కార్డులు అడగలేదు. అయితే ఎందరు ప్రయాణికులు, ఎంతెంత దూరం చొప్పున ప్రయాణించారన్న వివరాలను కండక్టర్లు ఎస్‌ఆర్‌లో నమోదు చేసుకున్నారు. ఇక మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి స్మార్ట్ కార్డులు జారీ చేసేవరకు జీరో టికెట్లు జారీ చేయాల్సి ఉండనుంది. జీరో టికెట్‌కు సంబంధించి టిమ్స్‌లో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయాల్సి ఉంది.

ఆటోలు, క్యాబ్‌లు, సెట్విన్‌లపై ప్రభావం!

ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వెసులుబాటు నేపథ్యంలో ఆటోలు, క్యాబ్‌లు, సెట్విన్ బస్సుల్లో వెళ్లేవారు ఆర్టీసీ బస్సులవైపు మళ్లారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిలోనూ కొందరు బస్సులెక్కారు. ఈ పథకం ఆటోలు, క్యాబ్‌లు, సెట్విన్ బస్సులపై ప్రభావం చూపుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ద్విచక్ర వాహనాల వినియోగం తగ్గితే కొంతమేర ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న అభిప్రాయలూ వస్తున్నాయి. మరోవైపు ఈ పథకం వల్ల బస్సుల్లో రద్దీ పెరుగుతున్నందున.. వీలైనంత తొందరలో కొత్త బస్సులను సమకూర్చుకోవాలని ఆర్టీసీ భావిస్తోంది. కొత్త బస్సులు రోడ్డెక్కితే.. ఆర్టీసీ సర్వీసులు పెరిగి ప్రైవేటు వాహనాల రద్దీ కొంత తగ్గుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

విన్నపాలు వింటూరిక!

జీహెచ్‌ఎంసీలో త్వరలో ఫిర్యాదుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: కోటిమందికి పైగా ప్రజలకు సేవలందించే బల్దియాలో త్వరలో ప్రజా ఫిర్యాదుల్ని స్వీకరించనున్నారు. ఈ మేరకు అధికారులు సిద్ధమవుతున్నారు. జీహెచ్‌ఎంసీలో ఫిర్యాదుల స్వీకరణకు కాల్‌సెంటర్ ఉన్నప్పటికీ, దాని సేవలపై ప్రజలు సంతృప్తిగా లేరు. ఫోన్లో సమస్య చెబితే ఆపరేటర్లు నమోదు చేసుకోవడం తప్ప వారి వేదన అధికారులకు విన్నవించే పరిస్థితి లేదన్న అసంతృప్తి ప్రజల్లో ఉంది. జీహెచ్‌ఎంసీలో గతంలో ప్రతివారం 'ప్రజావాణి' పేరిట ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే వారు. వారి వేదనల్ని వినేవారు. పరిష్కారం కాకపోతే ప్రజలు మళ్లీ వచ్చేవారు. మూడేళ్ల క్రితం కోవిడ్ తరుణంలో ఆ కార్యక్రమాన్ని ఎత్తివేశారు. తాజాగా సీఎం క్యాంప్ కార్యాలయం నుంచే 'ప్రజాదర్బార్'లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ స్థాయిలోనే ప్రజల ఫిర్యాదుల్ని పరిష్కరిస్తే జీహెచ్‌ఎంసీకి సంబంధించిన సమస్యలపై ప్రజాదర్బార్‌లో కొంత తాకిడి తగ్గుతుందనే యోచనలో ఉన్నారు.

క్లుప్తంగా...

ప్రజాదర్బార్ అర్జీలన్నీ కంప్యూటరీకరణ

ప్రతీ దరఖాస్తు అదేరోజు ఎంట్రీ.. అర్జీదారు సెల్‌ఫోన్‌కు ఎస్‌ఎంఎస్

సాక్షి, హైదరాబాద్: మహాత్మ జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో రెండోరోజూ ప్రజాదర్బార్ కొనసాగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వ ర్యంలో ప్రజాదర్బార్ శుక్రవారం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభించింది. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వినతులు స్వీకరించిన తర్వాత వాటిని కంప్యూటరీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కంప్యూటర్‌లో ఎంట్రీ చేసిన వెంటనే సదరు అర్జీదారు సెల్‌ఫోన్‌కు ఎస్‌ఎంఎస్ రూపంలో సంక్షిప్త సమాచారం వస్తుంది. ఇందులో దరఖాస్తుకు సంబంధించిన రిఫరెన్స్ నంబర్ సైతం అర్జీదారు సెల్‌ఫోన్‌కు అందుతోంది. వీటన్నిటినీ పర్యవేక్షించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసేదిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ప్రజాదర్బార్‌లో హైదరాబాద్ అదనపు కలెక్టర్ మధుసూదన్ పాల్గొనగా, జీహెచ్‌ఎంసీ అధికారులు ముషారఫ్ అలీ, రవికుమార్ ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

ప్రజాభవన్‌లో వినతులు స్వీకరించిన నవీన్ మిత్తల్

పంజగుట్ట (హైదరాబాద్): ప్రజాభవన్‌లో శనివారం కూడా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిత్తల్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వినతుల స్వీకరణ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. ధరణిలో సమస్యలు, డబుల్‌బెడ్ రూంలకోసమే ఎక్కువగా వినతులు ఇచ్చేందుకు వస్తున్నారు. కాగా, వినతులు ఇచ్చిన వారి ఫోన్ నంబర్లను అక్కడి సిబ్బంది తీసుకుని దరఖాస్తు పరిశీలించి త్వరలోనే మెసేజ్ వస్తుందని చెబుతున్నారు.కాగా, శనివారం ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవ్వరూ అందుబాటులో లేరు.

సీఎం రేవంత్‌రెడ్డికి 13 బీసీ సంఘాల మద్దతు

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య


సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, బీసీ సంఘాల నేతలు

హిమాయత్‌నగర్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి 13 బీసీ సంఘాలు మద్దతు తెలుపుతున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ జాబితా నుంచి తొలగించిన 26 బీసీ కులాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలగించిన కులాలను తిరిగి బీసీ జాబితాలో చేరుస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి హామీని నెరవేర్చాలని కోరారు. బీసీలు, నిరుద్యోగులు పోరాటాలు చేసి బీఆర్‌ఎస్‌ను ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పారన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు పంచాయతీరాజ్ రిజర్వేషన్లు 20 నుంచి 42 శాతానికి, విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లు 25 నుంచి 52 శాతానికి పెంచాలని, జనగణనలో కులగణన చేపట్టాలని కోరారు.

తెలంగాణలో నియంతృత్వ పాలన అంతం: వివేక్

శ్రీవారికి మొక్కులు చెల్లించుకున్న చెన్నూరు ఎమ్మెల్యే

తిరుమల: తెలంగాణలో ప్రజల ఆకాంక్షల మేరకు నియంతృత్వ పాలన అంతమై ప్రజా ప్రభుత్వం వచ్చిందని ఆదిలాబాద్ జిల్లాలోని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం వేకువజామున తిరుమలలోని స్వామివారి సుప్రభాతసేవలో ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ వెలుపల మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుటుంబ దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించానని చెప్పారు. సింగరేణిలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, మిషన్ భగీరథ ఫెయిల్ అయిందని, ఎక్కడా మంచి నీరు రావడం లేదన్నారు.

నేటి నుంచి 'కృష్ణవేణి సంగీత నీరాజనం'

సాక్షి, అమరావతి: మన సంస్కృతి, వారసత్వ సంప్రదాయాలను చాటి చెప్పడంతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు భారత పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖలు, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా 'కృష్ణవేణి సంగీత నీరాజనం' వేడుకను నిర్వహించనున్నారు. సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు విజయవాడలోని దుర్గా ఘాట్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, పున్నమి ఘాట్, బెర్మ్ పార్కు వేదికలపై ఈ కార్యక్రమం జరగనుంది. ఈ వేడుకలో శాస్త్రీయ సంగీతంతో పాటు హరికథ, ప్రాంతీయ వంటకాలు, స్థానిక హస్తకళలు, చేనేత వస్త్రాల ప్రదర్శన వంటివి ఏర్పాటు చేయనున్నారు. పూర్తి వివరాలకు https://krishnavenimusicfest.comలో చూడవచ్చు.

'గ్యారంటీల' భారమంతా మనపైనే..

- రాష్ట్ర ఆదాయం పెంపు కోసం మనస్ఫూర్తిగా పనిచేయండి
- ఉద్యోగస్తుల్లా కాకుండా రాష్ట్రాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో విధులు నిర్వహించండి
- ఆదాయ వనరుల అన్వేషణకు మేధస్సు ఉపయోగించండి
- ప్రభుత్వ విజయం ఈ శాఖ పనితీరుపై ఆధారపడి ఉంటుంది
- రూ. 5.5 లక్షల కోట్ల అప్పున్నా రాష్ట్రాన్ని గాడిన పెట్టగలననే ఈ శాఖ పగ్గాలు చేపట్టా
- ఆర్థిక మంత్రిగా తొలి ఉన్నతస్థాయి సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీల విజయం ఆర్థిక శాఖపై ఆధారపడి ఉందని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఆదాయం పెంచుకోవడం ద్వారానే వాటి అమలు సక్రమంగా సాగుతుందని స్పష్టం చేశారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో ఆ శాఖ మంత్రిగా శనివారం తొలి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రం రూ. 5.5 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ ఈ శాఖను గాడిన పెట్టగలననే నమ్మకంతోనే ఈ బాధ్యతలు స్వీకరించినట్లు భట్టి అధికారులకు తెలియజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఆదాయవ్యయాలు, అప్పుల గురించి ఈ సందర్భంగా ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివరించారు.

రాష్ట్ర ఆర్థిక పురోగతిని కలసికట్టుగా సాధిద్దాం..

సంపద సృష్టించడం, సృష్టించిన సంపదను ప్రజలకు పంచడం కోసం ఆర్థిక శాఖ అధికారులు ఆదాయ వనరుల అన్వేషణ కోసం తమ మేధస్సును ఉపయోగించాలని భట్టి వారికి సూచించారు. ప్రభుత్వ విజయం ఆర్థిక శాఖపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, అభయ హస్తం మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను నెరవేర్చడానికి ఆదాయాన్ని పెంచుకోవడం కోసం అధికారులు పనిచేయాలని కోరారు. ఉద్యోగస్తుల్లా కాకుండా ఈ రాష్ట్ర అభివృద్ధికి పనిచేస్తున్నామన్న ఆలోచనతో విధులు నిర్వర్తించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతాయని.. తద్వారా ప్రభుత్వ విజయానికి దోహదపడిన వారు అవుతారన్నారు. అనేక సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్ర ఆర్థిక పురోగతిని కలసికట్టుగా సాధిద్దామని పిలుపునిచ్చారు.

రెండ్రోజుల్లోనే రెండు గ్యారంటీల అమలు మా చిత్తశుద్ధికి నిదర్శనం..

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలను తమ ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే అమలు చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని భట్టి పేర్కొన్నారు. మహిళా సాధికారతకు తొలి అడుగుగా మహాలక్ష్మి పథకం ప్రారంభించి అందులో భాగంగా రాష్ట్రంలోని మహిళలందరికీ తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, ఆరోగ్య తెలంగాణగా ఈ రాష్ట్రం ఉండాలనే ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ. 10 లక్షలకు పెంచి నేటి నుంచి అమలు చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశానికి ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, సెక్రటరీ టి.కె. శ్రీదేవి, జాయింట్ సెక్రటరీలు కృష్ణ భాస్కర్, కె. హరిత, అడిషనల్ సెక్రటరీ ఆర్. రవి, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఇవి ఉచితాలు కాదు.. మానవవనరులపై వ్యయం

ప్రతిపక్షంలో ఉండగా తాను చేపట్టిన పాదయాత్ర సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు చెప్పుకున్న బాధలు విన్నాక తెచ్చుకున్న తెలంగాణకు అర్థం లేదని భావించానని భట్టి పేర్కొన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించడానికి ఆరు గ్యారంటీలు, అభయహస్తం మేనిఫెస్టోలో హామీలను ప్రకటించామన్నారు. ఇళ్లు లేక కొందరు, కొలువులు లేక నిరుద్యోగులు, ఉన్నత చదువులు చదివించలేక విద్యార్థుల తల్లిదండ్రులు, కొలువులు రాక పెళ్లిళ్లలో కేటరింగ్ సప్లయర్స్‌గా వెళ్లి పనిచేస్తున్న యువత దుస్థితిని పాదయాత్రలో చూశానని ఈ సందర్భంగా భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రజలకు ఉచితంగా ఇవ్వడం లేదని మానవవనరులపై వ్యయంగా చేస్తున్నట్లు భావించాలని ఆయన సూచించారు. మానవ వనరులు పెరిగితే అందుకు అనుగుణంగా ఆదాయాలు పెంచే అవకాశం ఉంటుందన్నారు.

కోలుకుంటున్న కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు కోలుకుంటున్నారు. ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో గురువారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ జారిపడిన ఆయనకు శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ సోమాజిగూడ యశోదా ఆస్పత్రిలో వైద్య బృందం హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయడం తెలిసిందే. ప్రస్తుతం కేసీఆర్ కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. ఆయనకు శనివారం ఫిజియోథెరపీ ఏమీ చేయనప్పటికీ, సపోర్ట్ స్టాండ్ సహాయంతో ఆయన్ను ఓ 20 అడుగులు నడిపించారు. అలాగే ఎడమ కాలి వేళ్ల కదలిక సజావుగా ఉండేందుకు, మోకాలు మడవడంలో ఇబ్బంది తలెత్తకుండా చూసేందుకు చిన్నచిన్న స్ట్రెచ్ ఎక్సర్‌సైజ్‌లు చేయించారు. సర్జరీ అనంతరం ఇన్ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు, త్వరగా గాయం మానడానికి అందిస్తున్న మాత్రలను శనివారం కూడా కొనసాగించారు.

కేసీఆర్‌కు చినజీయర్ పరామర్శ


కేటీఆర్‌తో మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి

సాక్షి, హైదరాబాద్: తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్స నుంచి కోలుకుంటున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును శనివారం యశోద ఆసుపత్రిలో చినజీయర్ స్వామి పరామర్శించారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ కూడా కేసీఆర్ ఆరోగ్య స్థితిపై ఆరా తీశారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా శనివారం యశోద ఆసుపత్రికి వెళ్లి కేటీఆర్‌ను కలిసి పరామర్శించారు.

కోర్టుకు హాజరై వివరణ ఇవ్వండి

వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి, డీఎంఈకి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇన్‌చార్జి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) రమేశ్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేస్తూ తాము ఉత్తర్వులు జారీ చేసినా అమలు చేయకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, డీఎంఈ రమేశ్‌రెడ్డి వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ ఫామ్–1 నోటీసులు జారీ చేసింది. అంతేకాదు.. ఈ పిటిషన్‌లో విచారణ ముగిసేవరకు విచారణకు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 21కి వాయిదా వేసింది. ఇన్‌చార్జి డీఎంఈగా రమేశ్‌రెడ్డిని నియమిస్తూ 2017, జూలై 3న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 603 చట్టవిరుద్ధమని.. జీవోను రద్దు చేస్తూ ఏప్రిల్ 24న హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 7 నెలలు గడిచినా న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంతో హెల్త్‌కేర్ రీఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది సామ సందీప్‌రెడ్డి వాదనలు వినిపించారు. మార్చిలో డీఎంఈ పోస్టును సృష్టించిన ప్రభుత్వం ఆ మేరకు నియామకం చేపట్టలేదని.. ఉద్దేశ పూర్వకంగానే కోర్టు ఆదేశాలను అమలు చేయడం లేదన్నారు. ఇన్నాళ్లు ఇన్‌చార్జి డీఎంఈని కొనసాగించారని, నేరుగా డీఎంఈ నియామక ప్రక్రియ జరుగుతోందని ప్రభుత్వం జూలైలో ఇదే కోర్టుకు వెల్లడించిందన్నారు. అయినా ఎలాంటి చర్యలు చేపట్టకుండా రమేశ్‌రెడ్డిని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రిజ్వీ, రమేశ్ రెడ్డిలను వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేశారు.

సలహాదారులకు ఉద్వాసన..

- ఏడుగురి పదవుల రద్దు
- రాజీవ్‌శర్మ సహా సోమేశ్‌కుమార్ వరకు..
- సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం నియమించిన సలహాదారుల పదవులను రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక తొలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న రాజీవ్‌శర్మ, డీజీపీగా కొనసాగిన అనురాగ్ శర్మలు ఇంతకాలం సలహాదారులుగా కొనసాగుతున్నారు. వారి పదవులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీఎస్ శాంతి కుమారి జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పదవులు కోల్పోతున్న వారిలో రాజీవ్‌శర్మ (ప్రభుత్వ ముఖ్య సలహాదారు), అనురాగ్‌శర్మ (శాంతిభద్రతలు, నేర నిరోధక సలహాదారు), ఏకే ఖాన్ (మైనారిటీ సంక్షేమం సలహాదారు), జీఆర్ రెడ్డి (ఆర్థిక సలహాదారు), ఆర్.శోభ (అటవీ వ్యవహారాలు), సోమేశ్‌కుమార్ (ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు), డాక్టర్ చెన్నమనేని రమేశ్ (వ్యవసాయ ముఖ్య సలహాదారు) ఉన్నారు. వీరి పదవీ కాలం శుక్రవారంతోనే ముగిసిందని సీఎస్ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

హజ్ యాత్రికులకు శుభవార్త

- దరఖాస్తు రుసుము రద్దు చేసిన కేంద్రం
- హజ్ చార్జీల్లో రాయితీ.. సమూహంగా ప్రయాణించే మహిళలకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: హజ్ యాత్రికులకు శుభవార్త. 2024లో హజ్ యాత్రకు వెళ్లేవారికి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తు రుసుమును రద్దు చేసింది. దీంతో హజ్ యాత్రికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది హజ్ యాత్రకు వెళ్లే మహిళలు అయిదుగురు సమూహంగా వెళ్లే అవకాశం కూడా కల్పించింది. దీంతో పాటు అయిదుగురు ఒకే కుటుంబ సభ్యులు సమూహంగా కూడా వెళ్లే వెసులుబాటు కల్పించింది. ఇకపై హజ్ యాత్రకయ్యే ఖర్చును కూడా తగ్గించే యోచనలో కేంద్రం ఉన్నట్లు హజ్ కమిటీ అధికారులు తెలిపారు. యాత్రికుల నుంచి సామానుతో పాటు ఇతర ఖర్చుల రూపంలో వసూలు చేయడానికి కేంద్ర హజ్ కమిటీ స్వస్తి పలికింది. గతంలో గ్రీన్, అజీజీయా అనే రెండు కేటగిరీలుండేవి. గ్రీన్ కేటగిరీని ఉన్నత వర్గానికి, అజీజీయాను తక్కువ డబ్బు చెల్లించేవారికి కేటాయించేవారు. వచ్చే ఏడాది నుంచి అందరికి ఒకే కేటగిరి అమలు చేయనున్నట్టు హజ్ కమిటీ అధికారులు వివరించారు. ఈ ఏడాది యాత్రికులకు రూ.3.5 లక్షలు ఖర్చు కాగా.. వచ్చే ఏడాది నుంచి ఈ రుసుములను తగ్గించాలని కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 2024 హజ్ యాత్ర కోసం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. వచ్చే ఏడాది మార్చి నెలలో డ్రా పద్ధతిలో యాత్రికులను ఎంపిక చేస్తారు. ఎంపికైన యాత్రికులకు రానున్న రోజుల్లో కేంద్రం మరిన్ని మినహాయింపులు కల్పించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

3 రోజుల్లోనే కాంగ్రెస్ రంగు బయటపడింది: కిషన్‌రెడ్డి



సర్కార్ కూలిపోతుందేమోనని మజ్లిస్ మద్దతు కోసమే ప్రొటెం స్పీకర్‌గా అవకాశం

సాక్షి, హైదరాబాద్: అధికారానికి వచ్చిన మూడురోజుల్లోనే కాంగ్రెస్ సర్కార్ అసలు రంగు బయటపడిందని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మజ్లిస్ దోస్తీతో తన పాత అలవాటు ప్రకారం శాసనసభ నియమాలు, విధానాలు, గౌరవాన్ని కాలరాసేందుకు ప్రయత్నించిందన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు బొటాబొటీ మెజారిటీ ఉన్నదని, తుమ్మినా, దగ్గినా కూలిపోయే పరిస్థితిలో ప్రభుత్వం కొలువుదీరిందన్నారు. శనివారం పార్టీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణ, పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్‌బాబు, పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డితో కలిసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఎక్కడ కూలిపోతుందేమోనని మజ్లిస్‌మద్దతు కోసం ఆ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి ప్రొటెం స్పీకర్‌గాఅవకాశం ఇచ్చిందని ఆరోపించారు. శాసనసభలో ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యేను నియమించే సంప్రదాయాన్ని కాదని మజ్లిస్‌కు చెందిన వ్యక్తిని నియమించి నియమాలను తుంగలో తొక్కిందని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్, మజ్లిస్‌లు ఒకటేనని తాము ముందు నుంచి చెబుతూ వస్తున్నామన్నారు. రెగ్యులర్‌స్పీకర్‌బాధ్యతలు చేపట్టిన తర్వాతనే బీజేపీ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు.

తప్పనిసరి పరిస్థితుల్లోనే కాంగ్రెస్‌తో పొత్తు

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని



సాక్షి, హైదరాబాద్: తప్పనిసరి పరిస్థితుల్లోనే కాంగ్రెస్ పార్టీతో పొత్తును అంగీకరించామని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెప్పారు. సీపీఐ, కాంగ్రెస్ పొత్తును ప్రజలు అంగీకరించారని ఆయన స్పష్టం చేశారు. అందరి సహకారంతోనే తాను కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని పేర్కొన్నారు. శనివారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కూనంనేని మీడియా పాయింట్ వద్ద, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో కలిసి మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీల నుంచి కనీసం ఒక్కరైనా అసెంబ్లీలో ఉండాలన్న ఆకాంక్షతోనే తనకు పలు రూపాల్లో మద్దతు లభించిందని వెల్లడించారు. పేదలు, అన్నివర్గాల్లోని కష్టజీవుల వాణి వినిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అవినీతి, అక్రమ నిర్బంధాలకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. పదేళ్లుగా నిర్బంధంలో ఉన్న తెలంగాణ ప్రజలు ఊపిరి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే ఇప్పుడు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేయవచ్చన్నారు. గత ప్రభుత్వాల వైఫల్యాలు పునరావృతం కాకుండా, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేయాల్సిన బాధ్యత యువ సీఎం రేవంత్‌రెడ్డిపై ఉందని కూనంనేని పేర్కొన్నారు.

'రైతుబంధు' ఇంకా ఇవ్వలేదేం?

- ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో డబ్బు ఎందుకు జమ చేయలేదు?
- రూ. 500 బోనస్ ఇచ్చి వడ్లు కొంటామన్న హామీని నిలబెట్టుకోవాలి
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి రాగానే రైతుబంధును పెంచిన డబ్బు (ఎకరాకు రూ. 5 వేల బదులు రూ. 7,500)తో రైతుల ఖాతాల్లో వేస్తామన్న మాటేమైందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో డిసెంబర్ 9న రైతుబంధు సొమ్మును రైతుల ఖాతాల్లో వేస్తామని చెప్పారని, ఇచ్చిన మాటపై రైతులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ప్రభుత్వంపై విమర్శలు చేయట్లేదని... దీనిపై ప్రజలు, రైతులపక్షాన ప్రభుత్వాన్ని అడుగుదామని వచ్చామన్నారు. ఎకరాకు ఏటా రూ. 15 వేలు అంటే.. యాసంగి పంటకు ఎకరానికి రూ. 7,500 చొప్పున ఇవ్వాలన్నారు. యాసంగి పంట పనులు ప్రారంభమయ్యాయని, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతుబంధు ఎప్పటి నుంచి వేస్తారో రైతులకు చెప్పాలని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం యాసంగి పంటకు నవంబర్ చివరివారం లేదా డిసెంబర్ మొదటి వారంలో రైతుబంధు డబ్బు వేసేవాళ్లమని గుర్తు చేశారు. ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్యేలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

బోనస్‌తో పంటను కొనాలి..

రైతాంగం అంతా ప్రభుత్వం పంట ఎప్పుడు కొంటుందోనని ఎదురు చూస్తోందని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారంలో రైతులను వడ్లు అమ్ముకోవద్దని చెప్పారని... అధికారంలో రాగానే రూ. 500 బోనస్‌తో వడ్లు కొంటామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. పంట మొత్తం కల్లాల్లో ఉందని, రైతులంతా కళ్లలో వత్తులేసుకొని ఎదురుచూస్తున్నారని, ఒకవైపు తుపాను ప్రభావంతో కొన్ని చోట్ల వడ్లు తడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'రూ. 500 బోనస్ ఎప్పుడు ఇస్తారు? వడ్లు ఎప్పటి నుంచి కొంటారు' అని హరీశ్ ప్రశ్నించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేకే. చిత్రంలో హరీశ్‌రావ్, కడియం శ్రీహరి, పోచారం, తలసాని, మల్లారెడ్డి

బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష నేతగా కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఈ సమావేశానికి హాజరు కాలేదు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ పార్లమెంటరీ నేత కే.కేశవరావు ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. పార్టీ శాసనసభాపక్ష నేతగా కేసీఆర్ పేరును పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రతిపాదించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ ప్రతిపాదనను బలపరిచారు. పార్టీ తరఫున ఎన్నికైన శాసనసభ్యులు ఈ ప్రతిపాదనను బలపరుస్తూ చప్పట్లు కొట్టడంతో కేసీఆర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. శాసనసభా పక్ష డిప్యూటీ లీడర్ నియామకం ఎంపిక బాధ్యతను కేసీఆర్‌కు అప్పగిస్తూ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశాన్ని హరీశ్‌రావు సమన్వయం చేశారు. సమావేశం ముగిశాక ఎమ్మెల్యేలు ప్రత్యేక బస్సులో అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు. అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులో తెలంగాణ అమరుల స్తూపం వద్ద నివాళి అర్పించిన తర్వాత అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు.

అధికారులు నా సూచనలు పాటించాలి

ప్రతి అధికారిక కార్యక్రమానికి నా భార్య నిర్మలను పిలవాలి: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి నియోజకవర్గ అధికారులు తన సూచనలు పాటించాలని, ఇక నుంచి నియోజకవర్గంలో జరిగే అధికారిక కార్యక్రమాలకు తన భార్య నిర్మలా జగ్గారెడ్డిని కూడా ఆహ్వానించాలని ఆ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి పేర్కొన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు ప్రతిపక్షంలో ఉన్నానని, అప్పుడు తన మీద ఓడిపోయిన నాయకుడిని అధికార కార్యక్రమాలకు ఆహ్వానించే వారని, అలా ఆహ్వానించినా తాను హుందాగా వ్యవహరించానని ఆయన చెప్పారు. శనివారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ...కొన్ని పరిస్థితుల వల్ల తాను ఓడిపోయానన్నారు. తన తరఫున ఇక నుంచి ప్రతి అధికారిక కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా పనిచేస్తున్న తన భార్య నిర్మలా జగ్గారెడ్డి హాజరవుతారని ఆమెకు కూడా సమాచారమివ్వాలని తెలిపారు. అదేవిధంగా ఇద్దరు బ్లాక్ ప్రెసిడెంట్‌లు, నలుగురు మండలాధ్యక్షులు, పార్టీ ప్రజాప్రతినిధులు, ఎన్‌ఎస్‌యూఐ, యూత్‌కాంగ్రెస్, మహిళ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర అనుబంధ సంఘాల నేతలకు కూడా సమాచారమివ్వాలని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

తెలంగాణ తల్లి అంటే సోనియమ్మ రూపం

- లక్షలాదిమంది తెలంగాణ బిడ్డలకు ఆమెనే అమ్మ: సీఎం రేవంత్
- గాంధీభవన్‌లో సోనియా జన్మదిన వేడుకలు
- డిసెంబర్ 9 చరిత్రాత్మకం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


గాంధీభవన్‌లో సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డితో కలసి కేక్ కట్ చేస్తున్న వీహెచ్, మాణిక్‌రావు ఠాక్రే, మంత్రి కోమటిరెడ్డి. చిత్రంలో మధుయాష్కీ, మంత్రులు తుమ్మల, భట్టి, శ్రీధర్‌బాబు, పొన్నం, సీతక్క తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తల్లి ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూడలేదని, డిసెంబర్ 7న ఎల్బీ స్టేడియంలో సోనియా గాంధీ వచ్చినప్పుడు తెలంగాణ తల్లి అంటే ఈ రూపంలో ఉంటుందని ప్రజలందరూ భావించారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎల్బీ స్టేడియంలోకి సోనియా గాంధీ ప్రవేశించిన సమయంలో లక్షలాదిమంది తెలంగాణ బిడ్డలు లేచి స్వాగతం పలికారని, ఆ క్షణం ఆమె మొఖంలో కనిపించిన సంతోషం, సంతృప్తి ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. తెలంగాణకు కష్టం వచ్చినా, నష్టం వచ్చినా కాంగ్రెస్ అండగా ఉంటుందని సోనియా ఓ తల్లిలా భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ బిడ్డలకు సోనియానే తల్లి అని ఆయన అభివర్ణించారు. శనివారం గాంధీభవన్‌లో జరిగిన ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకల్లో మంత్రులతో కలసి సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీనియర్ నేత వి.హనుమంతరావుతో కలసి 78 కిలోల కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కోసం సోనియా ఆరు గ్యారంటీలను ఇచ్చి మరింత భరోసా కల్పించారన్నారు. పాలకుడిగా కాకుండా సేవకుడిగా ప్రజలందరి ఆకాంక్షలు నెరవేర్చే బాధ్యత తనదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల కృషి వల్లే తాము పదవుల్లో కూర్చున్నామని చెప్పారు. పదేళ్లు కార్యకర్తలు వేల కేసులు ఎదుర్కొన్నారని.. కార్యకర్తలకు మాట ఇస్తున్నానని.. ఈ ప్రభుత్వం కార్యకర్తలదేనని ప్రకటించారు.

సీఎంకు సేవాదళ్ గౌరవ వందనం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ప్రకటన వచ్చిన డిసెంబర్ 9 చరిత్రాత్మకమైన రోజని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్ చార్జి మాణిక్ రావు ఠాక్రే, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు, పీసీసీ నేతలు తదితరులు పాల్గొన్నారు. సీఎం హోదాలో గాంధీభవన్‌కు వచ్చి న రేవంత్ సేవాదళ్ కార్యకర్తల గౌరవ వందనం స్వీకరించారు.



మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడియున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియల వలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు.
– క్రైస్తవ ధర్మం

ఫోకస్

ఇక్కడి ఓటు... అక్కడి గుట్టు



జనతంత్రం

వర్ధెల్లి మురళి



తెలంగాణ రాజకీయ పరిణామాల్లో ఓ సూపర్ వీక్ గడిచి పోయింది. ఆదివారం ఎన్నికల ఫలితాల వెల్లడితో ప్రారంభమై శనివారం ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారంతో సూపర్ వీక్ ముగిసింది. ఈ ఏడు రోజుల్లో చాలా పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ముఖ్యమంత్రి సహా పన్నెండు మంది కొత్త మంత్రులు బాధ్యతలు స్వీకరించారు. అందరూ అనుభవం, సామర్థ్యం కలిగినవాళ్లే కనుక ఎటువంటి ఆక్షేపణలూ మంత్రివర్గంపై వెలువడలేదు. ఇంకో ఆరుగురికి మంత్రివర్గంలో అవకాశం ఉన్నది. ఆ ఖాళీలు పూర్తయితే గానీ అలకలు, అసంతృప్తులు బయటపడవు.

ఏ ప్రభుత్వానికైనా మొదటి మూడు నెలలను హనీమూన్ పీరియడ్‌గా పరిగణిస్తారు. విమర్శకులు గానీ, విపక్షాలు గానీ, మీడియా గానీ పెద్దగా తప్పులెన్నకుండా చూసీ చూడనట్లుగా వ్యవహరించడం ఒక సంప్రదాయం. మన యెల్లో మీడియాకు మాత్రం ఈ సంప్రదాయం నుంచి మినహాయింపు ఉంటుంది. అధికారంలో ఉన్నది మనవాళ్లే అనుకుంటే యెల్లో మీడియా ఐదేళ్లపాటు చిడతలు వాయిస్తూనే ఉంటుంది. మనవాళ్లు కాదనుకుంటే మూడోరోజు నుంచే మూతి విరుపులు మొదలు పెడుతుంది.

గురువారం నాడు కొత్తమంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలోనే ప్రగతి భవన్ (ఇప్పుడు ప్రజాభవన్) ప్రవేశం దగ్గరున్న ఇనుప కంచెను కొత్త ప్రభుత్వం బద్దలు కొట్టించింది. నిజానికి ఇదొక ప్రతీకాత్మక (సింబాలిక్) చర్య. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని 'దొరల ప్రభుత్వం'గా కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసింది. తాము గెలిస్తే 'గడీ' గోడల్ని కూల్చివేస్తామని, ప్రజాపాలన ఏర్పాటు చేస్తామని చెప్పింది. కంచె తొలగింపు అనేది ఆ ప్రచారానికి అనుగుణంగా జరిగిన ఒక సింబాలిక్ చర్య. కనుక ఈ చర్యపై ఎక్కడా వ్యతిరేకత వ్యక్తం కాలేదు. యెల్లో మీడియా ఈ వ్యవహారాన్ని రిపోర్టు చేయడంలో చాలా ఉత్సాహాన్ని ప్రదర్శించింది. ఆ మీడియా ద్వంద్వ ప్రమాణాల గురించి చెప్పడానికే ఈ ప్రస్తావన.

చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కృష్ణానది కరకట్ట మీద ఒక అక్రమ భవంతిలో నివాసం ఉన్నారు. పైగా దాని పక్కన 'ప్రజావేదిక' పేరుతో నిబంధనలకు విరుద్ధంగా మరో అక్రమ భవనాన్ని నిర్మించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ఈ అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేశారు. దీని మీద యెల్లో మీడియా, తెలుగుదేశం పార్టీ ఎంత యాగీ చేశాయో, ఇప్పటికీ ఎలా చేస్తున్నాయో ఆంధ్ర ప్రజలందరికీ తెలిసిన సంగతే.

ఈ వారం రోజుల పరిణామాల్లో కొత్త ప్రభుత్వం తీసుకున్న చెప్పుకోదగ్గ నిర్ణయాల్లో రెండు ముఖ్యమైనవి. మొదటిది ప్రజాభవన్‌లో వారానికి రెండుసార్లు 'ప్రజాదర్బార్'ను నిర్వహించి సమస్యలను తెలుసుకోవడం. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండింటిని శనివారం నాడు ప్రారంభించడం రెండో కీలక నిర్ణయం. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దురదృష్టవశాత్తు గాయపడి ఆస్పత్రిలో చేరిన విచారకర సంఘటన కూడా ఈ పరిణామాల మధ్యనే చోటుచేసుకున్నది. అధికారం కోల్పోయినప్పటికీ రాష్ట్రంలో నేటికీ అత్యంత ప్రజాదరణ కలిగిన రాజకీయ నాయకుడు నిస్సందేహంగా కేసీఆరే! రెండు కోట్ల పాతిక లక్షలమంది మంది ఓటర్లు పాల్గొన్న తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య ఓట్ల తేడా నాలుగున్నర లక్షలు మాత్రమే!

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో ముందుగా 'ప్రజా దర్బార్' గురించి మాట్లాడుకుందాం. దీర్ఘకాలంగా పరిష్కారం కాని తమ వ్యక్తిగత సమస్యలను పరిష్కరించుకోవడానికి ఇదొక మార్గంగా తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమం

> దీర్ఘకాలంగా పరిష్కారం కాని తమ వ్యక్తిగత సమస్యలను పరిష్కరించుకోవడానికి 'ప్రజాదర్బార్'ను ఒక మార్గంగా తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించారు. ఆయన తర్వాత ఈ కార్యక్రమం ఆగిపోయింది. తిరిగి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం శుక్రవారం పునరుద్ధరించింది. మొదటిరోజే మూడు నాలుగు వేలమంది ప్రజాభవన్‌లోకి విజ్ఞాపన పత్రాలతో దూసుకొచ్చారు. పేరుకుపోయిన ప్రజల వ్యక్తిగత సమస్యల్ని పరిష్కరించడానికి ప్రభుత్వం మార్గం చూపించినందుకు సంతోషించాలా? ప్రజా ప్రభుత్వాలు ఏర్పడిన ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా ముఖ్యమంత్రిని దర్శించుకుంటే తప్ప సమస్యకు పరిష్కారం దొరకని పరిస్థితికి విచారించాలా? ఆలోచించవలసి వస్తున్నది.
>
> వివిధ రకాల ప్రభుత్వ సేవలు, వ్యక్తిగత సమస్యలకు పరిష్కారాలు వీలైనంతవరకు దిగువ స్థాయిలోనే పరిష్కారం దొరకాలి. అందుకోసం రాజకీయ జోక్యం లేని ఒక పారదర్శక వ్యవస్థ ఉండాలి. ఈ రకమైన వ్యవస్థకు విజయవంతమైన ఉదాహరణ ఆంధ్రప్రదేశ్. ఎటువంటి రాజకీయ జోక్యం, పక్షపాతం లేకుండా గ్రామస్థాయిలోనే విలేజ్ సెక్రటేరియట్, వలంటీర్ వ్యవస్థలు పారదర్శకంగా సేవలందిస్తున్నాయి. సమస్యలను పరిష్కరించగలుగుతున్నాయి.

త్రిగా ఉన్నప్పుడు ప్రారంభించారు. ఆయన తర్వాత ఈ కార్యక్రమం ఆగిపోయింది. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం శుక్రవారం నాడు పునరుద్ధరించింది. మొదటిరోజే మూడు నాలుగు వేలమంది ప్రజాభవన్‌లోకి విజ్ఞాపన పత్రాలతో దూసుకొచ్చారు. పేరుకుపోయిన ప్రజల వ్యక్తిగత సమస్యల్ని పరిష్కరించడానికి ప్రభుత్వం మార్గం చూపించినందుకు సంతోషించాలా? ప్రజా ప్రభుత్వాలు ఏర్పడిన ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా ముఖ్యమంత్రిని దర్శించుకుంటే తప్ప సమస్యకు పరిష్కారం దొరకని పరిస్థితికి విచారించాలా? ఆలోచించవలసి వస్తున్నది.

వివిధ రకాల ప్రభుత్వ సేవలు, వ్యక్తిగత సమస్యలకు పరిష్కారాలు వీలైనంతవరకు దిగువ స్థాయిలోనే పరిష్కారం దొరకాలి. అందుకోసం రాజకీయ జోక్యం లేని ఒక పారదర్శక వ్యవస్థ ఉండాలి. ఈ రకమైన వ్యవస్థకు విజయవంతమైన ఉదాహరణ ఆంధ్రప్రదేశ్. ఎటువంటి రాజకీయ జోక్యం, పక్షపాతం లేకుండా గ్రామస్థాయిలోనే విలేజ్ సెక్రటేరియట్, వలంటీర్ వ్యవస్థలు పారదర్శకంగా సేవలందిస్తున్నాయి. సమస్యలను పరిష్కరించగలుగుతున్నాయి. సెక్రటేరియట్‌కు ఒక అర్జీ చేరినట్టయితే ఎన్ని రోజుల్లో దాన్ని పరిష్కరిస్తారో ముందే చెప్పాలి. ఆ గ్రామానికి చెందిన అర్జీల స్టేటస్ రిపోర్టును ఏ రోజుకారోజు అక్కడున్న బోర్డు మీద రాసి పెట్టాలి. ఈ పారదర్శకత సత్ఫలితాలనిచ్చింది. అక్కడ కూడా పరిష్కారం కాకుండా మిగిలిపోయిన సమస్యలను జల్లెడ పట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' పేరుతో ఒక స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఇందులో ప్రజా ప్రతినిధులు, అధికారులందరూ పాల్గొన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో పరిష్కారం దొరికిన సమస్యలు డెలివరీ అయిన సేవలు ఒక కోటికి పైగా ఉన్నాయి.

చిత్తశుద్ధితో సమస్యలను పరిష్కరించాలనుకున్నప్పుడు అటువంటి పారదర్శక వ్యవస్థ అవసరం. గడప దగ్గరే ప్రజలకు సేవలందడం ప్రజాస్వామిక లక్షణం. అర్జీలు చేతబట్టుకొని ప్రయాసపడి రాజధానికి వెళ్లి దర్బార్ దర్శనాల కోసం వేచి ఉండడం ఫ్యూడల్ వ్యవస్థ లక్షణం. ఫ్యూడల్ ధోరణులకు స్వభావ రీత్యానే తెలంగాణ ప్రజలు వ్యతిరేకులు. దారుణమైన ఫ్యూడల్ దోపిడీకి గురైన అనుభవం వారినట్లా మార్చింది. మరి ఎందుకని తొలిరోజున జనం వెల్లువెత్తారు? నియోజక వర్గాల స్థాయిలో మితిమీరిన రాజకీయ జోక్యం, ఎమ్మెల్యేల ఇష్టారాజ్యం పారదర్శకతకు పాతరేశాయి. రెండు మూడుసార్లు ఎన్నికైన కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఆడింది ఆటగా పాడింది పాటగా అధికార యంత్రాంగంలో చలామణీ అయింది. తమవాళ్లు కాదనుకున్నవారి పేర్లు లబ్ధిదార్ల జాబితాల్లోకెక్కలేదు. అందుకే వేలాది సమస్యలు పేరుకొని పోయాయి. ఆ సమస్యల పరిష్కారానికి జరిగే ప్రతి ప్రయత్నాన్ని ఆహ్వానించవలసిందే. ఆ మేరకు ప్రజాదర్బార్ ఉపయోగమే. అయితే ఇది సమస్య మూలాల్లోకి వెళ్లగలిగేది కాదు. ఒక సింబాలిక్ చర్యే!

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమల్లోకి తెస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందులో రెండు గ్యారెంటీల అమలును రాష్ట్ర ప్రభుత్వం శనివారం నాడు ప్రారంభించింది. అందులో ఒకటి 'ఆరోగ్యశ్రీ' పరిధిని పది లక్షలకు పెంచడం. ఎన్నికల హామీల్లో భాగంగా పదిహేను లక్షలకు పెంచుతామని బీఆర్ఎస్ చెప్పింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ పరిధిని పాతిక లక్షల రూపాయలకు పెంచింది. గత ప్రభుత్వంతో పోలిస్తే ఈ స్కీమ్‌లోకి వచ్చే ప్రొసీజర్స్‌ను కూడా మూడు రెట్లు పెంచింది. అందువల్ల కాంగ్రెస్ తెలంగాణలో ఇచ్చిన గ్యారెంటీ వారు ఊహించినంత సంచలనం కలిగించ లేకపోయింది.

కానీ, 'మహాలక్ష్మి' స్కీమ్‌కు తొలిరోజు మంచి స్పందన వ్యక్తమయింది. అన్ని వయసుల్లోని మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని తొలుత ఢిల్లీలోని 'ఆప్' ప్రభుత్వం ప్రారంభించింది. ఇది సూపర్ హిట్టవ్వడంతో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ కూడా తన ఎన్నికల గ్యారెంటీల్లో ప్రకటించి విజయం సాధించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన మొదటి పథకం కూడా ఇదే. ఈ పథకం ఆచరణ యోగ్యతపై భిన్నమైన వాదనలుప్పటికీ సూత్ర రీత్యా స్వాగతించవలసిన కార్యక్రమం. ఎందుకంటే ప్రయాణం... పర్యటన, విహారం... పేరు ఏదైనా మొబిలిటీ అనేది అభివృద్ధికి సంకేతం. అభివృద్ధికి మొబిలిటీ అవసరం. ఇప్పటికీ కదలిక లేకుండా ఉన్న మహిళల్ని ఈ కార్యక్రమం కదిలించవచ్చు. ఈ కదలిక వారిలో లోకజ్ఞానాన్నీ, నిర్భీతినీ ప్రోది చేస్తుంది. సాధికారతకు తోడ్పడుతుంది. విజయవంతంగా అమలుచేయగలిగితే ఇది ప్రగతికి తోడ్పడే కార్యక్రమం.

తెలంగాణ ఎన్నికలను తెలుగుదేశం పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల ఎన్నికలుగా మార్చే ప్రయత్నం చేసింది. తెలంగాణలో ఎన్నికల ముందే కనిపించిన ప్రభుత్వ వ్యతిరేక వాతావరణాన్ని అంచనా వేసుకొని అనధికారికంగా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. ఏపీ సెటిలర్ల తోడ్పాటుతో తాము బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించబోతున్నామని తెలుగుదేశం అభిమాన సంఘీయులు తొడలు మెడలు చరుచుకుంటూ ప్రకటనలు గుప్పించారు. సెటిలర్లంతా తెలుగుదేశం చెప్పినట్టే వింటారనీ, తెలుగుదేశం పార్టీ చొక్కా జేబులో వాళ్లంతా నివసిస్తున్నారనీ భారీ బిల్డప్‌లు ఇచ్చుకున్నారు. కానీ, డామిట్... కథ అడ్డం తిరిగింది!

ఏపీ సెటిలర్ల ఉనికి పెద్దగా లేని జిల్లాల్లో, నియోజక వర్గాల్లో కాంగ్రెస్ విజయాలు సాధించింది. ఖమ్మం జిల్లా మినహాయింపు. అక్కడ గత మూడు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు చేదు అనుభవమే కలిగింది. ఆ పార్టీకి పునాదులు బలంగా పడలేదు. కాంగ్రెస్ పార్టీ టెన్ బై టెన్ స్కోర్ సాధిస్తుందని భావించిన జిల్లా. కానీ ఒక సీటు (భద్రాచలం)ను కోల్పోయింది. ఇక సెటిలర్లు గణనీయమైన ప్రభావాన్ని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చూపాలి. ఇక్కడ 24 అసెంబ్లీ సీట్లున్నాయి. పాతనగరంలోని ఏడు సీట్లను మినహాయిస్తే మిగతా ప్రాంతంలో దాదాపు 15 లక్షలమంది ఏపీ నుంచి వలస వచ్చిన ఓటర్లు ఉండవచ్చనే అంచనా ఉన్నది.

తెలుగుదేశం వారి ఆదేశాల ప్రకారం ఏపీ సెటిలర్లంతా నడుచుకుంటే ఈ పదిహేడు సీట్లను కూడా కాంగ్రెస్ పార్టీ గెలిచి ఉండాలి కానీ, ఒక్క సీటు కూడా ఆ పార్టీకి దక్కలేదు. నాంపల్లిలో మజ్లిస్ మినహా మిగిలిన 16 సీట్లను బీఆర్ఎస్ భారీ తేడాతో గెలుచుకున్నది. పాతబస్తీ పరిధిలోని గోషా మహల్ సీటును మాత్రం బీజేపీ దక్కించుకోగలిగింది. సాధారణంగా ఎన్నికల సమయాల్లో ఏపీ సెటిలర్లంతా ఒకరకంగా, తెలంగాణ సెటిలర్లు ఒకరకంగా, ఉత్తర భారతీయులు ఇంకో రకంగా స్పందించడం ఉండదు. అప్పటి పరిస్థితులను బట్టి దాదాపుగా ఒకే రకమైన స్పందన నమోదవుతూ వస్తున్నది. ఎప్పుడైతే తెలుగుదేశం వర్గీయులు కాంగ్రెస్‌కు అనుకూలంగా ప్రచారం మొదలుపెట్టారో అప్పుడే ఏపీ సెటిలర్లలో నిట్ట నిలువునా చీలిక ఏర్పడింది. తెలుగుదేశం హడావిడి లేకుంటే ఈ చీలిక ఏర్పడేది కాదు.

తెలుగుదేశం పార్టీ అవలంబిస్తున్న కుల రాజకీయాల కారణంగా దాన్ని అనుసరించవలసి వచ్చిన కమ్మ సామాజిక వర్గం వారు మాత్రం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓట్లేయడంతోపాటు ప్రచారంలో కూడా పాల్గొన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వారు తెలుగుదేశం జెండాలు పట్టుకొని ఊరేగింపుల్లో పాల్గొన్నారు. గాంధీభవన్ దగ్గర జరిగిన ర్యాలీలో పచ్చజెండాలతో డ్యాన్సులు కూడా చేశారు.

> తెలంగాణ ఎన్నికలను టీడీపీ రెండు తెలుగు రాష్ట్రాల ఎన్నికలుగా మార్చే ప్రయత్నం చేసింది. తెలంగాణలో ఎన్నికల ముందే కనిపించిన ప్రభుత్వ వ్యతిరేక వాతావరణాన్ని అంచనా వేసుకొని అనధికారికంగా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. ఏపీ సెటిలర్ల తోడ్పాటుతో తాము బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించబోతున్నామని టీడీపీ అభిమాన సంఘీయులు తొడలు మెడలు చరుచుకుంటూ ప్రకటనలు గుప్పించారు. సెటిలర్లంతా తెలుగుదేశం చెప్పినట్టే వింటారనీ, తెలుగుదేశం పార్టీ చొక్కా జేబులో వాళ్లంతా నివసిస్తున్నారనీ భారీ బిల్డప్‌లు ఇచ్చుకున్నారు. కానీ, డామిట్... కథ అడ్డం తిరిగింది! ఏపీ సెటిలర్ల ఉనికి పెద్దగా లేని జిల్లాల్లో, నియోజక వర్గాల్లో కాంగ్రెస్ విజయాలు సాధించింది. ఖమ్మం జిల్లా మినహాయింపు. అక్కడ గత మూడు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు చేదు అనుభవమే కలిగింది. ఆ పార్టీకి పునాదులు బలంగా పడలేదు. కాంగ్రెస్ పార్టీ టెన్ బై టెన్ స్కోర్ సాధిస్తుందని భావించిన జిల్లా. కానీ ఒక సీటు (భద్రాచలం)ను కోల్పోయింది. ఇక సెటిలర్లు గణనీయమైన ప్రభావాన్ని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చూపాలి. ఇక్కడ 24 అసెంబ్లీ సీట్లున్నాయి. పాతనగరంలోని ఏడు సీట్లను మినహాయిస్తే మిగతా ప్రాంతంలో దాదాపు 15 లక్షల మంది ఏపీ నుంచి వలస వచ్చిన ఓటర్లు ఉండవచ్చనే అంచనా ఉన్నది. తెలుగుదేశం వారి ఆదేశాల ప్రకారం ఏపీ సెటిలర్లంతా నడుచుకుంటే ఈ పదిహేడు సీట్లను కూడా కాంగ్రెస్ పార్టీ గెలిచి ఉండాలి కానీ, ఒక్క సీటు కూడా ఆ పార్టీకి దక్కలేదు.

తెలుగుదేశం పార్టీని అనుసరించే సామాజిక వర్గం కాంగ్రెస్ వైపు తిరగ్గానే మిగిలిన సామాజిక వర్గాలు వారికి ఎదురు తిరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్యక్రమాల పట్ల ఆకర్షితులుగా ఉన్న బలహీనవర్గాల ప్రజలు ఇక్కడ కూడా తెలుగుదేశం పార్టీ వ్యతిరేక వైఖరిని తీసుకున్నారు.

సెటిలర్లు అధికంగా కలిగిన పోలింగ్ బూత్‌ల సూక్ష్మ స్థాయి విశ్లేషణలో ఈ సంగతి ప్రస్ఫుటంగా వెల్లడైంది. ఉదాహరణకు కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బూత్ నెంబర్ 24. ఆచార్య వినోభాపురం కాలనీ. ఇక్కడ అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా సెటిలర్లు ఉంటారు. అందులోనూ తూర్పు కాపులు ఎక్కువ. ఈ బూత్‌లో బీఆర్ఎస్‌కు 329 ఓట్లు పడ్డాయి. కాంగ్రెస్‌కు 191, జనసేనకు 120 ఓట్లు వచ్చాయి. ఏపీలో జగన్ ప్రభుత్వ పాలన బాగుందనీ, ఇక్కడ తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్‌కు ప్రచారం చేస్తున్నందువల్లనే తాము బీఆర్ఎస్‌కు ఓటు వేస్తున్నామనీ సత్తిబాబు అనే వ్యక్తి చెప్పారు.

కూకట్‌పల్లి నియోజకవర్గంలోనే కేపీహెచ్‌బీ కాలనీ బూత్ నెంబర్ 326. ఇక్కడ ఉన్నదంతా ఏపీ సెటిలర్లే. ఒకే కులంగా చూసినప్పుడు కమ్మవారు ఎక్కువ. ఆ తర్వాత స్థానాల్లో శెట్టిబలిజ, యాదవ, గవర తదితర బీసీ కులాలుంటాయి. కాపులు కూడా గణనీయంగానే ఉన్నారు. అదే నిష్పత్తి ఓటింగ్‌లో వెల్లడైంది. కాంగ్రెస్ పార్టీకి 214 ఓట్లు వస్తే, బీఆర్ఎస్‌కు 430 మంది, జనసేనకు 132 మంది ఓటేశారు. స్థానిక బీఆర్ఎస్ అభ్యర్థి కమ్మ సామాజిక వర్గమైనప్పటికీ ఆయనకు 15 నుంచి 20 శాతానికి మించి ఆ కులం ఓట్లు పడలేదని వారే చెప్పారు. ఆ ప్రాంతానికి చెందిన పరుచూరి ప్రసాద్ అనే వ్యక్తి మీడియాతో మాట్లాడుతూ మళ్లీ చంద్రబాబు గెలిస్తేనే ఏపీలో అభివృద్ధి ఉంటుంది కనుక ఆయన అభీష్టం మేరకు ఇక్కడ తాము కాంగ్రెస్‌కు ఓటేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో తెలుగుదేశం వర్గీయుల అత్యుత్సాహం మొదటికే మోసం తెచ్చింది. తెలుగుదేశం అనుకూలురు – వ్యతిరేకులుగా ఏపీ సెటిలర్లు చీలిపోయారు. వ్యతిరేకుల ఆధిక్యత నిర్ద్వంద్వంగా రుజువైంది. ఒకరకంగా రాబోయే ఏపీ ఎన్నికల ప్రీ పోల్ సర్వే ఫలితాలను సెటిలర్ల కాలనీలు ప్రకటించాయి.

vardhelli1959@gmail.com

ఇన్ బాక్స్

ఆమె వాదన వినరా!

తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రాని లోక్‌సభ అనైతిక వర్తనం, ధిక్కారం ప్రాతిపదికన బహిష్కరించింది. అధికార పక్షం 'ఇది ఆమె చర్యకు సరైన శిక్ష'గా భావిస్తుండగా, ప్రతిపక్షాలు తమపై దాడిగా భావిస్తున్నాయి. అయితే ఈ విషయంలో జరిగిన నేరంకన్నా శిక్ష మరీ కఠినం అనిపిస్తోంది. ఆమె పాల్పడిన లేదా చేసినట్టు ఆరోపించబడ్డ పార్లమెంట్ నిబంధనల అతిక్రమణలు రెండు. అందులో మొదటిది – పార్లమెంట్ ధిక్కార చర్య. రెండోది – సభ్యురాలిగా అనైతిక వర్తనం. అధికారిక వెబ్‌సైట్ ద్వారా పార్లమెంట్‌లో ప్రశ్నలు సంధించడానికి ఉపయోగించాల్సిన తన వ్యక్తిగత ఖాతా పాస్‌వర్డ్ ఇతరుల చేతిలో పెట్టడం... ఆ చర్య ద్వారా లోక్ సభ గౌరవం కోల్పోయే అవకాశం ఉన్నందున ధిక్కార చర్యగా నేరారోపణ. అలా చెయ్యడం మామూలేనంటూ, అయినా అది ధిక్కార చర్యగా నిబంధనల్లో రాసి లేదన్నది ఆమె వాదన. ఇక రెండోది – ఒక కంపెనీ వారి నుండి డబ్బులు తీసుకుని, వారి ప్రత్యర్థి కంపెనీపై లోక్‌సభలో ప్రశ్నలు గుప్పించడం ద్వారా అనైతికంగా ప్రవర్తించడం! ఈ విషయాలపై 'ఎథిక్స్ కమిటీ' విచారణ జరిపి లోక్ సభకు నివేదిక అందజేసింది. పార్లమెంట్ చర్చ చేపట్టి ఆగమేఘాల మీద ఆమె సభ్యత్వాన్ని రద్దు చేసింది. అదేగాక చర్చలో ఆమె వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వకపోవడం కూడా సరైన నిర్ణయం కాదు.

ముఖ్యంగా పార్లమెంట్‌లో ప్రశ్నలన్నీ స్పీకర్ అంగీకారంతోనే అనుమతించ బడతాయి. కారణం చెప్పకుండానే ఒక ప్రశ్నను తిరస్కరించే అధికారం ఆయనకు ఉంటుంది. కాబట్టి ఫలానా ప్రశ్న అనుమతించ బడిందంటే, దానిపై మరో మాట అక్కరలేదు. ఆమె వేసిన ప్రశ్నలు ఒక కంపెనీని టార్గెట్ చేసినట్టున్నా, పార్లమెంట్ గౌరవానికి కానీ, దేశ శ్రేయస్సుకు కానీ నష్టమేమీ లేదు. ఒక వేళ లంచం తీసుకుని ఆ పనికి పాల్పడ్డా అందుకామె సభ్యత్వం రద్దు చెయ్యడం మరీ పెద్ద శిక్ష. పైగా అలా రద్దు చెయ్యడం ద్వారా ఆమెతో పాటు, ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాన్ని కూడా శిక్షించినట్టే భావించాలి. వారి గొంతు పార్లమెంట్‌లో విన్పించే అవకాశాన్ని దూరం చేసినట్టే కదా! కాబట్టి ఆమె వాదన వినడంతో బాటు, సభ్యత్వం రద్దు కాకుండా మందలింపు, జరిమానా లాంటివి విధిస్తే సరిపోయేదని నా అభిప్రాయం.

డబ్బులు తీసుకుని ప్రశ్నలడగడం, ఒక కంపెనీ ప్రయోజనాల్ని వెనకేసుకు రావడం ఒక సభ్యుడు చెయ్యగల నేరం అయినప్పుడు అదే పని ఎన్నికల ఫండింగ్ తీసుకుని పెద్ద స్థాయిలో ఒక పార్టీ చేస్తేనో? ప్రజాస్వామ్య సమాజం ఆలోచించాల్సిన సీరియస్ విషయమిది!

– డా॥ డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం మాజీ ఎంపీ
మొబైల్: 94408 36931

మన సంగీతానికి నీరాజనం!

సందర్భం



ఆర్. మల్లికార్జున రావు

మనిషి జీవితంలో ఓ అంతర్భాగం సంగీతం. అన్ని సందర్భాల్లోనూ ఆ యా భావాలను వ్యక్తం చేయడానికి సంగీతం ఒక వాహిక. అయితే ప్రపంచంలో అనేక రకాల సంగీత సంప్రదాయాలు ఉన్నాయి. వాటిలో భారతీయ సంగీత సంప్రదాయాలకు చాలా విశిష్ట స్థానం ఉంది. భారతీయ సంగీతం రాగ ప్రధానమైనది అయితే పాశ్చాత్య సంగీతం స్వరమేళన ప్రధానం. భారతీయ సంగీతం గురించి వేదాల్లో ఒకటైన సామవేదంలోనూ ప్రస్తావితమయ్యింది.

భరతముని తన 'నాట్యశాస్త్రం' (క్రీ.పూ. 2వ శతాబ్దం నుండి క్రీ.శ. 2 వ శతాబ్దం)లో భారతీయ సంగీతం గురించి విపులంగా వివరించాడు. మధ్య ఆసియా నుండి వచ్చిన తుర్కీయులు, తాతార్లు, పర్షియన్లు, అఫ్ఘాన్లు పాలన చేస్తున్నప్పుడు భారతీయ సంగీతం ఉత్తర, దక్షిణ సంగీత సంప్రదాయాలుగా విడిపోయింది. ఉత్తర సంప్రదాయాన్ని 'హిందుస్తానీ' సంగీతమనీ, దక్షిణపు సంప్రదాయాన్ని 'కర్ణాటక' సంగీతం అనీ పిలవడం ప్రారంభమయింది. అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఆస్థానంలో పార్శీ దేశానికి చెందిన అమీర్ ఖుస్రూ ఉండేవాడు. ఇతడు పార్శీ సంగీతంలోని రాగ క్రమ పద్ధతిని భారతీయ సంగీతంతో మేళవించి ఒక కొత్త సంగీత సంప్రదాయాన్ని సృష్టించాడు. అదే 'హిందుస్తానీ' సంగీతం.

హిందూస్తానీ సంగీతం 'రాగ రాగిణుల' చిత్రకళా సంప్రదాయాన్ని కూడా సృష్టించింది. ఒక రాగాన్ని వినేప్పుడు కలిగే భావనావృత్తి కొన్ని దృశ్యరూపాలతో సంలగ్నమై ఉంటుంది. అటువంటి దృశ్యరూపాన్ని చిత్రరూపంలో పొందుపరచేందుకు ఉత్తర భారతంలో కృషి జరిగింది. ఆ కృషి ఫలితాలే రాగరాగిణి చిత్రాలు. హిందూస్తానీ సంప్రదాయంలో సూరదాసు, తులసీదాసు, మీరాబాయి, జయదేవుడు వంటివారు భక్తి సంగీతాన్ని సుసంపన్నం చేశారు. కొందరు గజల్స్ రూపంలో మధురభక్తిని సృష్టించారు.

దక్షిణ భారతదేశంలో పేరు పొందిన భారతీయ సంగీతం కర్ణాటక సంగీతం. 'కర్ణాటిక్' అనే పదానికి సంస్కృత పదం అయిన 'కర్ణేషు అతతి' (చెవులకు ఇంపైన సంగీతం కనుక కర్ణాటక సంగీతం) మూలం అని కొందరి పరిశోధకుల అభిప్రాయం. 'కరనాడు' అంటే సముద్ర తీరం అనీ, మూడు వైపులా సముద్ర తీరం గల దక్షిణ భారతదేశంలో పుట్టిన సంగీతం కనుక దక్షిణ సంగీత సంప్రదాయానికి కర్ణాటక సంగీతం అనే పేరు వచ్చింది అనీ మరికొందరి అభిప్రాయం.

కర్ణాటక సంగీత సంప్రదాయంలో హిందుస్తానీ సంప్రదాయంలాగా భక్తి, శృంగార రసాలకు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. శృంగార రసం కొన్ని సందర్భాల్లో పరిణతి చెంది భక్తిగా రూపాంతరం చెందుతుంది. త్యాగయ్య, శ్యామశాస్త్రి, పురంధరదాసు,



రామదాసు వంటి వాగ్గేయకారుల పదసాహిత్యం భక్తి కోవకి చెందినది. జావళీలు, ప్రత్యేకించి క్షేత్రయ్య పదాలు శృంగార రసానికి చెందినవి.

కర్ణాటక సంగీతంలో ప్రధాన లక్షణంగా పరిగణించే రాగాన్ని పతంగుడు పేర్కొన్నాడు. రాగాల్లో కొన్ని రాగాలు ఉల్లాసాన్నీ, మరికొన్ని రాగాలు విషాదాన్నీ, కొన్ని కరుణ రసాన్నీ స్ఫురింపజేస్తాయి. ఈ విధంగా ఆ యా రాగాలు శ్రోతల హృదయంలో ఆ యా అనుభూతులను కలిగించగలుగుతున్నాయి.

కర్ణాటక సంగీతశాస్త్రంలో మరో ప్రాధాన్య లక్ష్యం 'శ్రుతి'. 'శ్రు' (అంటే వినుట) అనే ధాతువు నుండి 'శ్రుతి' అనే పదం పుట్టింది. భారతీయ సంగీతానికి గమకాలు ఒక విశిష్టతను చేకూర్చాయి. గానానికి వీటిని మాల అలంకారాలుగా వర్ణింపవచ్చునని సంగీతవేత్తల అభిప్రాయం.

కర్ణాటక సంగీత సంప్రదాయంలో తెలుగు భాష ప్రధాన పాత్ర పోషించింది. తెలుగు భాష మధురమైన భాష. ఈ భాష పదాలకూ, వ్యాకరణానికీ సరైన ప్రాధాన్యమిస్తూ శ్రావ్యమైన కూర్పులను అందిస్తుంది. అలాంటి కూర్పులు వాగ్గేయకారులచే స్వరపరచబడి పద్యం అందాన్ని మరింత పెంచాయి. అందుకనే కాబోలు ఆనాటి తొలి సంకీర్తనాచార్యుడు అన్నమయ్య మొదలుకొని రామదాసు, క్షేత్రయ్య; సంగీత మూర్తి త్రయంలోని త్యాగయ్య, శ్యామశాస్త్రి, తమిళులైన పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్, ముత్తయ్య భాగవతార్; కన్నడ దేశానికి చెందిన మైసూర్ వాసుదేవాచారి ఇత్యాది వాగ్గేయకారులు తెలుగు భాషనే ఎంచుకొని, తమ రచనలు సాగించారు. అంతటి విశిష్టమైనది మన తెలుగు భాష.

అందుకనే తెలుగు రాష్ట్రాల పునర్విభజన జరిగిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో మొట్ట మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వంతో కలిసి 'కృష్ణవేణి సంగీత నీరాజనం' అనే సంగీతోత్సవాన్ని ఈ డిసెంబరు 10 నుండి 12 వరకు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో, అలాగే శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, కృష్ణానది దుర్గా ఘాట్‌ల వద్ద ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ నిర్వహిస్తోంది. ఈ సంగీతోత్సవం ముఖ్య ఉద్దేశ్యం మన అద్భుతమైన సంగీత సంప్రదాయాలను పరిరక్షించడం... తద్వారా హరికథ, నామ సంకీర్తన సంప్రదాయాలపై దృష్టిని పునరుద్ధరించే ప్రయత్నం చేయడం; తెలుగు భాష గొప్పతనాన్నీ, వారసత్వాన్నీ వెలుగులోకి తీసుకురావడం. ఈ ఉత్సవం సంగీత కళాశాలల విద్యార్థులకూ, విశ్వ విద్యాలయాల విద్యార్థులకూ నేర్చుకోవడానికీ, వారి ప్రతిభను ప్రదర్శించడానికీ ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు

పదవీచ్యుతితో మేలు!

మూడడుగుల నేలను దానమడిగి, ఒక అడుగుతో భూలోకంలో ఉన్న బలిచక్రవర్తి సామ్రాజ్యమంతా ఆక్రమించాడు వామనుడు. రెండో అడుగుతో, బలి అధీనంలో ఉన్న పైలోకాలను కూడా అంగుళం మిగలకుండా ఆక్రమించేశాడు. దొడ్డమనసుతో దానమిస్తానన్న దానవరాజును ఆయన ఇలా 'మోసగించడం' అక్కడున్న ఆయన సేనకు ఆగ్రహం తెప్పించింది. యుద్ధమైపోయింది. వామనుడికి సహాయం వచ్చిన దేవతల ముందు దానవులు వీగిపోయారు. బలి చక్రవర్తిని గరుత్మంతుడు వరుణపాశంతో బంధించాడు. పైపెచ్చు ఆయన మాటిచ్చిన దాన్లో మరో 'అడుగు' నేల



ఋణంగా మిగిలిపోయింది. 'ఆ మూడో అడుగు నా తల మీద మోపుకో. నా మాట నిలుస్తుంది' అన్నాడు దానవరాజు. వామనుడు ఆయన కోరినట్టు చేయలేదు, కానీ బలి దుఃస్థితి ఆయన అనుచరులందరికీ ఆవేదనను కలిగించింది.

అప్పుడే అక్కడికి వచ్చిన భక్త ప్రహ్లాదుడికి మాత్రం బలి పరిస్థితి ఆనందాన్నే కలిగించడం విశేషం. ప్రహ్లాదుడు ఇప్పుడు బాలభక్తుడు కాదు. బలిచక్రవర్తికి ఆయన స్వయానా పితామహుడు. తండ్రికి తండ్రి. 'స్వామీ! నా మనుమడికి మునుపు ఇంద్రపదవి ప్రసాదించిందీ నువ్వే. ఇప్పుడు దాన్ని తిరిగి తీసుకొన్నదీ నువ్వే. ఈ రెండో పని వల్లే ఇతడికి ఎక్కువ మేలు. సామ్రాజ్యంతో పాటు, సామ్రాజ్యాధికారం వల్ల కలిగే మదాన్నీ, మోహాన్నీ, అహంకారాన్నీ ఇలా లాగేసుకోవడమంటే నిజంగా ఈ రాజును శిక్షించడం కాదు, రక్షించడమే! ఎందుకంటే, గర్వమేపార, కన్నులు కానరావు; / చెవులు వినరావు; చిత్తంబు చిక్కు పడును; /మరచు నీ సేవలన్నియు; మహిమ మాన్చి,/ మేలుచేసితి(వి) నీ మేటి మేర చూపి' అన్నాడు.

బలి లాక్కొన్న రాజ్యాన్ని మళ్ళీ ఇంద్రుడికి ఇప్పించడమే తప్ప, మహాదాత అయిన ఒక మహనీయుడిని పరాభవించి చిన్నబుచ్చడం మాధవుడి ఉద్దేశ్యం కానేకాదు. అందుకే, ఆయన అక్కడే అప్పుడే బలి చక్రవర్తి సత్యసంధతనూ, వితరణశీలాన్నీ బహు విధాలుగా కొనియాడడమే గాక. 'సావర్ణి మనువు వేళను/ దేవేంద్రుండగునితండు' అని ప్రకటించి, ఆ వేళ వచ్చేవరకు వైభవంగా సుతల లోకాన్ని ఏలుకొమ్మని పంపాడు. అది చాలక, '...నిన్ను / ఎల్ల ప్రొద్దు వచ్చి ఏను రక్షించెద!' అని హామీ ఇచ్చి, ఆశ్వాసపరచి, ఆశీర్వదించాడు.

ఈ తియ్యని, నెయ్యపు మాటలు విన్న బలి సంతసంతో కన్నీరుమున్నీరై, స్వామికి మనసారా సవినయంగా మొక్కాడట. మొక్కడూ మరి?


– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.త్రయోదశి తె.5.45 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** స్వాతి ఉ.10.41 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** సా.4.31 నుండి 6.07 వరకు. **దుర్ముహూర్తం:** ప.3.58 నుండి 4.46 వరకు, **అమృతఘడియలు:** రా.2.26 నుండి 4.01 వరకు; **రాహుకాలం:** సా.4.30 నుంచి 6.00 వరకు, **యమగండం:** ప.12.00 నుంచి 1.30 వరకు, **సూర్యోదయం:** 6.23, **సూర్యాస్తమయం:** 5.22.

కేసుల్లేని మంత్రులు ముగ్గురే

సీఎం సహా 9 మంది మంత్రులపై 136 క్రిమినల్ కేసులు

- అత్యధికంగా సీఎం రేవంత్‌రెడ్డిపై 89 కేసులు
- సీతక్క మినహా మిగతా అమాత్యులంతా కోటీశ్వరులే
- ఆస్తుల్లో, అప్పుల్లో మంత్రి పొంగులేటి టాప్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వంలోని 12 మంది అమాత్యుల్లో సీఎం రేవంత్‌రెడ్డి సహా తొమ్మిది మంది మంత్రులపై కలిపి మొత్తం 136 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డిపై అత్యధికంగా 89 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో తీవ్రమైన క్రిమినల్ కేసులు 50 ఉన్నాయి. ఇక తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు ఐదుగురు మంత్రులు ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్లలో వెల్లడించిన సంగతి తెలిసిందే. కాగా మంత్రివర్గంలోని ముగ్గురు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్, తెలంగాణ ఎలక్షన్ వాచ్ సంస్థలు వెల్లడించాయి. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సహా 12 మంది మంత్రుల అఫిడవిట్ల ఆధారంగా వారి నేరచరిత్ర, ఆస్తులు, అప్పులు తదితర అంశాలపై సమీక్ష చేపట్టిన ఏడీఆర్ సంస్థ శనివారం ఒక నివేదికను విడుదల చేసింది.

రేవంత్ తర్వాత ఉత్తమ్, పొన్నం

పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తర్వాతి స్థానంలో 11 కేసులతో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. ఆయన తర్వాత 7 కేసులతో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, 6 కేసుల చొప్పున ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దాసరి అనసూయ సీతక్క, 5 కేసుల చొప్పున ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, 3 కేసుల చొప్పున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నారు.

సీతక్క మినహా అందరూ కోటీశ్వరులే

మంత్రివర్గంలోని సీఎం సహా మొత్తం 12 మంది మంత్రుల్లో 11 మంది కోటీశ్వరులే ఉన్నారు. ఏడీఆర్ విశ్లేషించిన 12 మంది మంత్రుల ఆస్తుల లెక్క చూస్తే.. రూ.433.93 కోట్ల విలువైన ఆస్తులతో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అత్యధికంగా ఆస్తులు ఉన్న మంత్రిగా అగ్రస్థానంలో నిలిచారు. కాగా 10 మంది మంత్రులు తమకు అప్పులు ఉన్నాయని ప్రకటించగా....అప్పుల జాబితా లోనూ రూ.43.53 కోట్లతో మంత్రి పొంగులేటి టాప్‌లో ఉన్నారు. ఆస్తుల విషయంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తర్వాత రూ.46.66 కోట్లతో దామోదర రాజనర్సింహ, రూ.39.55 కోట్లతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రూ.30.04 కోట్లతో సీఎం రేవంత్‌రెడ్డి ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. అయితే రూ.82.83 లక్షల ఆస్తులతో మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అత్యల్ప ఆస్తులున్న మంత్రిగా ఉన్నారు.

పేరు	క్రిమినల్ కేసులు	ఆస్తులు	అప్పులు
అనుముల రేవంత్‌రెడ్డి	89	రూ.30.04 కోట్లు	రూ.1.30 కోట్లు
మల్లు భట్టి విక్రమార్క	3	రూ.8.13 కోట్లు	లేవు
ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి	11	రూ.5.99 కోట్లు	రూ.85.68 లక్షలు
కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి	6	రూ.39.55 కోట్లు	రూ.6.44 కోట్లు
దుద్దిళ్ల శ్రీధర్‌బాబు	5	రూ.6.91 కోట్లు	రూ.1.79 కోట్లు
దామోదర రాజనర్సింహ	0	రూ.46.66 కోట్లు	రూ.14.35 కోట్లు
పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి	0	రూ.433.93 కోట్లు	రూ.43.53 కోట్లు
తుమ్మల నాగేశ్వర్‌రావు	0	రూ.17.88 కోట్లు	రూ.81.56 లక్షలు
పొన్నం ప్రభాకర్	7	రూ.11.83 కోట్లు	రూ.75 లక్షలు
కొండా సురేఖ	5	రూ.5.98 కోట్లు	లేవు
దాసరి అనసూయ(సీతక్క)	6	రూ.82.83 లక్షలు	రూ.24.74 లక్షలు
జూపల్లి కృష్ణారావు	3	రూ.3.18 కోట్లు	రూ.1.50 కోట్లు

యాదాద్రిలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భాస్కర్‌రెడ్డికి ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠ అలంకార మూర్తులను దర్శించుకున్నారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద ప్రత్యేక అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. జస్టిస్ భాస్కర్‌రెడ్డికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

కేటీపీఎస్ 6వ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం

- అధికారుల అప్రమత్తతతో తప్పిన ముప్పు



పాల్వంచ (భద్రాద్రి కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) 6వ ప్లాంట్‌లో మరమ్మతులు చేపడుతుండగా శనివారం స్వల్ప అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ప్లాంట్‌లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 11వ యూనిట్‌లో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఉష్ణోగ్రత అధికంగా ఉండి మంటలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే మంటలను అదుపులోకి తీసుకురావడంతో భారీ ప్రమాదం తప్పినట్లయింది. ఈ విషయమై సీఈ ఎం.ప్రభాకర్ రావును వివరణ కోరగా స్వల్ప ప్రమాదమేనని, ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలిపారు.

నేడు ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ మహాసభలు

పంజగుట్ట: దేశవ్యాప్తంగా గ్రామీణ వాతావరణం నుంచి వచ్చే న్యాయవాదుల కోసం పనిచేస్తున్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ మూడవ జాతీయ మహాసభలను ఆదివారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం దేవరాజు గౌడ్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని అసోసియేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి విజయ్ డానియల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహాసభలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి సజీవ దహనం

- మోటార్ సైకిల్, లారీ ఢీ
- టూ వీలర్‌ను లాక్కెళ్లడంతో వ్యాపించిన మంటలు
- మంటల్లో చిక్కుకుని వాహనదారుడు మృతి



కాలిపోతున్న బైక్ (ఇన్‌సెట్‌లో) రవి

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి సజీవ దహనమయ్యాడు. లారీ వేగంగా వచ్చి మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టి లాక్కెళ్లిన దరిమిలా మంటలు వ్యాపించడంతో.. ఆ బైక్‌పై ఉన్న వ్యక్తికి నిప్పంటుకుని అక్కడికక్కడే చనిపోయాడు. బెల్లంపల్లి ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ కథనం మేరకు.. తాండూర్‌లోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన తోట రవి(48) జీవాల క్రయవిక్రయాల వ్యాపారం చేస్తుంటాడు. వ్యక్తిగత పని నిమిత్తం మోటార్‌సైకిల్‌పై బెల్లంపల్లికి బయల్దేరాడు. హైదరాబాద్–చంద్రపూర్ జాతీయ రహదారి కన్నాల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద యూటర్న్ తీసుకుంటుండగా తాండూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. మోటార్‌సైకిల్‌ను లారీ దాదాపు 15 మీటర్ల దూరం వరకు లాక్కెళ్లింది. దీంతో పెట్రోల్ లీకై ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ మంటల్లో మోటార్‌సైకిల్ పూర్తిగా దహనమైంది. మంటలు అంటుకుని ఘటనాస్థలంలోనే రవి మృతి చెందాడు.

అందరూ చూస్తుండగానే ..

లారీ ఒక్కసారిగా మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో భారీగా శబ్దం వచ్చినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆ శబ్దానికి ఉలిక్కిపడి అటు వైపు చూడగా మోటార్‌సైకిల్‌ను లారీ లాక్కెళ్తూ కనిపించింది. ఆ క్రమంలోనే మంటలు వ్యాపించడం, అవి అంటుకుని క్షణాల్లోనే రవి మృత్యువాత పడడం చూస్తుండగానే జరిగింది. వాహనదారుడిని రక్షించే వీలుకూడా లేకుండా పో యిందని స్థానికులు నిస్సహాయతను వ్యక్తం చేశారు. ఘటన విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చి, రవి మృతదేహాన్ని రోడ్డు పక్కకు తీసుకొచ్చారు. మృతుడికి భార్య పద్మ, కూతురు శివానీ, కొడుకు సాయి ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంను చూడాలని వస్తే దోచేశారు...

పోలీసులకు ఫిర్యాదు చేసిన బెల్జియం దేశస్తుడు

వెంగళరావునగర్: పుణ్యక్షేత్రాలు దర్శించి తెలంగాణ నూతన ముఖ్యమంత్రిని కూడా కలుద్దామని వచ్చిన బెల్జియం దేశస్తుడిని దుండగులు దోచుకున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..బెల్జియం దేశానికి చెందిన సబిద్‌సిల్వ అనే వ్యక్తి ఇటీవల తల్లిదండ్రులు మృతిచెందడంతో గోవాలోని మారిగో ప్రాంతానికి వచ్చి నివాసం ఉంటున్నాడు. కొద్దిరోజుల కిందట చెన్నైలోని గోల్డెన్ టెంపుల్‌తో పాటు రిషికేష్ తదితర ప్రాంతాలను సందర్శించాడు. మూడు రోజుల కిందట తన సోదరుడు తెలంగాణాకు నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన రేవంత్‌రెడ్డి నియమితులయ్యారని, ఆయనను కలవాలని మెయిల్ ద్వారా సూచించాడు. దాంతో 8వ తేదీన సికింద్రాబాద్‌లో దిగి అక్కడ నుంచి జూబ్లీహిల్స్‌లోని సీఎం ఇంటి వద్దకు చేరుకున్నాడు. సాయంత్రం 7 గంటలైనా సీఎంను కలిసే వీలు కలగకపోవడంతో మరో అరగంట తర్వాత రోడ్–45లో సికింద్రాబాద్ వెళ్లడానికి ఆటో ఎక్కాడు. మార్గమధ్యలో తన వద్ద ఇండియన్ కరెన్సీ లేవని, వాటిని మార్చి ఇస్తానని ఆటో డ్రైవర్‌కు చెప్పాడు. అందుకు సరేనని ఒప్పుకున్న ఆటోవాలా తన మిత్రులకు ఫోన్ చేసి విషయం చెప్పి.. మార్గమధ్యలో మరో ఇరువురిని ఎక్కించుకున్నాడు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఆటో యూసుఫ్‌గూడ జానకమ్మ తోట వద్ద నిలిపివేశారు. ముగ్గురు కలిసి సబిద్‌సిల్వపై పదునైన ఆయుధంతో దాడి చేశారు. అనంతరం అతని వద్ద ఉన్న డబ్బులు, ల్యాప్‌టాప్, ఫోన్, దుస్తులు లాక్కొని పారిపోయారు. దిక్కుతోచని సబిద్‌సిల్వ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమరులారా.. మన్నించండి!



తెలంగాణ ఉద్యమంలో అమరుల పాత్ర ఎనలేనిది.. ఎన్నటికీ మరువలేనిది. అది ఏ సందర్భమైనా.. ఏ నేపథ్యమైనా.. ఏ సన్నివేశమైనా. వారి స్మరణ లేకుండా ఏ ఒక్కరూ ముందుకు సాగలేదు. వారి ఉద్యమ గుర్తుగా గన్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన అమర వీరుల స్తూపం ఏ అలంకరణకూ నోచుకోకుండా బోసిపోయింది. ఎన్నికల సందర్భంగా అమరుల త్యాగాలకు జైకొట్టిన ఆయా పార్టీలు.. ఫలితాలొచ్చాక ఏమాత్రం పట్టించుకోలేదు. ఒకప్పుడు పుష్పాలంకరణల మధ్య ఘనంగా నివాళులు అర్పించిన నేతలను, నాయకులను చూశాం. కానీ.. శనివారం ఇక్కడ భిన్నమైన దృశ్యం కనిపించింది. ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసే ముందు.. ఆ తర్వాత ఆయా పార్టీల నేతలు వచ్చి నివాళులు అర్పించారు. అమర వీరుల స్తూపానికి ఒకే ఒక పూల దండ మాత్రమే కనిపించింది. ఏ శోభా లేకుండా కళావిహీనంగా మారింది. అక్కడికి వచ్చిన సామాన్య ప్రజలు ఈ దృశ్యాన్ని చూసి ఒకింత ఆవేదన వెలిబుచ్చారు. ఔరా.. ఎందుకిలా? అని విస్మయం వ్యక్తం చేశారు. – సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



గోదావరికి నదీ హారతి



భద్రాచలం: భద్రాచలం రామయ్య సన్నిధిలోని గోదావరి నదికి శనివారం వైభవంగా నదీహారతి కార్యక్రమం నిర్వహించారు. కార్తీక మాసంలో బహుళ ద్వాదశి రోజు ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. మొదట మేళతాళాలు, భక్తుల కోలాటాల నడుమ స్వామివారి పాదుకలను ఊరేగింపుగా తీసుకొచ్చి గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు పూజలు నిర్వహించిన తర్వాత ప్రత్యేక హారతులు సమర్పించారు.

సింగరేణిలో పోలింగ్ కేంద్రాలు ఖరారు

- 89 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



ఓటింగ్ కోసం వేచి ఉన్న కార్మికులు(ఫైల్)

గోదావరిఖని: సింగరేణిలో ఈనెల 27న నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. సంస్థ వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో 39,748 మంది కార్మికులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వీరికోసం వివిధ ప్రాంతాల్లో మొత్తం 84 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కార్పొరేట్ ఏరియాలో ఐదు, కొత్తగూడెంలో ఆరు, ఇల్లెందులో మూడు, మణుగూరులో ఏడు, రామగుండం–1లో 11, రామగుండం–2లో ఆరు, రామగుండం–3లో ఆరు, భూపాల్‌పల్లిలో తొమ్మిది, బెల్లంపల్లిలో ఐదు, మందమర్రిలో 11, శ్రీరాంపూర్‌లో 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ రోజే రాత్రి ఓట్ల లెక్కింపు చేపడతారు. దీనికోసం కూడా ఎన్నికల లెక్కింపు కేంద్రాలను కార్మిక శాఖ ప్రకటించింది.

ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఇవే..: సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లోని ఓట్లను లెక్కించేందుకు ప్రత్యేకంగా 10 లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొత్తగూడెం ఏరియాలోని ఓట్లను రుద్రంపూర్ ఆర్సీవోఏ క్లబ్, ఇల్లెందు ఏరియా ఓట్లను ఇల్లెందు ఏరియా కమ్యూనిటీహాల్, మణుగూరు ఏరియాలో పీవీకాలనీ కమ్యూనిటీహాల్, రామగుండం రీజియన్‌లోని ఆర్జీ–1,2, 3 ఏరియాల ఓట్లను గోదావరిఖని సెక్టార్–1 కమ్యూనిటీ హాల్, భూపాల్‌పల్లి ఏరియా ఓట్లను కృష్ణ కాలనీ మినీ ఫంక్షన్‌హాల్, బెల్లంపల్లి ఏరియాలో గోలేటి టౌన్‌షిప్, సీఈఆర్‌క్లబ్, మందమర్రి ఏరియా ఓట్లను మందమర్రి సీఈఆర్ క్లబ్, శ్రీరాంపూర్ ఏరియాలోని ఓట్లను సీసీసీ ఎస్‌సీవోఏ క్లబ్, కార్పొరేట్‌లో హెడ్డాఫీస్ న్యూకాన్ఫరెన్స్‌హాల్, కార్పొరేట్ బూత్–5 ఓట్లను సింగరేణి భవన్ మూడో ఫ్లోర్‌లో లెక్కించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈమేరకు సింగరేణి యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది.

అటవీశాఖ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం

- ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స
- ఉన్నతాధికారి వేధింపులే కారణమా..?



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లత

మంచిర్యాలక్రైం: ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వేధింపులు భరించలేక ఓ బీట్ ఆఫీసర్ ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటన అటవీ శాఖలో చర్చనీయాంశంగా మారింది. బీట్ ఆఫీసర్ కథనం ప్రకారం... మంచిర్యాల జిల్లా కోటపల్లి అటవీ శాఖ రేంజ్ పరిధిలోని బీట్ ఆఫీసర్ లత ఇటీవల సెక్షన్ ఆఫీసర్ రాందాస్‌తో కలిసి వెంచవెల్లి బీట్‌లో ప్లాంటేషన్ నిర్వహించారు. ఇందుకుగాను సెక్షన్ ఆఫీసర్ రాందాస్ రూ.2 లక్షలు కూలీల వేతనాలు, ప్లాంటేషన్ నిర్వహణకు ఇచ్చారు. అయితే ఇవికాకుండా అదనంగా రూ.1.50 లక్షలను కూలీలకు చెల్లించాల్సి ఉందని, బిల్లు ఇవ్వాలని ఎఫ్ఆర్‌వో రవిని లత కోరగా అసభ్యకరంగా మాట్లాడుతూ మానసికంగా వేధిస్తున్నారు. దీంతో ఆమె శుక్రవారంరాత్రి మంచిర్యాలలోని తన ఇంట్లో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన లత భర్త ఆమెను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

డీఎఫ్‌వోకు ఒడిశా కూలీల ఫిర్యాదు

ప్లాంటేషన్ పనులు చేసిన ఒడి శా కూలీలు కూలి డబ్బులు ఇవ్వాలని ఎఫ్ఆర్‌వోను కోరగా 'కూలి లేదు, డబ్బులు లేవు, దిక్కున్నకాడ చెప్పుకోండి' అని బెదిరించారు. దీంతో వారంతా జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశీష్‌సింగ్‌కు ఫిర్యాదు చేయగా ఎఫ్ఆర్‌వోను మందలించారు. ఈ విషయా న్ని మనసులో పెట్టుకొన్న రవి శుక్రవారం తనను కా ర్యాలయానికి పిలిపించి దుర్భాషలాడారని లత ఆ రోపించారు. కాగా, వేధింపుల విషయమై ఎఫ్ఆర్‌వో రవిని సంప్రదించగా, తాను బీట్ ఆఫీసర్ లతను ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని తెలిపారు.

వెలుగుల ఊరట!



- గ్రేటర్‌లో 40 లక్షల మందికి 'గృహలక్ష్మి'
- 200 యూనిట్లలోపు విద్యుత్ ఉచితం
- నెలకు రూ.200 కోట్లకుపైగా భారం
- వంద రోజుల్లో అమలుకు డిస్కం కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: ఆరు గ్యారంటీల హామీ ల్లో భాగంగా ఇప్పటికే మహాలక్ష్మి, చేయూత పథకాలను అమల్లోకి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా గృహలక్ష్మి పథకంపై దృష్టి సారించింది. నెలకు 200 యూనిట్లలోపు వాడే గృహ వినియోగదారులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వంద రోజుల్లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకురావాలని భావిస్తోంది. ఈ మేరకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కసరత్తు ప్రారంభించింది. ఈ పథకం అమల్లోకి వస్తే గ్రేటర్ జిల్లాల పరిధిలో సుమారు 40 లక్షల మంది వినియోగదారులకు నెలవారీ విద్యుత్ బిల్లుల నుంచి ఊరట లభించే అవకాశం లేకపోలేదు.

జనవరి లేదా ఫిబ్రవరి నుంచి..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో తొమ్మిది సర్కిళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 58 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహ విద్యుత్ కనెక్షన్లు 52 లక్షల వరకు ఉండగా.. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే గృహ వినియోగదారులు సుమారు 40 లక్షల వినియోగదారులు ఉన్నట్లు అంచనా. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఆమేరకు శనివారం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ (ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్) బస్సుల్లో ఉచిత ప్రయాణం సహా చేయూత పథకం కింద రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సాయాన్ని రూ.10 లక్షలకు పెంచి, ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించింది. ఇప్పటికే రెండు కీలక హామీలను నెరవేర్చిన ప్రభుత్వం.. తాజాగా గృహలక్ష్మిపై దృష్టి సారించినట్లు తెలిసింది. జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ఈ పథకాన్ని కూడా అమల్లోకి తీసుకురాబోతున్నట్లు సమాచారం.

అధిక ఆదాయం ఆ వర్గాల నుంచే..


గ్రేటర్ జిల్లాల పరిధిలో రోజుకు సగటున 55 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవుతోంది. దీనిలో 40 శాతం విద్యుత్ అవసరాలకే వినియోగిస్తున్నారు. మెజారిటీ విద్యుత్ వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక అవసరాలకే ఖర్చవుతోంది. సంస్థకు అధిక ఆదాయం కూడా ఆ వర్గాల నుంచే లభిస్తోంది. ఇదిలా ఉంటే.. గృహ, పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారుల నుంచి బిల్లుల రూపంలో నెలకు (సాధారణ రోజుల్లో) రూ.900 కోట్ల వరకు రెవెన్యూ వస్తోంది. వేసవిలో ఈ బిల్లులు రూ.1200 కోట్ల వరకు వసూలవుతోంది. ప్రభుత్వ ఉచిత విద్యుత్ హామీతో సంస్థపై నెలకు రూ.200 కోట్లకుపైగా భారం పడనుంది. ఈ పథకం కింద తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వంపై ఏటా రూ.3,431 కోట్లకు పైగా భారం పడనుందని అంచనా. దీనిలో సింహభాగం రూ.2,400 కోట్లకుపైగా భారం గ్రేటర్ నుంచే పడనుంది.

భారమేమీ కాదు..

ఇప్పటికే పీకల్లోతు నష్టాల్లో కూరుకు పోయిన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు ఈ ఉచిత విద్యుత్ పథకం పెద్ద గుదిబండగా మారనుందనే చర్చ కూడా సర్వత్రా జరుగుతోంది. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల భవిష్యత్తులో సంస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారనుందనే వాదన కూడా లేకపోలేదు. నిజానికి టెక్నికల్, కమర్షియల్, ఇతర అంతర్గత నష్టాలను అధిగమించడం ద్వారా ప్రభుత్వం పేద, మధ్యతరగతి గృహ వినియోగదారులకు సమర్థంగా ఉచిత విద్యుత్‌ను ఇవ్వొచ్చు. జవాబుదారీతనంతో, నిజాయితీగా పని చేసే ఇంజినీర్లకు కీలకమైన ఫోకల్ పోస్టుల్లో కూర్చోబెట్టడం, టెక్నికల్, కమర్షియల్ నష్టాలను తగ్గించుకోవడం వల్ల సంస్థపై కనీస భారం లేకుండా ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం ఆదుకుంటే మరిన్ని పర్వతారోహణలు

- కొజిస్కో పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ నాయక్



పంజగుట్ట: మహబూబాబాద్ జిల్లాకు చెందిన గిరిజన యువకు డు భూక్యా యశ్వంత్ నాయక్ ప్రపంచంలో నే అతి ఎత్తైన పర్వతాల్లో ఒకటైన ఆస్ట్రేలియా ఖండంలోని కొజిస్కో పర్వతాన్ని అధిరోహించాడు. ఆస్ట్రేలియా నుంచి నగరానికి వచ్చిన యశ్వంత్ శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల స మావేశం ఏర్పాటు చేసి తన అనుభవాలు పంచుకున్నాడు. నవంబర్ 27న ఇండియా నుంచి బయలుదేరి ఆస్ట్రేలియాకు వెళ్లినట్లు తెలిపారు. డిసెంబర్ 1వ తేదీన 7 వేల అడుగులు ఉన్న పర్వతాన్ని మైన స్ 22 చలిలో, మంచులో పర్వతారోహణ చేసి భారత పతాకాన్ని ఎగరవేశానని తె లిపారు. ఇప్పటివరకు మౌంట్ కిలిమంజారో, సౌతాఫ్రికాలోని మౌంట్ ఎల్‌బ్రో స్ అధిరోహించినట్లు చెప్పారు. త్వర లోనే మౌంట్ ఎవరెస్టు అధిరోహించనున్నట్లు తెలిపారు. ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఉన్న ఏడు ఎత్తైన పర్వతాలను అధిరోహించాలన్నదే తన లక్ష్యమన్నా రు. ప్రభుత్వం ఆదుకుంటే ముమ్మందు మరిన్ని పర్వతారోహణలు చేసి దేశప్రతిష్ఠను పెంచుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి

సాక్షి, సిటీబ్యూరో: నిర్వీర్యంగా ఉన్న విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘంహైద్రాబాద్ జిల్లా అధ్యక్షులు ఇష్తకారుద్దీన్, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నూతన సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పదేళ్లుగా టీచర్ల సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, మధ్యలో నిలిచిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.



రోలర్ స్కేటింగ్ జట్టుకు శిక్షణ

సాక్షి, హైదరాబాద్ : ఈ నెల 15 నుంచి చెన్నైలో తలపెట్టిన రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 61వ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్న తెలంగాణ జట్టుకు నగరంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ జట్టు శిబిరానికి కోచ్‌లు యాదయ్య, విఠల్, అబ్బాస్, దేవాన్ష్, ప్రేమ్, రాజు, శ్రీరామ్‌లు నేతృత్వం వహించారు.

రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తాం: ట్రెసా

రెవెన్యూ మంత్రి పొంగులేటిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు చెబుతున్న రెవెన్యూ ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: కొత్త ప్రభుత్వంలో రెవెన్యూ శాఖకు పునర్వైభవం వస్తుందని ఆకాంక్షిస్తున్నామని, రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి ఆ దిశలో ముందుకెళ్తామని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) వెల్లడించింది. ట్రెసా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె. గౌతమ్‌కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసింది. రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులతో పాటు వీఆర్వో, వీఆర్ఏలు, కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని కోరింది. మంత్రిని కలిసిన వారిలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, విజయేందర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్‌రెడ్డి కూడా ఉన్నారు.

వీఆర్వోల సమస్యలు పరిష్కరించండి: జేఏసీ

రాష్ట్రంలోని వీఆర్‌వోలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఇతర శాఖల్లోకి వెళ్లిన వారిని రెవెన్యూ శాఖలోకి తీసుకురావాలని వీఆర్‌వోల జేఏసీ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్, నేతలు పల్లెపాటి నరేశ్, సర్వేశ్, మురళీ, వెంకటేశ్వర్లు, రాజమల్లు, శ్రీహరినాయక్ తదితరులు కలిసి మంత్రి పొంగులేటిని శనివారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

అందరికీ 'రామ్ రామ్'

చర్చనీయాంశమైన మధ్యప్రదేశ్ సీఎం చౌహాన్ ట్వీట్

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించినప్పటికీ.. ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై స్పష్టత రావడం లేదు. అధిష్టానం ఆదేశాల మేరకు హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్, బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు డీవీ శర్మ తదితర ముఖ్య నేతలతో ఏర్పాటైన ప్రత్యేక కమిటీ తదుపరి సీఎం ఎవరన్న దానిపై సోమవారం ఓ నిర్ణయానికి రానుంది. పార్టీ నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి దీనిపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు. ఈ క్రమంలో 'అందరికీ రామ్ రామ్'అంటూ ప్రస్తుత సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ చేసిన ట్వీట్ చర్చనీయాంశంగా మారింది. ఇకపై తాను ముఖ్యమంత్రి పదవిలో ఉండబోనని పరోక్షంగా చెప్పేందుకే ఆయన అలా ట్వీట్ చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై చౌహాన్ స్పందిస్తూ.. తన ట్వీట్ అంతరార్థం అది కాదని చెప్పారు. ఎవరినైనా పలకరించేటప్పుడు 'రామ్..రామ్'అని చెప్పడం ఇటీవల కాలంలో సర్వసాధారణమైందని, రాముడి పేరుతో దినచర్యను ప్రారంభించడం మన సంస్కృతిలో భాగమని అందుకే అలా ట్వీట్ చేశానని చెప్పుకొచ్చారు. కానీ, ఆయన ట్వీట్‌లో ద్వంద్వ అర్థం ఉండటం రాజకీయంగా దుమారం రేపుతోంది. మధ్యప్రదేశ్‌లో సీఎం రేసులో ప్రధానంగా శివరాజ్ సింగ్‌తోపాటు జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర మంత్రులు నరేంద్ర సింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్ ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో 20 మంది మావోయిస్టులు లొంగుబాటు

సుక్మా: ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత సుక్మా జిల్లాలో శనివారం ఐదుగురు మహిళలు సహా 20 మంది మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. వివిధ మావోయిస్టు అనుబంధ విభాగాలకు చెందిన వీరంతా అమానవీయమైన, పసలేని మావోయిస్టుల సిద్ధాంతాలతో విసిగినట్లు తెలిపారని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ వెల్లడించారు. లొంగుబాటపట్టిన వారిలో మిలిషియా డిప్యూటీ కమాండర్ ఉయిక లఖ్మా, దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్(డీఏకేఎంఎస్), క్రాంతికారీ మహిళా ఆదివాసీ సంఘటన్(కేఏఎంఎస్), చేతన నాట్య మండలి(సీఎన్ఎం)లకు చెందిన సభ్యులున్నార న్నారు. జిల్లాలోని జాగర్‌గుండా పోలీస్‌స్టేషన్ పరిధిలో వీరు మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లొంగిపోయిన వారికి పునరావాస కార్యక్రమాలను వర్తింప జేస్తామన్నారు.

డీప్ ఫేక్ వీడియోలపై కేంద్రం సీరియస్


సాక్షి, న్యూఢిల్లీ: డీప్ ఫేక్ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ముఖ్యమైన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సూచనలు చేసింది. ఈ వివరాలను కేంద్ర సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ రాజ్యసభకు తెలిపారు. 'డీప్ ఫేక్' ఫొటోలు, వీడియోల సృష్టికర్తల ఆగడాలను ఉపేక్షించేదిలేదని, భారీ జరిమానాలను విధిస్తామని ఇటీవల కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ సంస్థల సమావేశంలో హెచ్చరించిన విషయం తెల్సిందే. సంబంధిత మార్గదర్శకాలను, త్వరలో తీసుకురాబోయే చట్టాలను, నిబంధనలను రాజ్యసభ దృష్టికి తీసికెళ్లినట్లు మంత్రి పేర్కొన్నారు. సెక్షన్ 66డీ కింద కంప్యూటర్ ఆధారిత సాంకేతికతతో ఇలాంటి చర్యలకు పాల్పడితే మూడేళ్ల జైలు శిక్ష, రూ.1 లక్ష జరిమానా విధిస్తామని మంత్రి చంద్రశేఖర్ రాజ్యసభకు తెలిపారు.


ఎంపీ డానిష్ అలీపై బీఎస్పీ బహిష్కరణ వేటు

న్యూఢిల్లీ: లోక్‌సభ సభ్యుడు డానిష్ అలీని శనివారం బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) సస్పెండ్ చేసింది. ఆయన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించింది. 'పార్టీ విధానాలు, సిద్ధాంతాలు, క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ మీరు ఎలాంటి ప్రకటన చేయరాదని, ఎటువంటి చర్య తీసుకోవద్దని చాలాసార్లు మౌఖికంగా చెప్పాం. అయినప్పటికీ మీరు పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించడం మానలేదు. అందుకే, పార్టీ ప్రయోజనాల రీత్యా మిమ్మల్ని బహుజన్ సమాజ్ పార్టీ సభ్యత్వం నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తున్నాం'అని పార్టీ ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర మిశ్రా డానిష్ అలీకి రాసిన లేఖలో పేర్కొన్నారు.

శ్రీలంక అంతటా కరెంట్ కటకట

కొలంబో: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయిన శ్రీలంక దేశాన్ని తాజాగా విద్యుత్ సమస్య కలవరపెడుతోంది. సాంకేతిక సమస్య తలెత్తడంతో దేశ వ్యాప్తంగా విద్యుత్ సరఫరా స్తంభించిపోయింది. ''విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నాం'' అని సిలోన్ ఎలక్ట్రిసిటీ బోర్డు(సీఈబీ) అధికార ప్రతినిధి నోయెల్ ప్రియంథ చెప్పారు. ద్వీప దేశమైన శ్రీలంకలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవహారాలను సీఈబీనే చూసుకుంటోంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన కారణంగా దేశమంతటా ఇంటర్నెట్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని మీడియాలో వార్తలొచ్చాయి. కోట్‌మలే-బియాగామా మధ్య ప్రధాన విద్యుత్ సరఫరా లైనులో సమస్య ఏర్పడటం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని సమాచారం. 2022 సంవత్సరం నుంచి శ్రీలంక తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న విషయం విదితమే.





అసెంబ్లీల్లో కొత్తనీరు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త ట్రెండ్

తొలిసారి నెగ్గినవారు ఏకంగా 38 శాతం

ఛత్తీస్‌గఢ్‌లోనైతే సగానికి పైగా కొత్తముఖాలే

తెలంగాణలో 45, మిజోరంలో 47 శాతం వారే

దేశవ్యాప్తంగా చట్టసభల్లోకి కొత్త నీరు శరవేగంగా చేరుతోంది. ఎన్నికల రాజకీయాల్లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టగల ఈ ధోరణి తాజాగా ముగిసిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కొట్టొచ్చినట్టు కన్పించింది. వాటన్నింటిలో కలిపి ఏకంగా 38 శాతం మంది కొత్త ఎమ్మెల్యేలు కొలువుదీరారు! మెజారిటీ సాధనలో వెటరన్ ఎమ్మెల్యేలదే పై చేయిగా నిలిచినా, రాజకీయ రంగంలో మాత్రం మొత్తమ్మీద కొత్త గాలులు వీస్తున్నాయనేందుకు ఈ ఎన్నికలు స్పష్టమైన సూచికగా నిలిచాయి.

మూడింట్లో కొత్తవారి జోరు

మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మిజోరం అసెంబ్లీలకు తాజాగా జరిగిన ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. విజేతల జాబితాను పరిశీలిస్తే ఇప్పటికే కనీసం రెండు నుంచి మూడుసార్లు నెగ్గిన అనుభవజ్ఞులైన ఎమ్మెల్యేలు అందులో 38 శాతం మంది ఉన్నారు. అయితే సరిగ్గా అంతే శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికవడం విశేషం. ఇప్పటికే మూడుసార్లకు మించి ఎమ్మెల్యేలుగా చేసిన వెటరన్లలో ఈసారి 24 శాతం మంది గెలుపొందారు. రాష్ట్రాలవారీగా చూస్తే తొలిసారి ఎమ్మెల్యేల జాబితాలో గిరిజన రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ టాప్‌లో నిలవడం విశేషం. అక్కడ ఈసారి మొత్తం 90 మంది ఎమ్మెల్యేల్లో ఏకంగా 52 శాతం మంది కొత్త ముఖాలే! వెటరన్లు కేవలం 18 శాతం కాగా అనుభవజ్ఞులు 30 శాతమున్నారు. తెలంగాణలో కూడా 119 మంది ఎమ్మెల్యేల్లో 45 శాతం మంది తొలిసారి ఎన్నికైనవారే! ఈ దక్షిణాది రాష్ట్రంలో 21 శాతం మంది వెటరన్లు, 34 శాతం మంది అనుభవజ్ఞులు తిరిగి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఇక ఈశాన్య రాష్ట్రం మిజోరంలో కూడా 40 మంది ఎమ్మెల్యేల్లో 47 శాతం మంది కొత్తవారున్నారు. వెటరన్లు 18 శాతం, అనుభవజ్ఞులు 35 శాతంగా ఉన్నారు. పెద్ద రాష్ట్రాల్లో మాత్రం కొత్తవారి హవా కాస్త పరిమితంగానే ఉంది. మధ్యప్రదేశ్‌లో మాత్రం వెటరన్లు 31 శాతం మంది ఉండగా అనుభవజ్ఞులైన ఎమ్మెల్యేల శాతం 36గా ఉంది. రాష్ట్రంలో 33 శాతం మంది కొత్త ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అడుగు పెట్టారు. రాజస్తాన్ ఎమ్మెల్యేల్లో మాత్రం 46 శాతం మంది అనుభవజ్ఞులే. వెటరన్లు 24 శాతం కాగా తొలిసారి నెగ్గిన వారు 30 శాతమున్నారు. – సాక్షి, నేషనల్ డెస్క్

మెజారిటీలో వెటరన్లదే పైచేయి

ఓవరాల్ గెలుపు శాతంలో వెనకబడ్డా, మెజారిటీ సాధనలో మాత్రం వెటరన్లు సత్తా చాటారు. మూడు రాష్ట్రాల్లో కొత్తవారు, అనుభవజ్ఞుల కంటే ఎక్కువ మెజారిటీని వెటరన్లు సాధించారు. మొత్తమ్మీద ఐదు రాష్ట్రాల్లోనూ కలిపి చూస్తే వెటరన్లు సగటున 22,227 ఓట్ల మెజారిటీ సాధించగా కొత్తవారు 20,868 ఓట్ల మెజారిటీతో రెండో స్థానంలో ఉన్నారు. ఇక అనుభవజ్ఞుల సగటు మెజారిటీ 20,495 ఓట్లు. జనాకర్షణలో వెటరన్లు ఇప్పటికీ సత్తా చాటుతున్నారనేందుకు వారు సాధించిన మెజారిటీలు నిదర్శనంగా నిలిచాయి.

పార్టీలవారీగా చూస్తే...

ఇక ఐదు రాష్ట్రాల ఫలితాలను పార్టీల వారీగా చూస్తే బీజేపీ ఎమ్మెల్యేల్లో కొత్తవారు 38 శాతం మంది ఉన్నారు. 35 శాతం మంది అనుభవజ్ఞులు కాగా వెటరన్లు 27 శాతం మంది ఉన్నారు. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అనుభవజ్ఞులు బీజేపీ కంటే ఎక్కువగా 43 శాతం మంది ఉన్నారు. తొలిసారి నెగ్గిన వారు 34 శాతం కాగా వెటరన్లు 23 శాతంగా తేలారు. ఇతర పార్టీలన్నీ కలిపి చూస్తే కొత్త ఎమ్మెల్యేలు ఏకంగా 47 శాతముండటం విశేషం! 35 శాతం మంది అనుభవజ్ఞులు కాగా వెటరన్లు 19 శాతానికి పరిమితమయ్యారు. చిన్న, ప్రాంతీయ పార్టీల్లో కొత్త వారి జోరు ఎక్కువగా ఉందనేందుకు ఇది స్పష్టమైన సంకేతమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

మోదీ హామీలపైనే ప్రజలకు భరోసా

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే అందుకు రుజువు

- విపక్షాలు ఇచ్చినవన్నీ తప్పుడు హామీలే
- వాటితో విపక్షాలు సాధించేదేమీ ఉండదు
- వికసిత్ సంకల్ప్ యాత్ర లబ్ధిదారులతో సంభాషణ సందర్భంగా మోదీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: తప్పుడు హామీలతో విపక్షాలు సాధించేదేమీ ఉండదని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. కానీ ఈ వాస్తవాన్ని అవి ఇప్పటికీ అర్థం చేసుకోవడం లేదన్నారు. బీజేపీ ఇచ్చిన, ఇస్తున్న 'మోదీ హామీలు' దేశవ్యాప్తంగా ప్రజల్లో మార్మోగుతున్నాయని చెప్పారు. ''వాటిని వాళ్లు పూర్తిగా విశ్వసిస్తున్నారు. ఇటీవలి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాలే ఇందుకు చక్కని రుజువు'' అని ప్రధాని వివరించారు. కేంద్ర పథకాలు ప్రజలందరికీ చేరేలా చూసేందుకు చేపట్టిన వికసిత్ సంకల్ప్ యాత్ర లబ్ధిదారులతో శనివారం ఆయన ముచ్చటించారు. ఎన్నికల్లో నెగ్గడానికి ముందు ప్రజల హృదయాలను గెలుచుకోవడం చాలా అవసరమని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఏ పార్టీకైనా ప్రజల విజ్ఞతను తక్కువగా అంచనా వేయడం తెలివైన పని కాదని విపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ''కేంద్ర ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని, భావోద్వేగపూరిత బంధాన్ని ఏర్పాటు చేయగలిగాం. ప్రజలు తమదిగా భావిస్తున్న ప్రభుత్వం మాది. మోదీ ప్రతి ఒక్కరికీ సేవకుడు. పేదలను పూజిస్తాడు. వారి క్షేమం కోసం తపిస్తాడు. ప్రతి పేదా, తల్లి, చెల్లి, రైతు, యువతి, యువకుడు నాకు వీఐపీయే'' వ్యాఖ్యానించారు. ''విపక్షాలను ప్రజలు నమ్మకపోవడానికి అవి ఇస్తున్న తప్పుడు హామీలు, ప్రకటనలే కారణం. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న వాళ్లు ప్రజా క్షేమాన్ని పట్టించుకుని ఉంటే వారికి నేడు ఇంతటి నిరాదరణ ఉండేదే కాదు. ఎన్నికల్లో గెలిచేది ప్రజాక్షేత్రంలోనే తప్ప సోషల్ మీడియాలో కాదు' అని విపక్షాలకు చురకలు అంటించారు. పక్కా ఇల్లు, తాగునీటి నల్లా, మరుగుదొడ్డి, ఉచిత వైద్యం, రేషన్, గ్యాస్, విద్యుత్, బ్యాంకు ఖాతాల వంటి సదుపాయాలు దేశ ప్రజలందరికీ అందుతున్నాయంటూ హర్షం వెలిబుచ్చారు.

పీటీఐ ప్రధాన కార్యాలయం సందర్శన

ఢిల్లీలో ఉన్న ప్రముఖ వార్తాసంస్థ ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా(పీటీఐ) ప్రధాన కార్యాలయాన్ని ప్రధాని మోదీ శనివారం సందర్శించారు. కొత్తగా ప్రారంభించిన వీడియో సేవలను ఆయన స్వయంగా పరిశీలించారు. 2014లో ప్రధానిగా పగ్గాలు చేపట్టాక ఒక వార్త సంస్థ కార్యాలయానికి మోదీ రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా అక్కడి సీనియర్ ఎడిటోరియల్, ఎగ్జిక్యూటివ్ విభాగాల సిబ్బందితో మాట్లాడారు. మీడియాకు ఎదురయ్యే సవాళ్లు, మీడియాలో అవకాశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.


శనివారం పీటీఐ కార్యాలయంలో అధికారులతో కులాసాగా మాట్లాడుతున్న ప్రధాని మోదీ

దాడుల్లో దొరికింది 290 కోట్లు

- ఒకే కేసులో ఒకే దర్యాప్తు సంస్థకు భారీగా పట్టుబడటం ఇదే ప్రథమం
- బ్యాంకుల్లో రూ. 250 కోట్ల నగదు జమ
- 40 మెషీన్లతో నోట్ల కట్టలను లెక్కిస్తున్నామన్న ఐటీ అధికారులు


ఎంపీ ధీరజ్ సాహు

న్యూఢిల్లీ/భువనేశ్వర్: ఒడిశా కేంద్రంగా పనిచేస్తున్న డిస్టిలరీ గ్రూప్, అనుబంధ సంస్థల్లో ఆదాయ పన్ను(ఐటీ) అధికారులు చేపట్టిన సోదాల్లో భారీ మొత్తంలో నల్లధనం వెలుగులోకి వస్తోంది. మొత్తంగా రూ. 290 కోట్ల వరకు ఇక్కడ ఉండొచ్చని చెబుతున్నారు. ఇప్పటి వరకు లెక్కించిన రూ. 250 కోట్లను అధికారులు వాహనాల ద్వారా తరలించి ఒడిశాలోని ఎస్‌బీఐ శాఖల్లో జమ చేశారు. ఒకే కేసులో ఒకే దర్యాప్తు సంస్థకు ఇంత భారీ మొత్తంలో లెక్కల్లో చూపని నగదు పట్టుబ డటం ఇదే మొదటిసారని అధికార వర్గాలు తెలిపాయి.

మొరాయిస్తున్న కౌంటింగ్ మెషిన్లు

'ఈనెల 6వ తేదీ నుంచి మొదలైన సోదాల్లో బౌధ్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల్లో దొరికిన డబ్బుల కట్టలను లెక్కించడం కష్టసాధ్యమైన విషయంగా మారింది. విరామం లేకుండా లెక్కింపు కొనసాగించడంతో కౌంటింగ్ మిషన్లు మొరాయిస్తున్నాయి. దీంతో, ఇతర బ్యాంకుల నుంచి 40 వరకు చిన్నా పెద్దా కౌంటింగ్ యంత్రాలను తీసుకువచ్చాం. నగదంతా దాదాపుగా రూ. 500 నోట్ల రూపంలోనే ఉంది. ఇప్పటి వరకు రూ. 250 కోట్లను లెక్కించి బ్యాంకుల తరలించాం. శనివారం సాయంత్రానికి లెక్క పెట్టడం పూర్తవుతుంది. మొత్తం రూ. 290 కోట్ల వరకు ఉండొచ్చని అనుకుంటున్నాం. అదేవిధంగా, ఈ డబ్బును సంబల్‌పూర్, బొలంగీర్ ఎస్‌బీఐ ప్రధాన శాఖలకు తరలించేందుకు మరిన్ని వాహనాలను కూడా తీసుకువచ్చాం. నగదును సర్దేందుకు 200 బ్యాగులను వినియోగించాం' అని అధికారులు వివరించారు.

స్పందించని కాంగ్రెస్ ఎంపీ

ఇప్పటి వరకు సోదాలు జరిపిన ప్రాంతాల్లో జార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహుకు చెందింది కూడా ఉందని ఐటీ వర్గాలు తెలిపాయి. 'మద్యం పంపిణీదారులు, విక్రేతలు, వ్యాపారుల ద్వారా భారీ మొత్తంలో నమోదు కాని విక్రయాలు, నగదు బట్వాడా జరుగుతున్నాయన్న ఐటీ నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ సోదాలు చేపట్టాం'అని ఐటీ వర్గాలు వివరించాయి. సోదాల్లో పాల్గొన్న 150 మంది అధికారులతోపాటు ఆయా ప్రాంతాల్లో లభ్యమైన డిజిటల్ డాక్యుమెంట్ల పరిశీలనకు హైదరాబాద్ నుంచి మరో 20 మంది అధికారులు కూడా వచ్చారన్నారు. దాడులు జరిగిన కంపెనీల అధికారుల వాంగ్మూలాలను సేకరిస్తున్నామన్నారు. ఐటీ దాడుల్లో భారీ మొత్తంలో నగదు వెలుగులోకి రావడంపై ఎంపీ సాహు స్పందన కోసం తమ ప్రతినిధి చేసిన ప్రయత్నాలు విఫలమైనట్లు పీటీఐ తెలిపింది.

10 అల్మారాల నిండా డబ్బుల కట్టలు

'బొలంగీర్ జిల్లాలోని ఓ కంపెనీ ఆవరణలోని సుమారు 10 అల్మారాల్లో రూ. 230 కోట్ల నగదు దొరికింది. మిగతాది తిత్లాగఢ్, సంబల్‌పూర్, రాంచీల్లో లభ్యమైంది. శనివారం బొలంగీర జిల్లా సుదపారకు చెందిన దేశవాళీ మద్యం తయారీదారుకు చెందిన ఇంట్లో మరో 20 బ్యాగుల నిండా ఉన్న డబ్బు లభ్యమైంది. ఇందులో రూ. 50 కోట్ల వరకు ఉంటుందని అనుకుంటున్నాం. దీన్ని లెక్కించాల్సి ఉంది. అదేవిధంగా, శుక్రవారం వెలుగు చూసిన 156 బ్యాగుల్లోని డబ్బును బొలంగీర్ ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచికి తరలించి, లెక్కిస్తున్నాం'అని వివరించారు. ఐటీ డీజీ సంజయ్ బహదూర్ మూడు రోజులుగా భువనేశ్వర్‌లో మకాం వేసి, పర్యవేక్షిస్తున్నారు. దాడులకు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు.


బొలంగీర్ జిల్లాలో సోదాల్లో ఓ అల్మరాలో బయటపడిన డబ్బు కట్టలు

కాంగ్రెస్ అవినీతి సంప్రదాయాన్ని పెంచి పోషిస్తోంది: బీజేపీ

ఐటీ దాడుల్లో నమ్మశక్యం కాలేని రీతిలో నగదు బయటపడటంపై బీజేపీ స్పందించింది. కాంగ్రెస్ అవినీతి సంప్రదాయాన్ని తరాలుగా ఎలా సజీవంగా ఉంచిందో దీన్ని బట్టి తెలుస్తోందని వ్యాఖ్యానించింది. శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ నేత, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి మీడియాతో మాట్లాడారు. 'కేవలం ఒక్క కాంగ్రెస్ నేత వద్ద రూ.300 కోట్ల నగదు దొరికింది. కాంగ్రెస్ నేతలందరి దగ్గరా కలిపితే ఎంత డబ్బు దొరుకుతుందో దీన్నిబట్టి ఊహించుకోవచ్చు'అని ఆమె అన్నారు. వ్యవస్థలో లోపాలను ఆసరాగా చేసుకుని, ఎంతగా అవినీతికి పాల్పడొచ్చో కాంగ్రెస్ నేతలు నిరంతరం అన్వేషిస్తుంటారని పేర్కొన్నారు. రాజ్యసభకు కాంగ్రెస్ తరఫున మూడుసార్లు ఎంపీ అయిన సాహు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఆ పార్టీకి ఏటీఎంలుగా మాదిరిగా పనిచేస్తున్నారని విమర్శించారు. రూ.300 కోట్లకుపైగా అవినీతికి పాల్పడిన మద్యం వ్యాపారి ధీరజ్ సాహు ఏటీఎం ఎవరిదని ఆమె ప్రశ్నించారు.

సంరక్షకుడికి రూ. 91 వేల కోట్ల ఆస్తి

స్విస్ కుబేరుడు ప్యూచ్ సంచలన నిర్ణయం

న్యూయార్క్: మలి వయసులో తన బాగోగులు చూసుకున్న వ్యక్తిని దత్తత తీసుకుని ఆస్తి మొత్తం కట్టబెట్టాలని స్విట్జర్లాండ్‌కు చెందిన కుబేరుడు నికోలస్ ప్యూచ్ తీసుకున్న నిర్ణయం సంచలనం సృష్టిస్తోంది. ఎందుకంటే ఆయన ఆస్తి అంతాఇంతా కాదు. ఏకంగా 1,100 కోట్ల డాలర్లు. అంటే దాదాపు రూ.91,700 కోట్లు. 80 ఏళ్ల ప్యూచ్ ప్రపంచ ప్రఖ్యాత లగ్జరీ ఉత్పత్తుల సంస్థ థియరీ హెర్మెస్ వారసుల్లో ఒకరు. 220 బిలియన్ డాలర్ల విలువైన ఈ సంస్థలో నికోలస్ ప్యూచ్‌కు 6 శాతం దాకా వాటాలున్నాయి. ప్యూచ్ పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా ఉండిపోవడంతో వారసులెవరూ లేరు. దాంతో ఆయన తదనంతరం భారీ ఆస్తులు ఎవరికి చెందుతాయి? అన్న సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో, గతంలో తన బాగోగులు చూసుకున్న 51 ఏళ్ల నడి వయస్కుడిని దత్తత తీసుకుని వేల కోట్ల ఆస్తులన్నీ అప్పగించనున్నారాయన. ఇప్పటికే దేశ విదేశాల్లోని కోట్ల రూపాయల విలువచేసే కొన్ని భవంతులను అతని పేరిట రాసేశారట. దత్తత ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మాట వినే లక్షణమేదీ?

సమాజంలో పెరుగుతున్న విభజన: సీజేఐ

ముంబై: నేటి సమాజంలో ఇతరులు చెప్పేది వినే లక్షణం లోపిస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆవేదన వెలిబుచ్చారు. ఎవరికి వారు తమ వైఖరే గొప్ప అనుకుంటూ ఒక చట్రానికి పరిమితమై బతుకుతున్నారన్నారు. ''ఈ ధోరణిని బద్దలు కొట్టాల్సిన అవసరం చాలా ఉంది. ఇతరులు చెప్పేది వినడం గొప్ప కళ. దాని ద్వారా అవగాహన పరిధి ఎంతగానో పెరుగుతుంది. ప్రపంచాన్ని సరికొత్తగా అర్థం చేసుకోగలం''అని హితవు పలికారు. శనివారం ఆయన పుణెలోని సింబయాసిస్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. వ్యక్తిగత వృత్తిగత జీవితంలో ఆగ్రహావేశాలు, హింస, ఇతరులను అగౌరవపరడం వంటివాటితో నష్టాలే తప్ప సాధించేదేమీ ఉండదని విద్యార్థులు అర్థం చేసుకోవాలన్నారు. వినయ విధేయతలు, ధైర్యం, సమగ్రతలే ఆయుధంగా ముందుకు సాగాలని హితవు పలికారు. నేటి యువత ప్రశ్నించేందుకు అస్సలు వెనకాడకపోవడం మంచి పరిణామమన్నారు. సమాజంలో విభజనవాదం నానాటికీ పెరిగిపోతోందని ముంబైలో జమునాలాల్ బజాజ్ అవార్డుల ప్రదానోత్సవంలో సీజేఐ ఆందోళన వెలిబుచ్చారు. ''సోషల్ మీడియాలో కన్పిస్తున్న ధోరణులు, అసహనం దీనికి సంకేతాలే. భారత్ కూడా ఇందుకు అతీతం కాదు'' అని అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యేలకు కొత్త కార్లు కొనబోము

మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమా స్పష్టీకరణ

ఐజ్వాల్: మిజోరం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని నూతన ముఖ్యమంత్రి లాల్‌దుహోమా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులకు కొత్త కార్లు కొనుగోలు చేయబోమని కరాఖండీగా చెప్పేశారు. కొత్త ప్రభుత్వం కొలువుతీరిన ప్రతిసారీ కొత్త కార్ల కొనుగోలుతో ప్రజాధనం వృథా అవుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటీవల దిగిపోయిన మంత్రులు, ఓడిన ఎమ్మెల్యేలు వాడిన ప్రభుత్వ వాహనాలనే కొత్త మంత్రులు, శాసనసభ్యులు వాడుకోవాలని సూచించారు.

ఐసిస్ మాడ్యూల్ నేత సహా 15 మంది అరెస్ట్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్ (ఇస్లామిక్ స్టేట్)పై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) కొరడా ఝళిపించింది. సంస్థకు చెందినట్లుగా అనుమానిస్తున్న మహారాష్ట్ర, కర్ణాటకల్లోని పలు ప్రాంతాల్లో శనివారం దాడులు జరిపి 15 మందిని అదుపులోకి తీసుకుంది. వీరిలో ఐసిస్ మాడ్యూల్ సూత్రధారి సాకిబ్ నచాన్ కూడా ఉన్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఇతడు కొత్తవారిని తమ గ్రూప్‌లోకి చేర్చుకుంటూ వారితో విధేయతతో ఉంటామని ప్రమాణం చేయిస్తుంటాడని వెల్లడించారు. మహారాష్ట్రలోని పద్ఘా-బోరివలి, థానె, మిరా రోడ్డు, పుణెలతోపాటు కర్ణాటక రాజధాని బెంగళూరులో శనివారం ఉదయం దాడులు జరిపినట్లు వివరించారు. ఐసిస్ తరఫున ఉగ్రవాదాన్ని ప్రేరేపించడం, ఉగ్ర సంబంధ చర్యల్లో వీరు పాల్గొంటున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి పెద్ద మొత్తంలో నగదు, తుపాకులు, ఇతర ఆయుధాలు, నిషేధిత సాహిత్యం, సెల్‌ఫోన్లు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కాల్పుల విరమణపై తీర్మానం అమెరికా వీటో!

- హమాస్ పుంజుకుంటుందని ఆందోళన
- ఓటింగ్‌కు దూరంగా ఉన్న బ్రిటన్
- విచారం వ్యక్తం చేసిన యూఏఈ

న్యూయార్క్: గాజాలో తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి రావాలంటూ శుక్రవారం ఐరాస భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానానికి అమెరికా మోకాలడ్డింది యుద్ధంతో అతలాకుతలమవుతున్న గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని, బందీలను హమాస్ మిలిటెంట్లు బేషరతుగా వెంటనే విడిచిపెట్టాలంటూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేసిన ప్రతిపాదనకు ఐరాసలోని 90 సభ్యదేశాలు మద్దతు పలికాయి. ఆ దేశం మండలిలో ప్రవేశపెట్టిన ఆ తీర్మానానికి మొత్తం 15 దేశాలకు గాను 13 దేశాల ప్రతినిధులు అనుకూలంగా ఓటేశారు. మరో శాశ్వత సభ్యదేశం బ్రిటన్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. గాజాలో మానవతా సంక్షోభ నివారణ నిమిత్తం ఇటీవల ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్ అసాధారణ అధికారాన్ని ఉపయోగించారు. తక్షణమే మానవతా కోణంలో కాల్పుల విరమణ జరగాలని, పౌరుల రక్షణ కోసం, అత్యవసర సాయం అందజేయడానికి అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకోవాలని మండలి దేశాలకు గుటెరస్ పిలుపునిచ్చారు. యూఎన్ ఛార్టర్‌లోని ఆర్టికల్ 99 కింద ప్రత్యేక అధికారంతో అంతర్జాతీయంగా ఆందోళనలను కలిగించే పరిస్థితుల్లో భద్రతా మండలిని సమావేశపరచవచ్చు. దీనిలో భాగంగా సమావేశమైన మండలిలో యూఏఈ తీర్మానంపై ఓటింగ్ జరిగింది. మండలిలో శాశ్వత సభ్య దేశమైన అమెరికా తన వీటో అధికారంతో ఆ తీర్మానాన్ని అడ్డుకుంది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కాల్పుల విరమణను గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. అది హమాస్ పుంజుకునేందుకు ఉపయోగపడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆ దేశ ప్రతినిధి రాబర్ట్ వుడ్ మండలిలో మాట్లాడుతూ.. 'ఈ తీర్మానం వల్ల క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రభావం ఉండదు. ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజలు శాంతి, భద్రతల మధ్య జీవించాలని అమెరికా బలంగా కోరుకుంటోంది. అయితే, అస్థిరమైన కాల్పుల విరమణకు అంగీకరిస్తే హమాస్ మరో యుద్ధానికి ప్రణాళిక రచిస్తుంది'అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముసాయిదాలో సవరణలు చేయాలని అమెరికా అంటోంది. మండలిలో తీర్మానాన్ని అమెరికా అడ్డుకోవడంపై యూఏఈ రాయబారి మహ్మద్ అబుషాహాబ్ విచారం వ్యక్తం చేశారు.



ఒక్కొక్కరుగా రాజీనామా!

ఉమ్మడి జిల్లాకు సంబంధించి బీఆర్ఎస్ రెండు పదవులు వదులుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

8లో ▸

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ సబ్‌స్టేషన్లలో నెలవారి విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కె.వీ.టవర్ సర్కిల్ సబ్‌స్టేషన్ పరిధిలోని గంజ్, టవర్, డీఎఫ్‌వో, డాక్టర్స్ స్ట్రీట్ ఫీడర్ల కింద గల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/19.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. పాక్షికంగా ఎండ వస్తుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.



అలుపెరుగని పరుగు..

సండే స్పెషల్

ఏడు పదుల వయసులోనూ అలసిపోకుండా పరుగుతీస్తోంది. నిండైన ఆత్మవిశ్వాసంతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధిస్తోంది. పరుగుతీసిన ప్రతీ చోట పతకం ఖాయం చేసుకుంటుంది. ముప్పై ఏళ్లకే ఏమీ సాధించలేకపోయామని నిరాశ.. నిస్పృహలకు గురయ్యే యువతకు ఆదర్శంగా నిలుస్తోంది రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వెటరన్ అథ్లెట్ టమటం రామానుజమ్మ. ఇటీవల మలేషియాలో జరిగిన పోటీల్లో డెబ్బై ఏళ్ల వయసులోనూ పరుగు తీసి రజతం సాధించింది.అంతర్జాతీయ వేదికలపై దేశ గౌరవాన్ని సమున్నతస్థానంలో నిలుపుతున్న రామానుజమ్మపై స్పెషల్ స్టోరీ.

8లో ▸

అండగా ఉంటాం | అభివృద్ధి చేస్తాం

కార్యాచరణతో ముందుకు



మంథని ప్రాంత అభివృద్ధి, సంక్షేమంపై ప్రణాళికా బద్ధమైన కార్యాచరణతో ముందుకు సాగుత. పెండింగ్ పనులతో పాటు మేనిఫెస్టోలో పెట్టిన ప్రధానమైన అంశాలను నియోజకవర్గానికి పెద్ద స్థాయిలో తీసుకువచ్చే విధంగా కృషిచేస్తా. నిరంతరం నా ప్రయత్నం కొనసాగుతుంది. ఈప్రాంత సంక్షేమం, అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా ముందుకెళ్తా.

– దుద్దిళ్ల శ్రీధర్, మంథని ఎమ్మెల్యే,
ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి



- ప్రమాణ స్వీకారం చేసిన 11 మంది జిల్లా ఎమ్మెల్యేలు
- సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామని ప్రతిన
- వివిధ కారణాలతో కార్యక్రమానికి కేటీఆర్, పాడి కౌశిక్ దూరం
- సింగరేణి కార్మికుని వేషధారణతో అసెంబ్లీకి మక్కాన్ సింగ్
- తిరిగి పాత జిల్లాకే దక్కిన ఐటీ, బీసీ శాఖలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలో లాంఛనంగా జరిగిన ఈ కార్యక్రమంలో పాత జిల్లాకు చెందిన 11 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాగా, ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత ఎమ్మెల్యేలను 'సాక్షి' పలకరించింది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తామని.. పార్టీ మేనిఫెస్టో అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ సమస్యలకు పెద్దపీట వేస్తామని స్పష్టంచేశారు. ఉమ్మడి జిల్లాలోని 13 మంది ఎమ్మెల్యేలలో కోరుట్ల నుంచి సంజయ్, ధర్మపురి నుంచి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం నుంచి మక్కాన్ సింగ్, వేములవాడ నుంచి ఆది శ్రీనివాస్, చొప్పదండి నుంచి మేడిపల్లి సత్యం, మానకొండూరు నుంచి కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ నుంచి పాడి కౌశిక్‌రెడ్డి, హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్ తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మంథని నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కరీంనగర్ నుంచి గంగుల కమలాకర్, పెద్దపల్లి నుంచి చింతకుంట విజయరమణారావుకు ఎమ్మెల్యేలుగా పనిచేసిన అనుభవం ఉంది. శ్రీధర్‌బాబు, గంగుల కమలాకర్ మంత్రులుగా వ్యవహరించిన విషయం తెలిసిందే. కాగా.. వ్యక్తిగత కారణాలతో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, సాంకేతిక సమస్యలతో పాడి కౌశిక్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి దూరంగా ఉన్నారు. ఇక ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు ఐటీ శాఖ కేటాయించారు. అయితే గతంలో ఇదే శాఖను సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యేగా వ్యవహరించిన కేటీఆర్ నిర్వహించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌కు బీసీ సంక్షేమశాఖ వరించింది. ఈ శాఖను గతంలో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలిచిన గంగుల కమలాకర్ నిర్వహించారు. ఏదేమైనా రెండు కీలక శాఖలు తిరిగి పాత జిల్లాకే దక్కడం విశేషం.

తట్టా చెమ్మస్‌తో.. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

తట్టా చెమ్మస్‌తో బ్లూకలర్ డ్రెస్‌తో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అసెంబ్లీకి రావడం అందరి దృష్టిని ఆకర్షించారు. తాను కూడా సింగరేణి కార్మికుడినని గుర్తుచేస్తూ ఎమ్మెల్యే అసెంబ్లీకి రావడం కార్మికులు హర్షం వ్యక్తంచేశారు. అవే దుస్తులతో అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడాన్ని రామగుండం ప్రజలు, సింగరేణి బెల్ట్ కార్మికులు స్వాగతించారు.

హామీలు నెరవేరుస్తా..



అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీల అమలు మొదలైంది. ఆరు గ్యారెంటీలలో కీలకమైన మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. హుస్నాబాద్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం. నన్ను గెలిపించిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా.

– పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ ఎమ్మెల్యే,
బీసీ సంక్షేమశాఖ మంత్రి

సమస్యలు పరిష్కరిస్తా



పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తా. ప్రజా అవసరాలు తీర్చేందుకు ప్రాధాన్యమిస్తా. బస్ డిపో ఏర్పాటు, ప్రధాన కూరగాయల మార్కెట్ అభివృద్ధి తదితర సమస్యలు పరిష్కరిస్తా. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాల ఫలాలను అందిస్తా.

– విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే

కార్మికులకు రక్షణగా ఉంటా



సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటా. రామగుండం నియోజకవర్గ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా. సింగరేణితోపాటు స్థానిక సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తా. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా.

– రాజ్ ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

సీపీఎస్ రద్దుకు కృషి



గన్నేరువరం: సీపీఎస్ రద్దుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారని టీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పుప్పాల కృష్ణకుమార్, హన్మండ్ల భాస్కర్ తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు అంశం చేర్చారని, ఈ విధానాన్ని రద్దు చేసి పాత విధానం అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబుని కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. 2004 తరువాత నియామకం అయిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం లేక సీపీఎస్ విధానంతో సమమతమవుతున్నారని మంత్రికి వివరించినట్లు తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పులి దేవేందర్, రాష్ట్ర కార్యదర్శి చేరాల తిరుపతి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆకుల చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు తాళ్ల నాగరాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విద్యానగర్(కరీంనగర్):అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ దివ్యాంగులకు సన్మానం కోసం అర్హులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి ఎం.సరస్వతి తెలిపారు. ఈనెల 12లోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సూపరింటెండెంట్ ఆర్.శ్రీనివాస్‌ను 8639040488 సంప్రదించాలని సూచించారు.

యాదాద్రి తరహాలో చేస్తా..



మేడారం, కాళేశ్వరం లింక్–2 ద్వారా ఈప్రాంత రైతులకు పూర్తిస్థాయిలో సాగు, తాగునీరు వచ్చేలా చూస్తా. జంగల్‌నాలా ప్రాజెక్టుకు లింక్–2 ద్వారా తూము ఏర్పాటు చేస్తాం. ధర్మపురి పట్టణంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు, ధర్మపురిలో బస్‌డిపో ఏర్పాటు రెవెన్యూ డివిజన్ హోదా, యాదాద్రి తరహాలో అభివృద్ధికి కృషి చేస్తా.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే

ఫుడ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు కృషి



జగిత్యాల నియోజకవర్గంలో దాదాపు ఇప్పటికే వెయ్యికోట్లతో అభివృద్ధి చేసుకున్నాం. ఫుడ్ ఇండస్ట్రీతో పాటు పెండింగ్‌లో ఉన్న మెడికల్ కాలేజీ పూర్తిస్థాయి పనులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా. సారంగాపూర్ మండలం గొల్ల వాగు ప్రాజెక్టు పూర్తయింది. అటవీశాఖ అనుమతితో గేట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. మెజార్టీ గ్రామాల్లో సీసీ రోడ్లు వేశాం, వేయని వాటిలోనూ పూర్తి చేస్తాం.

– సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

పరిశ్రమల స్థాపనకు..



కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తాం. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచి గల్ఫ్ వలసలు నివారించడంపై దృష్టి పెడతా. మున్సిపాలిటీలను ఇప్పటికే అగ్రగామిగా నిలపాం. వాటిని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం. నియోజకవర్గంలో పీజీ కళాశాలలు, సీటీ స్కాన్ సెంటర్, పేదలకు ఇళ్ల నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్స్ ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల ఎమ్మెల్యే

టెంపుల్ సిటీగా మారుస్తా..



అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిపెడతా. వేములవాడ నగరాన్ని టెంపుల్ సిటీగా మార్చేందుకు కృషి చేస్తా. నియోజకవర్గ సమస్యలతోపాటు ఆలయ అభివృద్ధికి పెద్దపీట వేస్తాం. స్థానిక సమస్యలపై అవగాహన మేరకు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తా. ప్రజలు నాపై పెట్టుకున్న ఆశలను నిలబెట్టుకుంటా.

– ఆది శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే

అభివృద్ధే ధ్యేయం



ఎన్నికల్లో నన్ను గెలిపించిన చొప్పదండి ప్రజలకు రుణపడి ఉంటాను. పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన హామీలు నెరవేర్చడం ఇప్పటికే మొదలైంది. స్థానికంగా ఇచ్చిన హామీలపై దృష్టి పెడతాం. ప్రాధాన్య క్రమంలో అన్నింటినీ పరిష్కరిస్తాం. మౌలిక సదుపాయాలతోపాటు అన్నిరంగాల్లో చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం.

– మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా..



రహదారుల అభివృద్ధి కోసం నిధులు తీసుకొస్తా. నియోజకవర్గంలో పదేళ్లుగా ఇళ్లు లేకుండా ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇళ్ల స్థలాలతోపాటు ఇంటి నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తా. తాగు సాగునీరు సదుపాయాలతోపాట మౌలిక వసతుల కల్పనకు కషి చేస్తా. గ్రామాల్లో సీసీ రోడ్లు కల్వర్టుల నిర్మాణానికి కృషి చేస్తా.

– కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూర్ ఎమ్మెల్యే

భావితరాల కోసం పాటుపడతా



కరీంనగర్‌ను అన్ని రంగాల్లో తీర్చిదిద్దా. స్మార్ట్‌సిటీ, ఎంఆర్ఎఫ్ ప్రాజెక్టు, కేబుల్ బ్రిడ్జితో పర్యాటక అభివృద్ధికి పెద్దపీట వేశాం. టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వేంకటేశ్వరాలయం పూర్తిచేసి ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి కృషిచేస్తాం. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని కొత్త పనులు ప్రారంభిస్తా.

– గంగుల కమలాకర్, కరీంనగర్ ఎమ్మెల్యే

మహిళల్లో 'మహా'నందం

విద్యానగర్/హుజూరాబాద్: తెలంగాణ నూతన సర్కారు ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా జిల్లాలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఘనంగా ప్రారంభమైంది. కరీంనగర్ బస్టాండులో కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్టీసీ, పోలీసు అధికారులతో కలిసి పథకాన్ని ప్రారంభించారు. మహిళలతో కలిసి బస్సు ఎక్కి జీరో టికెట్ తీసుకుని, కొద్దిదూరం ప్రయాణించారు. ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణానికి తొలిరోజు మంచి స్పందన వచ్చింది. పెద్ద సంఖ్యలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఉచిత ప్రయాణంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, థర్డ్ జెండర్లు తమ తొలిరోజు ప్రయాణం, పథకం గురించి వివరిస్తూ.. హర్షం వ్యక్తం చేశారు.



కండక్టర్ నుంచి జీరో టికెట్ తీసుకుంటున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఆనందంగా ఉంది



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేయడమే కాకుండా థర్డ్ జెండర్లను గుర్తించింది. సముచితస్థానం కల్పిస్తూ.. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉంది.

– గోల్డీ, ట్రాన్స్‌జెండర్, కరీంనగర్

లోకల్ బస్సులు నడపాలి



ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణంలో విద్యార్థులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. లోకల్ బస్సులు నడపాలి. స్కూళ్లకు సరైన సమయంలో వెళ్లడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవు.

– అక్షయ, శర్మనగర్, కరీంనగర్

ఊర్లకు బస్సులు పెంచాలి



పల్లెటూర్ల నుంచి కూరగాయలు తీసుకొచ్చే వారి కోసం ప్రత్యేక బస్సులు నడిపించాలి. ఉచిత బస్సు ద్వారా తక్కువ ధరకే కూరగాయాలు అమ్ముకోవచ్చు. మాకు లాభం అయితది. కొనే వారికి లాభం ఉంటుంది. బస్సులు సమయానికి రావాలి.

– లక్ష్మి, వేగురుపల్లి

ప్రత్యేక కార్డులివ్వాలి



ఈ పథకం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలి. సాధారణ రోజుల్లోనే అవకాశం కల్పించాలి. పండగలు, జాతరలు, ప్రభుత్వ ఉద్యోగులను ఈ పథకం నుంచి మినహాయిస్తే బాగుంటుంది.

– పూజ, థర్డ్‌జెండర్, కరీంనగర్

నిరంతరం కొనసాగించాలి



ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే కనీసం వందరూపాయి తీసుకుని వెళ్లాల్సివచ్చేది. డబ్బులు లేనప్పుడు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఈ పథకాన్ని ప్రారంభించి మా ఇబ్బందులను తొలగించారు. మహిళల సంక్షేమం కోసం ఈ పథకాన్ని నిరంతరం కొనసాగించాలి.

– రేణుక, కొత్తగట్టు

అవగాహన కల్పించాలి



మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారే తప్ప.. మహిళలు ఏ బస్సు ఎక్కాలనే ప్రచారం బస్టాండ్‌లో లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఎక్కే బస్సు గురించి మాటి మాటికి బస్టాండ్‌లో ఉండే అధికారులను అడగాల్సిరావడంతో ఇబ్బంది అవుతుంది.

– శారద, జమ్మికుంట

పథకం బాగుంది



మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం బాగుంది. పథకాన్ని అడ్డుపెట్టుకుని వేరే చార్జీలు పెంచొద్దు. ప్రభుత్వం కూడా నష్టపోకుండా ఈ పథకాన్ని వర్తింపజేస్తే బాగుంటుంది. ఈ పథకం మహిళలకు ఎంతో ఉపయోగం.

– కేదేశ్వరి, రాచపల్లి

పేదల ఆరోగ్యానికి భరోసా

- ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షల పెంపునకు శ్రీకారం
- ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రారంభించిన కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌టౌన్: ఆరోగ్యశ్రీ పథకం రూ.10 లక్షలకు పెంచడం ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయం రూ.10లక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం ద్వారా ఎంత పెద్ద అనారోగ్య సమస్య వచ్చినా ఒక్కపైసా ఖర్చు లేకుండా వైద్యం చేయించుకునే వీలు ఉంటుందని అన్నారు. తెల్లరేషన్ కార్డుల కలిగిన వారందరూ ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఏసీపీ మాధవి, డీఎంహెచ్‌వో కె.లలితాదేవి, డీడబ్ల్యూవో సరస్వతీ, డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



నిఖత్‌కు టికెటిచ్చిన మంత్రి పొన్నం

మహాలక్ష్మి పథకం ప్రారంభం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో కలిసి బాక్సర్ నిఖత్ జరీన్‌కు టికెట్ ఇస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్.

– కరీంనగర్

క్లుప్తంగా

'మద్దతు ధరపై బీజేపీ మాట నిలుపుకోవాలి'

కరీంనగర్‌: ధాన్యం మద్దతు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. మద్దతు ధరను నిర్ణయించాల్సి బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నందున ధాన్యం మద్దతు ధరను పెంచాలని డిమాండ్‌ చేశారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఎంఎస్పీ రూ.3100కు పెంచుతామని బీజేపీ నాయకులు ప్రకటించిన నేపథ్యంలో వెంటనే పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రాలేదన్న అక్కసుతో మద్దతు ధర పెంచకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని బీజేపీకి హితువు పలికారు. ఎఫ్‌సీఐ నేరుగా రంగంలోకి దిగి ధాన్యం కొనుగోలు చేసినట్టయితే రైతులకు లాభం చేకూరుతుందన్నారు. పత్తికి కూడా మద్దతు ధర పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. వెంటనే ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ.10వేల చొప్పున ధర చెల్లించాలని డిమాండ్‌ చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అల్ఫోర్స్‌ విద్యార్థి ఎంపిక


మణితేజను అభినందిస్తున్న నరేందర్‌ రెడ్డి

రామడుగు(చొప్పదండి): రామడుగు మండలం వెదిరలోని అల్ఫోర్స్‌ బాయ్స్‌ ఇంటర్నేషనల్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థి ఎం.మణితేజ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్‌ డాక్టర్‌ వి.నరేందర్‌ రెడ్డి తెలిపారు. మణితేజను శనివారం అభినందించిన నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడం సంతోషంగా ఉందని అన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్‌: మండలంలోని కొత్తపల్లి శివారులో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడకు చెందిన గాండ్ల రాజు కరీంనగర్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. కరీంనగర్‌ నుంచి హుస్నాబాద్‌కు బయలుదేరాడు. పని నిమిత్తం మార్గమధ్యలో బస్సు దిగాడు. కొత్తపల్లి శివారులో నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్‌ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. తలకు గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. బ్లూ కోల్ట్స్‌ పోలీసులు మల్లికార్జున్‌, శ్రీనివాసు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 108 వాహనంలో కరీంనగర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌ కానిస్టేబుల్‌ గంగారాజం తెలిపారు.

అలుపెరుగని పరుగు..

- ఏడు పదుల వయసులోనూ పరుగెడుతున్న రామానుజమ్మ
- ఇటీవల మలేషియాలో రజతం సొంతం
- వంద పతకాలు సాధించిన అమ్మ
- పరుగెత్తితే పతకం ఖాయం

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వెటరన్‌ అథ్లెట్‌ టమటం రామానుజమ్మ రెండున్నర దశాబ్దాలుగా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలతోపాటు అంతర్జాతీయ వేదికలపై పరుగుతీస్తూ ప్రతిభ కనబరుస్తోంది. మాస్టర్‌ అథ్లెట్‌గా పేరుపొందిన రామానుజమ్మ వందకుపైగా పతకాలు సాధించింది. పరుగుపందెంతోపాటు యోగా, కరాటేలోనూ ప్రతిభ కనబరుస్తుంది. పదోతరగతి వరకు చదువుకున్న రామానుజమ్మ పదేళ్ల ప్రాయం నుంచే క్రీడల్లో ఆసక్తి పెంచుకోగా.. భర్త భూషయ్య సహకారంతో మొదటిసారి 1995లో మాస్టర్‌ అథ్లెట్‌గా పరుగుపందెంలో పాల్గొంది. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే ఆటలపై ఆసక్తి పెంచుకొని మహిళాలోకానికి ఆదర్శంగా నిలిచింది. 1996లో కరీంనగర్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్‌ వెటరన్‌ అసోసియేషన్‌ పోటీల్లో వందమీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం సాధించింది. 70 ఏళ్ల వయసులో ఇప్పటి వరకు రామానుజమ్మ పరుగుపందెం, జావలింగ్‌ త్రో, షాట్‌పుట్‌ క్రీడల్లో 60 బంగారు పతకాలు, 44 వెండి పతకాలతోపాటు మరెన్నో ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలను సాధించింది. హర్యానాలో జరిగిన మాస్టర్‌ అథ్లెటిక్స్‌ పోటీల్లో పాల్గొని దేశం తరపున మలేషియా వెళ్లేందుకు ఎంపికైంది.


సాధించిన పతకాలతో రామానుజమ్మ

సమాజసేవలో..

- రామానుజమ్మ తన కళ్లతోపాటు దేహాన్ని సైతం మరణానంతరం కరీంనగర్‌లోని చల్మెడ వైద్యవిజ్ఞాన సంస్థకు లయన్స్‌క్లబ్‌ ద్వారా దానం చేసేందుకు ముందుకొచ్చింది. దేహాన్ని ఆస్పత్రికి అందించేందుకు అంగీకారపత్రాన్ని ఇచ్చింది. 70 ఏళ్ల వయసులోనూ ఎంతో ఉత్సాహంగా ఆమె అందరినీ పలకరిస్తూ.. సాగిపోతుంది.

పరుగుల రాణి

- 1997లో ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో జరిగిన ఏపీ వెటరన్‌ అమెచ్యూర్‌ అథ్లెటిక్‌ మీట్‌లో పాల్గొని వందమీటర్ల రిలే పరుగుపందెంలో ద్వితీయ స్థానం సాధించింది.
- 1998లో ఏలూరులో జరిగిన పోటీల్లో పసిడి పతకం సాధించింది.
- 1999లో పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన ఏపీ రాష్ట్ర వెటరన్‌ అమెచ్యూర్‌ అథ్లెటిక్‌ మీట్‌లో స్వర్ణం.
- 2000లో హైదరాబాద్‌లో జరిగిన ఓపెన్‌ వెటరన్‌ అథ్లెటిక్‌మీట్‌లో స్వర్ణం.
- 2001 వరంగల్‌ జిల్లా కాజీపేటలో జరిగిన పోటీల్లో 400 మీటర్ల పరుగుపందెంలో పసిడి పతకం సాధించింది.
- 2004–05 హైదరాబాద్‌, చెన్నైలలో జరిగిన జాతీయస్థాయి పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది.
- 2007 జనవరిలో వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం.
- 2012 డిసెంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన పరుగుపందెంలో ప్రథమ స్థానం.

సండే స్పెషల్‌


మలేషియాలో జాతీయ పతాకంతో రామానుజమ్మ

బంగారు పతకాన్ని సాధించేదాన్ని

వయసు శరీరానికే కానీ, మనసుకు కాదని నమ్ముతాను. అందుకే పోటీలు ఎక్కడున్నా పట్టుబట్టి మరీ వెళ్తాను. పాస్‌పోర్టులో నా వయసు 50గా నమోదైంది. దీంతో నా వయసు 70 అయినా.. 50 ఏళ్లవాళ్లతో పోటీపడి పరుగుతీయాల్సి వచ్చింది. దీంతో నాకు మూడో స్థానంతో రజతం వచ్చింది. కానీ 70 ఏళ్ల వాళ్లతో పోటీపడితే బంగారు పతకం సాధించేదాన్ని. చిన్న పొరపాటు నాకు స్వర్ణాన్ని దూరం చేసింది. అయినా.. అంత దూరం వెళ్లి పతకం సాధించడం మరిచిపోలేని అనుభూతి. నాకు చిన్నప్పటి నుంచి ఆటలపై ఉన్న ఆసక్తితో పోటీల్లో పాల్గొంటున్నాను. నన్ను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న వారికి ధన్యవాదాలు.

– టమటం రామానుజమ్మ


మలేషియాలో సాధించిన పతకాలతో టమటం రామానుజమ్మ

అవినీతిని అడ్డుకోవాలి

విద్యానగర్‌(కరీంనగర్‌): అవినీతి నిర్మూలన చట్టాలపై అవగాహన పెంచుకుని, ప్రతీ పౌరుడు అప్రమత్తతతో అవినీతిని అడ్డుకోవాలని తెలంగాణ ఎకనామిక్‌ ఫోరం, సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నేదునూరి కనకయ్య సూచించారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని ఫోరం రాష్ట్ర కార్యాలయంలో అవినీతి నిర్మూలనలో పౌర సమాజం పాత్ర అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రంగాల్లో అవినీతి రాజ్యమేలడంతో ప్రగతి సంక్షేమ ఫలాలు పేదలకు అందని ద్రాక్షగా మారాయని అన్నారు. తెలంగాణ ఎకనామిక్‌ ఫోరం రాష్ట్ర సలహాదారు డాక్టర్‌ బి.దశరథం, గంట అశోక్‌, కంటె రాంచందర్‌, తెలంగాణ వివేక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ వాసరవేణి పరశురాం, ఎకనామిక్స్‌ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ చీకోటి శ్రీనివాస్‌, ఉపాధ్యక్షుడు తిరుమల్‌, సుధాకర్‌, ఐసీఎఫ్‌ఏఐ లా స్కూల్‌ ఎకనామిక్స్‌ ప్రొఫెసర్‌ పి.కేసరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో టిప్పర్‌ డ్రైవర్‌ మృతి

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌ ప్రాంతంలో జగిత్యాల–నిజామాబాద్‌ ప్రధాన రహదారిపై ఓ టిప్పర్‌కు విద్యుత్‌ వైర్లు తగిలి డ్రైవర్‌ తాటిపాముల వెంకటేశ్‌ (40) అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మల్యాల మండలం ఒబులాపూర్‌కు చెందిన తాటిపాముల వెంకటేశ్‌ మల్యాల మండలం రామన్నపేటలో ఓ క్రషర్‌ యజమాని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం జగిత్యాల–నిజామాబాద్‌ రహదారిపై రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతుండగా టిప్పర్‌ ద్వారా మట్టి తీసుకెళ్లి అన్‌లోడ్‌ చేస్తుండగా విద్యుత్‌ వైర్లు టిప్పర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని కుటుంబసభ్యులు, బంధువులు డిమాండ్‌ చేశారు. మృతుడికి భార్య రేఖ, కుమారుడు మనోజ్‌, కుమార్తె కావేరి ఉన్నారు.

ఒక్కొక్కరుగా రాజీనామా!

- బీఆర్‌ఎస్‌కు రెండు పదవులు దూరం
- ఎమ్మెల్సీ పదవికి పాడి కౌశిక్‌రెడ్డి రాజీనామా
- వ్యవసాయ ముఖ్య సలహాదారు పోస్ట్‌ రద్దు చేసిన సీఎం
- గతంలోనే రాజీనామా చేసిన రవీందర్‌సింగ్‌, కుర్మాచలం అనిల్‌
- జీవన్‌రెడ్డి, సంజయ్‌, అర్వింద్‌ ఓడినా పదవుల్లోనే..





సాక్షిప్రతినిధి,కరీంనగర్‌: ఉమ్మడి జిల్లాకు సంబంధించి బీఆర్‌ఎస్‌ మరో రెండు పదవులు కోల్పోయింది. ఇందులో ఒకటి మండలిస్థానం కాగా, మరొకటి నామినేటెడ్‌ పోస్టు కావడం గమనార్హం. హుజూరాబాద్‌ ఎమ్మెల్యేగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామాను మండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డికి అందజేశారు. రాజీనామా సమర్పించడానికి తన ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. తన తండ్రి, మాజీ సీఎం కేసీఆర్‌కు శస్త్ర చికిత్స నేపథ్యంలో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ కూడా ప్రమాణ స్వీకారం చేయలేదు. వీరిద్దరూ, బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి మరో తేదీన ప్రమాణ స్వీకారం చేస్తారని సమాచారం.

బీఆర్‌ఎస్‌కు మరో షాక్‌

అదే సమయంలో మధ్యాహ్నానికి ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్‌ పార్టీకి మరో షాక్‌ తగిలింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ పలు కీలక విభాగాలలో నియమించుకున్న సలహాదారుల పోస్టులను రద్దు చేస్తూ తాజా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సదరు జాబితాలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు కూడా ఉన్నారు. గతంలో పౌరసత్వ సమస్య ఉన్న కారణంగా ఆయనకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీపార్టీ టికెట్‌ నిరాకరించిన విషయం తెలిసిందే. అయితే, ఆయన అనుచరులను సంతృప్తి పరిచేందుకు, సేవలను పార్టీ వినియోగించుకునేందుకు కేబినెట్‌ హోదాకు సమానమైన వ్యవసాయశాఖ ముఖ్య సలహాదారుగా నియమించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇంతకాలం కంటితుడుపుగా ఉందనుకున్న పోస్టు కూడా తాజా ప్రభుత్వం నిర్ణయంతో దూరమైంది. ఇటీవల ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఓటమి చెందిన దరిమిలా సివిల్‌ సప్లయీస్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ పదవికి సర్దార్‌ రవీందర్‌సింగ్‌, ఫిలిం డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ సీటుకు అనిల్‌ కుర్మాచలం రాజీనామా సమర్పించిన విషయం తెలిసిందే. దీంతో ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌ కోల్పోయిన పదవుల సంఖ్య నాలుగుకు చేరింది.

ఓడినా పదవుల్లో ఉండేది వీరే...

ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీకి పోటీ చేసిన పలువురు స్థానికసంస్థలు, చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న ప్రజాప్రతినిధులు ఓటమి చెందారు. వారిలో పాడి కౌశిక్‌రెడ్డి మినహా మిగిలిన వారంతా వారి పదవుల్లో కొనసాగనున్నారు. కరీంనగర్‌ ఎంపీ బండి సంజయ్‌, కోరుట్ల అభ్యర్థిగా ఓడిన నిజామాబాద్‌ ఎంపీ డి.అర్వింద్‌ ఎంపీలుగా కొనసాగనున్నారు. వీరిద్దరూ ఇప్పటికే ఎంపీలుగా తమ పని తాము చేసుకుపోతున్నారు. ఇక రామగుండం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి జెడ్పీటీసీగా, మంథని ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్దపల్లి జెడ్పీ చైర్మన్‌ పుట్ట మధు కొనసాగుతారు. జగిత్యాల కాంగ్రెస్‌ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఎమ్మెల్సీగా మరో ఏడాదిన్నర కాలముంది.

సిరిసిల్లలో కాంగ్రెస్‌ ఫ్లెక్సీల చించివేత

- పోలీసులకు ఫిర్యాదు

సిరిసిల్ల: కాంగ్రెస్‌ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని సిరిసిల్లలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. దీనిపై ఆ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోనియాగాంధీ పుట్టినరోజు శనివారం ఉండగా.. శుక్రవారం రాత్రి సిరిసిల్లలో కాంగ్రెస్‌ పార్టీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే తెల్లవారే సరికి పలు చోట్ల ఉన్న ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చింపేశారు. గాంధీచౌక్‌లో రెండు చోట్ల భారీ ఫ్లెక్సీలను చింపేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో డివైడర్‌పై కట్టిన ఫ్లెక్సీలను సైతం చింపేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ విషయమై కాంగ్రెస్‌ నాయకులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిరిసిల్ల కాంగ్రెస్‌ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్‌, చొప్పదండి ప్రకాశ్‌, వైద్య శివప్రసాద్‌, వెల్ముల తిరుపతిరెడ్డి ఎస్సై శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఘనంగా సోనియాగాంధీ జన్మదినం


తెలంగాణ చౌక్‌లో కేక్‌ కట్‌ చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

- నగరవ్యాప్తంగా కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు

కరీంనగర్‌ కార్పొరేషన్‌: ఏఐసీసీ నేత సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా శనివారం కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో కేక్‌కటింగ్‌లు, అన్నదానం, ప్రార్థనలు, పాలాభిషేకం, స్వీట్లు పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. యువజన కాంగ్రెస్‌ నాయకుడు వీర దేవేందర్‌ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఆర్‌ కళాశాల మైదానంలో వాకర్స్‌తో కలిసి కేక్‌కట్‌ చేశారు. సీఎస్‌ఐ చర్చి వద్ద బొబ్బిలి విక్టర్‌ ఆధ్వర్యంలో కేక్‌కట్‌ చేసి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ నివాసం వద్ద బీసీ సెల్‌ జిల్లా, నగర అధ్యక్షుడు పులి ఆంజనేయులు, బోనాల శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో కేక్‌కట్‌ చేశారు. జిల్లా కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో పురుమల్ల శ్రీనివాస్‌, డీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నగర కాంగ్రెస్‌ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌ రెడ్డి, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌ కుమార్‌, రహమత్‌ హుస్సేన్‌ కేక్‌కట్‌ చేశారు. సప్తగిరికాలనీ వద్ద మన్నే జ్యోతి, మంకమ్మతోట చౌరస్తా వద్ద ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు పొన్నం మధు ఆధ్వర్యంలో, ఇందిరాచౌక్‌ వద్ద ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్‌ ఆధ్వర్యంలో కేక్‌ కట్‌ చేశారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి చౌరస్తా వద్ద సర్వర్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను మాజీ కార్పొరేటర్‌ వైద్యుల శ్రీదేవి కట్‌చేశారు. అంబేడ్కర్‌ నగర్‌లోని అంగన్వాడి కేంద్రంలో పార్టీ సోషల్‌ మీడియా కన్వీనర్‌ ఆమిర్‌ ఆధ్వర్యంలో పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. సుభాష్‌ చంద్రబోస్‌ విగ్రహం వద్ద ముల్కల కవిత యోనా ఆధ్వర్యంలో కేక్‌ కట్‌ చేశారు. వృద్ధులు వికలాంగుల ఆశ్రమం వద్ద పట్టణ మహిళా కాంగ్రెస్‌ నాయకురాలు రజిత ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులకు బ్రెడ్‌ , పండ్లు పంపిణీ చేశారు. కిసాన్‌నగర్‌లోని మైత్రి కన్వెన్షన్‌ వద్ద దీకొండ శేఖర్‌ ఆధ్వర్యంలో, కిసాన్‌నగర్‌లోని విద్యాభారతి పాఠశాల వద్ద మంద మహేష్‌ ఆధ్వర్యంలో, కార్ఖానగడ్డ గాంధీ విగ్రహం వద్ద లింగంపల్లి బాబు ఆధ్వర్యంలో,మహిళా కాంగ్రెస్‌ నాయకురాలు షబానా మహమ్మద్‌ అనీఫ్‌ ఆధ్వర్యంలో మైముదియా మసీదు వద్ద కేక్‌ కట్‌ చేశారు. హైమద్‌పుర చౌరస్తా వద్ద యువజన కాంగ్రెస్‌ నాయకుడు ఎం.ఏ.ఖలీమ్‌ ఆధ్వర్యంలో కేక్‌ కట్‌ చేశారు. 30వ డివిజన్‌ మారుతి నగర్‌ జెండా చౌరస్తా వద్ద దొంతి గోపి ఆధ్వర్యంలో సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప దీక్షపరులకు, భక్తులకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. 32వ డివిజన్‌లోని కోతిరాంపూర్‌ చౌరస్తా వద్ద చర్ల పద్మ ఆధ్వర్యంలో కేక్‌ కట్‌ చేశారు. నగరంలోని సిక్‌వాడీలోని గురుద్వార్‌లో దన్నాసింగ్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్‌ కట్‌ చేశారు. కాంగ్రెస్‌ మైనారిటీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు ఎం.డి.తాజుద్దీన్‌ ఆధ్వర్యంలో నగరంలోని మదర్సాలో పండ్లు పంపిణీ చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పసికందుల మృతి

- వైద్యుల నిర్లక్ష్యమని కుటుంబ సభ్యుల ఆరోపణ

వేములవాడఅర్బన్‌: వైద్యుల నిర్లక్ష్యంతోనే వేములవాడ ఏరియా ఆస్పత్రిలో పురిట్లోనే పసిపాప మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాలు.. బోయినపల్లి మండలం జగ్గారావుపల్లికి చెందిన తిప్పారవేణి అమూల్య మొదటి కాన్పు కోసం వేములవాడ ఏరియా ఆస్పత్రికి గురువారం వచ్చింది. వైద్యులు నార్మల్‌ డెలివరీ చేస్తామని చెప్పి.. శుక్రవారం రాత్రి ప్రసవం చేస్తుండగా పాప అడ్డం తిరిగింది. ఆపరేషన్‌ చేయగా అప్పటికే పాప మృతిచెందింది. ముందే ఆపరేషన్‌ చేయమంటూ వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ రేగులపాటి మహేశ్‌రావును వివరణ కోరగా.. నార్మల్‌ డెలివరీ కోసం అడ్మిట్‌ అయ్యారని, కాన్పు చేసే క్రమంలో పాప అడ్డం తిరగడంతో ఆపరేషన్‌ చేసినట్లు తెలిపారు. పాపను బతికించేందుకు ప్రయత్నించినా మృతిచెందిందని తెలిపారు.

సిరిసిల్లలో..

సిరిసిల్లటౌన్‌: జిల్లా జనరల్‌ ఆస్పత్రిలో శనివారం ఉదయం నాలుగు రోజుల పసికందు మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన భాగ్యకు పురిటినొప్పులు రాగా కుటుంబ సభ్యులు డిసెంబర్‌ 5 సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో పురుడుపోసుకోగా శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈవిషయమై ఆస్పత్రి సిబ్బందిని వివరణ కోరగా నెలలు నిండకముందే ప్రసవమైందని, తక్కువ బరువు పుట్టిందని తెలిపారు.

శిశువు తారుమారు..?

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని మాతాశిశు సంక్షేమ కేంద్రంలో శిశువు తారుమారైందని గొడవ జరిగినట్లు తెలిసింది. ధరూర్‌ క్యాంప్‌నకు చెందిన ఓ మహిళ ఈనెల 6న డెలివరీ కోసం వచ్చింది. అలాగే జగిత్యాల పట్టణానికి చెందిన మరో మహిళ 7న ప్రసవం కోసం వచ్చింది. ఒకరికి నార్మల్‌ డెలివరీ కాగా.. మరొకరికి సిజేరియన్‌ చేసి పురుడుపోశారు. ఇందులో ధరూర్‌ క్యాంప్‌నకు చెందిన మహిళ శిశువు తారుమారు అయ్యిందని అనుమానం వ్యక్తం చేసింది. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్‌ రాములును వివరణ కోరగా.. ప్రసవం అయినప్పుడు వెంటనే ట్యాగ్‌లు వేస్తారని, అలాంటి సమస్యలు చోటుచేసుకోవని పేర్కొన్నారు. అనుమానాలు కూడా లేవని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వేములవాడఅర్బన్‌: వేములవాడ మండలం అనుపురం వద్ద కరీంనగర్‌–సిరిసిల్ల ప్రధాన రహదారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి అక్కడిక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు. రుద్రవరం గ్రామానికి చెందిన పాముల పర్శరాములు(55) బైక్‌పై నాంపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా అనుపురం గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య దుర్గవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బావిలో దూకిన మహిళ.. కాపాడిన ఫైర్‌ అధికారులు

కరీంనగర్‌క్రైం: ఆత్మహత్య చేసుకోవడానికి బావిలో దూకిన మహిళను కరీంనగర్‌ ఫైర్‌ డిపార్టుమెంట్‌ సిబ్బంది కాపాడారు. ఫైర్‌ అధికారుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కృష్ణానగర్‌కు చెందిన ప్రత్యూష కుటుంబ పరిస్థితులతో ఆత్మహత్య చేసుకుందామని శనివారం ఉదయం ఇంటి ఆవరణలో ఉన్న బావిలో దూకింది. వెంటనే స్థానికులు ఫైర్‌ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్‌ రెస్క్యూటీం వెళ్లి బావిలో నుంచి మహిళను సురక్షితంగా బయటకు తీశారు. డివిజన్‌ ఫైర్‌ అధికారి వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

5 కిలోల గంజాయి పట్టివేత

వేములవాడరూరల్‌:మండలంలోని వట్టెంల శివారులో 5 కిలోల గంజాయిని శనివారం పట్టుకున్నట్లు వేములవాడరూరల్‌ సీఐ కృష్ణకుమార్‌ తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన కమిటి కారా అనే వ్యక్తి నుంచి ఈ గంజాయిని పట్టుకున్నట్లు వివరించారు. జగిత్యాల నుంచి వస్తున్న ఈ వ్యక్తి గంజాయి తీసుకొస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో తనిఖీలు నిర్వహించగా వట్టెంల శివారులో నిందితున్ని పట్టుకున్నామని తెలిపారు.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ





వేములవాడ: రాజన్నను శనివారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఉదయం నుంచే తరలివచ్చారు. రాజన్నను రాష్ట్ర దేవాదాయశాఖ రీజినల్‌ జాయింట్‌ సెక్రటరీ రామకృష్ణ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఏఈవో ప్రతాప నవీన్‌ స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటం అందించి ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

మంత్రి 'పొంగులేటి'కి శుభాకాంక్షలు



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న భాస్కర్‌రెడ్డి

కొత్తపల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రిగా నియమితులైన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

'గంగుల' గెలుపుతో మొక్కు చెల్లింపు



మొక్కు చెల్లిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొత్తపల్లి: కరీంనగర్ ఎమ్మెల్యేగా గంగుల కమలాకర్ నాలుగోసారి విజయం సాధించాలన్న కోరిక నెరవేరినందుకు బద్దిపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మొక్కు చెల్లించుకున్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి కొబ్బరికాయలు కొట్టారు. మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఉపసర్పంచ్ రాచమల్ల మనోజ్, నాయకులు తాండ్ర శ్రీనివాస్, భూమయ్య, పి.మల్లారెడ్డి, కూన నాగరాజు, ఆర్.శ్రీధర్, సతీశ్, అశోక్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీర్ పార్కు సందర్శన



పార్కులో విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ పాఠశాల ప్రీ ప్రైమరీ విద్యార్థులు శనివారం నగరంలోని డీర్ పార్కును సందర్శించారు. పాఠ్యాంశంలో భాగంగా వారిని అక్కడికి తీసుకెళ్లినట్లు పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రిన్సిపాల్ పల్లవి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించడం వల్ల పాఠ్యాంశంలోని విషయాలను అర్థం చేసుకోవడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: ఇటీవల మృతిచెందిన తీగలగుట్టపల్లి మాజీ సర్పంచ్ కాశెట్టి రంగమ్మ చిత్రపటానికి శనివారం బీఆర్‌ఎస్ నాయకులు నివాళి అర్పించారు. ఆమె కుమారులు శ్రీనివాస్, లక్ష్మణ్‌లను పరామర్శించారు. కార్యక్రమంలో బొమ్మకల్ ఎంపీటీసీ సభ్యుడు వెంగల్‌దాసు శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ చెట్టి జగన్ పటేల్, నాయకులు వరాల శ్రీనివాస్, మాదాసు వెంకన్న పటేల్, భాస్కర్‌రెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నేడు మానకొండూర్‌కు 'కవ్వంపల్లి' రాక

మానకొండూర్: నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా మానకొండూర్‌లో ఆదివారం అడుగుపెట్టనున్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం మానకొండూర్‌కు వస్తుండటంతో స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు భారీఎత్తున తరలిరానున్నారని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి తెలిపారు. ఉదయం 10–11 గంటల మధ్య బెజ్జంకి మండలానికి చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి నేరుగా ఓపెన్ టాప్ జీపులో గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి, తిమ్మాపూర్ మండలం, మానకొండూర్ నియోజకవర్గ కేంద్రం మీదుగా శంకరపట్నం మండలానికి చేరుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దారి పొడవునా ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు భారీ ఎత్తున తరలివచ్చి స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు.

భళా.. చేనేత హస్తకళ మేళా

- కరీంనగర్‌లోని రాజరాజేశ్వర కల్యాణ మండపంలో ప్రదర్శన
- ఈ నెల 24 వరకు నిర్వహణ





వస్తువులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కరీంనగర్ కల్చరల్: చేనేత వస్త్రాలకు ప్రజల నుంచి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద రాజరాజేశ్వర కల్యాణం మండపంలో శ్రీకళాభారతి హస్తకళ మేళాను గత నవంబర్ 24న ప్రారంభించారు. ఈ నెల 24 వరకు ప్రతీరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటలకు వరకు చేనేత వస్తువుల ప్రదర్శన కొనసాగుతోంది. ఇందులో హైదరాబాద్ ముత్యాలు, ఇమిటేషన్, జువెల్లరీ, హస్తకళ వస్తువులు కొనుగోలు చేస్తున్న ప్రజలు అలంకరణ పుష్పాలు, గృహోపకరణాలు, మైసూర్ రోజ్‌వుడ్, ప్యానల్స్, అగర్‌బత్తీలు, షహరాన్‌పూర్, ఉడెన్ లాకర్ వేర్, కళాత్మక ఆభరణాలు, బ్యాంగిల్స్, బ్రాస్ నగిషీలు, బ్లాక్ మెటల్స్, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లెదర్ బ్యాగ్, ఖాదీ గ్రామోద్యోగ్, ఆయుర్వేద ఔషధాలు తదితర వస్తువులున్నాయి.

50కి పైగా స్టాళ్లు..

తమిళనాడు చెట్టినాడు చీరలు, హైదరాబాద్ బంజార ఉత్పత్తులు, హరియాణా సోఫా కట్‌వర్క్స్, దివాన్ సెట్స్, జైపూర్ బెడ్‌షీట్లు, గుజరాత్ టాప్స్, హైదరాబాద్ ఎంబ్రాయిడరీ చీరలు, గద్వాల్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, కళంకారి, మంగళగిరి చేనేతలు, వరంగల్ టవల్స్, లుంగీలు, రాజస్థానీ మాత్ ప్రెషనర్స్, ఉప్పాడ శారీస్, బెంగాలీ కాటన్ చీరలు తదతరాలను 50కి పైగా స్టాళ్లలో అందుబాటులో ఉంచారు. ఒకేచోట అన్ని రకాల దుస్తులు, హస్తకళ సామగ్రి తక్కువ ధరల్లో లభిస్తుండటంతో ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి, కొనుగోలు చేస్తున్నారు.

చెరువు శిఖంలో షెడ్డు నిర్మాణం

- బొమ్మకల్ గ్రామంలో అక్రమ కట్టడంపై ఫిర్యాదు



చెరువు శిఖం భూమిలో నిర్మించిన షెడ్డు

కరీంనగర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల హడావుడిలో అధికారులుండగా కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి చెరువు శిఖం భూమిని మట్టితో నింపి, షెడ్డును నిర్మించడం వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని మల్లయ్య చెరువు విస్తీర్ణం 18 ఎకరాల్లో ఉంటుంది. దశాబ్దాల క్రితమే 18 మంది రైతులకు ఈ చెరువు విస్తీర్ణంలో ఏక్‌సాల్ పట్టాలను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. చెరువులో నీళ్లు లేనపుడు సాగు చేసి, పంటలు పండించేవారు. ఈ క్రమంలో బొమ్మకల్‌లో భూములకు రేట్లు పెరగడంతో డిమాండ్ ఏర్పడింది. ఏడాది క్రితం కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి కొంతమంది పట్టాదారుల నుంచి ఎకరం భూమిని కొనుగోలు చేశాడు. అందులో మట్టి పోసి, చదును చేస్తుండగా స్థానికులు ఫిర్యాదుతో పంచాయతీ, రెవెన్యూ అధికారులు పనులు నిలిపివేయించారు. అయితే, సదరు వ్యక్తి తాజాగా అధికారులు ఎన్నికల బిజీలో ఉండటాన్ని గమనించి, చెరువు స్థలంలో మట్టి పోసి, చదును చేయించాడు. గ్రామ పంచాయతీ, సుడా నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే పెద్ద షెడ్డు నిర్మించాడు. స్థానిక ప్రజాప్రతినిధుల అండతోనే ఇలా చేశాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. మల్లయ్య చెరువులో అక్రమంగా షెడ్డు నిర్మించారని వార్డుసభ్యుడు తోట కిరణ్‌కుమార్ శనివారం పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లాకు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



చింతకుంటలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కరీంనగర్‌లో అమరవీరుల స్తూపం వద్ద..

కొత్తపల్లి: మండలంలోని చింతకుంటలో శనివారం కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను డీసీసీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రవణ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి, పంపిణీ చేశారు. నాయకులు మోహనాచారి, అనిల్‌కుమార్, గద్దల సుజాత, శ్రీనివాస్, రంగా తదితరులు పాల్గొన్నారు. కొత్తపల్లి పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు ఆర్.ప్రభాకర్, జి.శ్రీనివాస్, చిలుక హన్మంతరెడ్డి, ఎర్రం రాజిరెడ్డి, జె.వాసు, కుమార్, పొన్నం శ్రీనివాస్, యాస్వాడ రాజ్‌కుమార్, అండెం ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్: కరీంనగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారులు శనివారం కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు కుమారస్వామి, చొప్పరి సుధాకర్, మల్లేశం, ప్రసన్న, హర్షవర్ధన్ రెడ్డి, నవీన్, శ్రీనివాస్, చంద్రమౌళి, కనకం విద్యాసాగర్, కోండ్ర సంపత్, లక్ష్మి తదితరులున్నారు.

కరీంనగర్‌రూరల్: మండలంలోని దుర్శేడ్, చెర్లభూత్కూర్ గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుర్శేడ్‌లో పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, చెర్లభూత్కూర్‌లో గ్రామశాఖ అధ్యక్షుడు నారాయణగౌడ్ కేక్ కట్ చేసి, గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల ఉపాధ్యక్షులు కనుకయ్య, శేఖర్, లక్ష్మయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎం.సాయిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెర్లభూత్కూర్‌లో...

అవినీతిని అరికడితేనే అభివృద్ధి సాధ్యం

- డీపీవో వీరబుచ్చయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

కరీంనగర్‌కల్చరల్: అవినీతి ఏ రూపంలో ఉన్నా దాన్ని నిర్మూలించాలని డీపీవో వీరబుచ్చయ్య అన్నారు. అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన అవినీతిని నిర్మూలిద్దాం–దేశాన్ని అభివృద్ధి చేద్దాం అనే నినాదంతో ఉన్న పోస్టర్‌ను తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, నాయకులు తమ కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తించాలని అన్నారు. రాష్ట్ర, దేశ అభివృద్ధి అవినీతిని అరికట్టినప్పుడే సాధ్యపడుతుందని పేర్కొన్నారు. హమ్ సంస్థ అవినీతి నిర్మూలనకు చేస్తున్న కృషి, అవగాహన కార్యక్రమాలు సమాజానికి ఎంతో దోహదం చేస్తున్నాయని కొనియాడారు. సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులతో పని చేయించుకోవడం మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దాన్ని ఎవరు అడ్డుకున్నా టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేయాలని సూచించారు. గోగూరి శ్రీధర్ రెడ్డి, ముని గోపాల్, రమణ, వేణుగోపాల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్టీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



మంజూర్ అలీ



అశోక్‌రావు

కరీంనగర్: టీఆర్టీఎఫ్ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఖాజా మంజూర్ అలీ, ప్రధాన కార్యదర్శిగా చింతపల్లి అశోక్ రావు, అసోసియేట్ అధ్యక్షులుగా రమణారావు, గంగాధర్, ముజఫర్ ఉల్లా ఖాన్, ఉపాధ్యక్షులుగా నరసింహారెడ్డి, ఎండీ.సలీం, భూమయ్య, హఫీజ్ ఉద్దీన్, పి.జ్యోతి, కె.జ్యోతి, కార్యదర్శులుగా భాను ప్రకాశ్, లక్ష్మీపతి, లింగారెడ్డి, ఓపీ రఘురాం, ఎం.ఎం.మోయిజ్, మంజూర్ హుస్సేన్, రఘురాం, కమలాకర్‌లను ఎన్నుకున్నారు. మైనారిటీ సెల్ కన్వీనర్‌గా షేక్ హబీబ్ ఉర్ రహమాన్, స్టేట్ కౌన్సిలర్లుగా నందికొండ విద్యాసాగర్, కటకం రమేశ్, సర్వర్, హబీబ్ రహమాన్, దయాకర్, ఎండీ.సలీం, బి.మల్లయ్య, ఖదీర్ అహ్మద్, రామారావు, కూర రమేశ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు సుంకిశీల ప్రభాకర్‌రావు, పరిశీలకుడిగా కటకం రవి వ్యవహరించారు.

'అల్ఫోర్స్'లో అలరించిన పేరెంట్స్ కీ మస్త్



విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి: స్థానిక అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో శనివారం నిర్వహించిన పేరెంట్స్ కీ మస్త్ కార్యక్రమం అలరించింది. విద్యార్థుల తల్లిదండ్రులకు ఏక్ మినట్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, జానపద నృత్యాలు తదితర సంప్రదాయ ఆటలపోటీలు నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యకాళ్లకు నిప్పుతో ముప్పు



ఎలబోతారంలో వరి కొయ్యకాళ్లకు నిప్పు పెట్టిన దృశ్యం

- వరి పంట దిగుబడిపై ప్రభావం
- పొగతో వాతావరణ కాలుష్యం
- పొలంలోనే కలియదున్నితే సేంద్రియ ఎరువుగా ఉపయోగం

కరీంనగర్‌రూరల్: యాసంగి పంటల సాగుకు రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో వానాకాలం వరి కొయ్యకాళ్లను కాల్చేస్తున్నారు. దీనివల్ల పంటల ఎదుగుదలకు తోడ్పాడునందించే సూక్ష్మ పోషకాలు దెబ్బతినడంతో దిగుబడి తగ్గుతుంది. పొగతో వాతావరణ కాలుష్యం ఏర్పడి, గాలి నాణ్యత తగ్గుతుంది. మంటలు అదుపుతప్పి వ్యవసాయ మోటార్లు, పైపులు కాలిపోయిన సందర్భాలున్నాయి. గత పంటకు చెందిన గడ్డి, వ్యర్థాలను కాల్చివేస్తే పొలంలో ఎలాంటి చెత్త ఉండదనే అభిప్రాయం పలువురు రైతుల్లో ఉంది. వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరగడంతో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. గడ్డి అవసరం లేకపోవడంతో పొలాల్లోనే నిప్పంటిస్తున్నారు. పంటల వ్యర్థాలను పొలంలో కలియదున్నడంతో సేంద్రియ ఎరువుగా మారి, భూభౌతిక పరిస్థితి మెరుగుపడుతుందనే అవగాహన రైతుల్లో లేకపోవడం వల్లే ఇలా చేస్తున్నారు. గత నాలుగైదు రోజులు తుపాన్ ప్రభావంతో తేలికపాటి జల్లులు కురిశాయి. శనివారం ఎండ రావడంతో కరీంనగర్ మండలంలోని ఎలబోతారం, చామనపల్లి, నగునూరు, చెర్లభూత్కూర్ తదితర గ్రామాల్లోని అన్నదాతలు పొలాల్లోని వరిగడ్డికి, కొయ్యకాళ్లకు నిప్పంటించి, కాల్చివేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి జక్కం పుల్లయ్య ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం శుభపరిణామమని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడైన ప్రభాకర్ గౌడ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు ఎన్ఎంయూ తరఫున శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

వేంకటేశ్వరాలయంలో పూజలు



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కరీంనగర్ కల్చరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరాలయంలో శనివారం పూజలు నిర్వహించారు. మహిళలు దీపారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చకిలం గంగాధర్, చకిలం శ్రీనివాస్, ఈవో ఉడుతల వెంకన్న, సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం



విద్యానగర్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని శనివారం కరీంనగర్ బస్టాండ్‌లో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అవినీతి అంతం



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్: అవినీతి నిర్మూలన చట్టాలపై అవగాహన పెంచుకొని, వాటి రక్షణలో భాగస్వాములవ్వాలని తెలంగాణ జనసత్తా రాష్ట్ర అధ్యక్షుడు ముదుగంటి సుధాకర్ రెడ్డి అన్నారు. అప్పుడే అవినీతి అంతమవుతుందని పేర్కొన్నారు. శనివారం కరీంనగర్‌లోని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం కార్యాయంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా అవినీతి నిర్మూలనలో పౌర సమాజం పాత్ర అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. దేశంలోని అన్ని రంగాల్లో అవినీతి రాజ్యమేలుతోందని, ప్రభుత్వ నిధులు, పథకాలు ప్రజలకు దూరమవుతున్నాయని అన్నారు. సంఘం అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు మాట్లాడుతూ.. సమాజంలో నైతిక విలువలు పతనమై, అవినీతి, నేరాలు పెరిగాయని అన్నారు. అవినీతి నిర్మూలన చట్టాలను పటిష్ఠంగా అమలు చేసే పాలనాపరమైన సంస్కరణలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తంగెడ నవనీతరావు, భూంపల్లి మోహనరెడ్డి, ముదుగంటి దామోదర్ రెడ్డి, నన్నపనేని గిరిబాబు, జి.సత్యనారాయణ రెడ్డి, గడప కోటేశ్‌కుమార్, మనోహర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ కమిటీ నియామకం



నియామక పత్రం అందుకుంటున్న భాగ్యలక్ష్మి

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా తణుకు సాయికృష్ణ, మహిళా సంఘం అధ్యక్షురాలిగా రావికంటి భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు నగునూరి రాజేందర్ వారికి శనివారం నియామక పత్రాలను అందజేశారు. పేద ఆర్యవైశ్యులకు సహాయ సహకారాలు అందిస్తూ, ఆర్యవైశ్యుల ఐక్యత, అభివృద్ధి, సంఘం పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, జిల్లా మాజీ అధ్యక్షుడు ఏవీ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివనాథుని శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తౌడుపునూరి కరుణాకర్, వాసవి సేవాదళ్ అధ్యక్షుడు రాచమల్ల ఆంజనేయులు, సేవా కేంద్రం డైరెక్టర్ కొమురవెల్లి వెంకటేశం, తౌడుకునూరి హరిప్రసాద్, కైలాస నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు స్పందన



మానకొండూర్: అన్నారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని క్రీడామైదానంలో శనివారం అండర్–14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. సమారు 300 మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభను కనబర్చారు. క్రికెట్ పోటీల సెలక్షన్‌ను గ్రామ సర్పంచ్ బొట్ల కిషన్ ప్రారంభించారు. సర్పంచ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. క్రీడా పోటీలకు ఎల్లప్పుడూ సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అంతడ్పుల శ్రీనివాస్, పీఈటీలు బండి రమ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



సంస్థ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రిటైర్డ్ ఆర్టీవో, ఫౌండేషన్ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ నీలం సంపత్ మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు ఫోన్ ఉపయోగించవద్దన్నారు. యువకులు అతివేగంగా వాహనాలు నడిపి, ప్రమాదాలకు గురికావొద్దని సూచించారు. రహదారి నిబంధనలు, భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వారిని ప్రిన్సిపాల్ డి.శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, లెక్చరర్లు, లైబ్రేరియన్ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద పిల్లలకు స్వెట్టర్ల పంపిణీ



స్వెట్టర్లు అందిస్తున్న నాగరాజు, వేణుగోపాల్

విద్యానగర్: భరోసా స్వచ్ఛంద సేవా సంస్థవారు కరీంనగర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద పూరి గుడిసెల్లో ఉన్న పేద పిల్లలకు శనివారం స్వెట్టర్లు పంపిణీ చేశారు. చలి తీవ్రత పెరుగుతుండటంతో వీటిని అందించామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, సభ్యులు మల్యాల వేణుగోపాల్, సిరిపురం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన కేడర్‌కు, పవన్‌కు వార్

- జనసేన వెంట టీడీపీ ఉందని ప్రజలను నమ్మించాలి
- మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య



పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుతం జనసేన కేడర్‌కు, పవన్‌కళ్యాణ్‌కు మధ్య వార్ జరుగుతోందని మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'పవన్ ఓట్లు కావాలంటారు.. జనసేన నాయకులు అధికారం కావాలంటారు. ఏది ముందు ఏది వెనుక అని విశ్లేషిస్తే జేజేలు, చప్పట్లు కాదు కావాల్సింది ఓట్లు అని పవన్‌కళ్యాణ్ అంటున్నారు.. ఓట్లు సరే అధికారం సంగతేంటి అని జనసైనికులు ప్రశ్నిస్తున్నారు. ఓట్లు వేసి జనసేనను గెలిపిస్తే అధికారం అదే వస్తుందని పవన్ అంటుంటే.. అధికారం వస్తుందని నమ్మిస్తే ఓట్లు అవే వస్తాయని జనసేన నేతలు అంటున్నారు. తాను కోరుకుంటున్నది అధికారం కాదని, రాష్ట్ర శ్రేయస్సు, ప్రజాశ్రేయస్సు అని పవన్ అంటుంటే.. అధికారం చేజిక్కకుండా ప్రజా శ్రేయస్సు ఎలా సాధిస్తారని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు..'అని పేర్కొన్నారు. ప్రస్తుతం జనసేన కేడర్, పవన్‌కు మధ్య జరుగుతున్న వార్ ఇదని తెలిపారు. తెలంగాణలో రాజ్యాధికారం చేపట్టడంలో ఆఖరి వరుసలో ఉందని సర్వేలు చెబుతున్నా తన సత్తా చూపించాలనే ఆతృతతో బీజేపీతో కలిసి పవన్ ఎన్నికల రంగంలోకి దిగడం సాహసోపేతమని పేర్కొన్నారు. తెలంగాణలో రాజ్యాధికారం చేపట్టలేదని తెలిసీ ఓటర్లు తమ ఓట్లను జనసేన–బీజేపీ కూటమికి వేసి ఎందుకు చేతులు కాల్చుకుంటారని ప్రశ్నించారు. ఏపీలో పరిస్థితి మాత్రం వేరని తెలిపారు. పవన్ 60 శాసనసభ సీట్లకు తక్కువ కాకుండా పోటీచేయవచ్చని పేర్కొన్నారు. అధికారం దక్కించుకోవడం పవన్ వంతు అయితే.. జనసేన–టీడీపీ కూటమికి ఓట్లు వేసి నెగ్గించుకోవడం తమ వంతు అని జనసేన కేడర్ దృఢ సంకల్పంతో ఉందని తెలిపారు. జనసేన టీడీపీని కలుపుకొని వైఎస్సార్‌సీపీని ఓడించి రాజ్యాధికారం దక్కించుకోవడానికి, ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి దగ్గరలో ఉందని తెలిపారు. టీడీపీ వెనుక జనసేన అని కాకుండా.. జనసేన వెంట టీడీపీ ఉందని చెప్పి మూడునెలల్లో అధికారంలోకి రావడం తథ్యమని ప్రజలను నమ్మించగలగాలని ఆయన పేర్కొన్నారు.


ప్రకాశ్‌రెడ్డి


సుదర్శన్‌రెడ్డి


గిరిధర్‌రావు


నిరూప్‌రెడ్డి


అశోక్‌గౌడ్


మహేందర్‌రెడ్డి

ఏజీ.. ఎవరు!?

'అడ్వొకేట్ జనరల్'కు ప్రభుత్వ పరిశీలనలో పలువురి పేర్లు

- 'న్యాయ'పరంగా సర్కార్‌కు అత్యంత కీలకమైన పోస్టు
- సమర్థత, నమ్మకానికే ప్రాధాన్యం
- నిరూప్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గిరిధర్‌రావు, మహేందర్‌రెడ్డి, అశోక్‌గౌడ్‌లలో ఒకరికి అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కీలక పోస్టులు ఎవరికి దక్కుతాయన్న లెక్కలు వేసుకోవడం షురూ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో కీలక బాధ్యత పోషించే అడ్వొకేట్ జనరల్ ఎవరవుతారన్న దానిపై తీవ్ర చర్చ సాగుతోంది. ప్రస్తుత అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ రాజీనామా సమర్పించేందుకు సిద్ధం కావడంతో తర్వాతి ఏజీ ఎవరనేది చర్చాంశనీయంగా మారింది. ఒకసారి ఏజీ రాజీనామా ఆమోదం పొందితే.. జీపీలు, ఏజీపీల నియామకాలన్నీ రద్దవుతాయి. తిరిగి కొత్త వారిని నియమించాల్సి ఉంటుంది. స్పెషల్ జీపీలు, జీపీలు, ఏజీపీల మాట ఎలా ఉన్నా.. ఏజీ, ఏఏజీ ఎవరవుతారనేది న్యాయ



వర్గాల్లో చర్చకు తెరలేపింది.

సామాజిక సమీకరణాల కంటే సమర్థతకే మొగ్గు!

'న్యాయ'పరంగా సర్కార్‌కు అత్యంత కీలకమైన పోస్టు ఏజీ కావడంతో నియామకంలో సామాజిక సమీకరణల కంటే సమర్థతకే అవకాశం ఎక్కువ. ప్రభుత్వానికి సంబంధించిన ఎన్నో కీలక కేసులు, అనుకూల కేసుల్లో వాదనలు వినిపించే నేపథ్యంలో నమ్మకంతో పాటు ఇతర అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. న్యాయవాదుల చట్టం 1961 సెక్షన్ 16(2), రాజ్యాంగంలోని అధికరణం 165 కింద అడ్వొకేట్ జనరల్ నియామకం జరుగుతుంది.

తెలంగాణ హైకోర్టు ఏజీలు వరుసగా...

- కె.రామకృష్ణారెడ్డి (2014 నుంచి 2017 వరకు)
- దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి (2017 నుంచి 2018 వరకు)
- బీఎస్ ప్రసాద్ (2018 నుంచి 2023 వరకు)

ఏజీకి ఏయే అధికారాలంటే..

- రాష్ట్రంలోని ఏ కోర్టుకైనా హాజరయ్యేందుకు ఏజీకి పూర్తి అధికారం ఉంటుంది.
- చట్టపరమైన విషయాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇస్తుంటారు.
- ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాదులు (స్పెషల్ జీపీ), జీపీ, ఏజీపీల నియామకాన్ని చేపడతారు.
- రాష్ట్ర ప్రభుత్వ విశ్వాసం ఉన్నంత వరకు (తొలగించే వరకు) ఏజీ ఆ పోస్టులో కొనసాగుతారు.

ప్రభుత్వ పరిశీలనలో ఉన్న పేర్లు...

పి. నిరూప్ రెడ్డి

సుప్రీంకోర్టులో మూడు దశాబ్దాలుగా న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు. సీనియర్ న్యాయవాదిగా సుప్రీంకోర్టులో అర్హత పొందిన తొలి తెలంగాణ వ్యక్తి. 1986లో న్యాయవాద వృత్తిలోకి వచ్చారు. తెలంగాణ ఉద్యమంలో ఢిల్లీ వేదికగా విశేష కృషి చేశారు. మేఘాలయ అదనపు అడ్వొకేట్ జనరల్‌గా, గోవా రాష్ట్ర సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఈయనకు కాంగ్రెస్ పార్టీలోని ఢిల్లీ పెద్దలతో కూడా సన్నిహిత సంబంధాలున్నట్లు సమాచారం.

దేశాయి ప్రకాశ్‌రెడ్డి

గతంలోనూ ఉమ్మడి ఏపీ హైకోర్టులో ఏఏజీగా, తెలంగాణ వచ్చిన తర్వాత హైకోర్టులో ఏజీగా పనిచేశారు. 1977లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2000 సంవత్సరంలో సీనియర్ న్యాయవాదిగా పదోన్నతి పొందారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు.

గిరిధర్‌రావు

గ్రూప్–1, గ్రూప్–2 వంటి కీలక కేసుల్లో వాదనలు వినిపించి.. విజయం సాధించారు. గ్రూప్–1 పేపర్ లీకేజీ కేసును సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని వేసిన పిటిషన్‌లో వాదనలు వినిపించారు. 38 ఏళ్లు న్యాయవాదవృత్తిలో ఉన్నారు. 2021లో సీనియర్‌గా ప్రమోషన్ పొందారు. బార్ కౌన్సిల్, బార్ అసోసియేషన్లకు ఎన్నికై సేవలందించారు.

పొన్నం అశోక్‌గౌడ్.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా, రెండుసార్లు హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. గతంలో ప్రభుత్వ న్యాయవాదిగా కూడా విధులు నిర్వహించారు.

ఇంకా..

కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో తెలంగాణ నుంచి తొలిసారి ఏజీగా బాధ్యతలు నిర్వహించిన (మాజీ ఏజీ) ఎ.సుదర్శన్ రెడ్డి, రేసు మహేందర్‌రెడ్డి లాంటి సీనియర్ల పేర్లు కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు హైకోర్టు న్యాయవాద వర్గాలు పేర్కొంటున్నాయి.

కోటిన్నర కుటుంబాలకు అభయం..

ఆరోగ్యశ్రీ చికిత్సకు రూ.25 లక్షలు

- ఏపీలో ప్రజారోగ్యానికి సంపూర్ణ భరోసానిస్తూ సీఎం జగన్ అడుగులు
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో రూ.లక్షలు ఖరీదైన వైద్యం పూర్తి ఉచితం



సాక్షి, అమరావతి: ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి ఊపిరిలూది పునర్జన్మ ప్రసాదించిన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించాలని నిర్ణయించారు. తద్వారా గుండె, కిడ్నీ, న్యూరో లాంటి ఎంత పెద్ద జబ్బులకైనా చేతి నుంచి చిల్లి గవ్వ ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్యం అందనుంది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లను 1,059 నుంచి ఏకంగా మూడు రెట్లకుపైగా పెంచి 3,257కి చేర్చిన సీఎం జగన్ ఇక క్యాన్సర్ లాంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు సైతం పరిమితి లేకుండా వ్యయాన్ని భరించేందుకు సిద్ధమయ్యారు. ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలు అత్యంత సులభంగా పొందేలా ఆధునిక ఫీచర్లతో కొత్తగా కార్డులను రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18వతేదీన నూతన మార్గదర్శకాలు జారీ చేయనుంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

దేశ ఆరోగ్య రంగంలో తొలిసారిగా...

ఇటీవల జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పలు పార్టీలు ఆరోగ్యశ్రీ తరహాలో ఉచిత వైద్యం అందిస్తామని హామీలిచ్చాయి. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ రూ.10 లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇవ్వగా బీఆర్ఎస్ రూ.15 లక్షల వరకూ ఉచిత వైద్యం సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో కూడా రాజకీయ పార్టీలు ఇలాంటి హామీలనే ఇచ్చాయి. అయితే దేశంలో ఎక్కడాలేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యానికి ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం భరోసా నివ్వడం గమనార్హం. గతంలో క్యాన్సర్ చికిత్సకు ఆరోగ్యశ్రీ కింద ఇచ్చే డబ్బులపై రూ.5 లక్షల వరకు పరిమితి ఉంది. ఆ తర్వాత ఎంత ఖర్చు అయినా రోగులే భరించాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ పరిమితిని ఎత్తివేయడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి పూర్తి భరోసా నిస్తున్నారు.

బల్క్‌డ్రగ్ పార్కు మార్పునకు కేంద్రం ఆమోదం

- కాకినాడ నుంచి నక్కపల్లికి మార్పు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2 వేల ఎకరాల్లో అభివృద్ధి... ప్రభుత్వ భూమిలోనే ఏర్పాటు చేయాలన్న కేంద్రం

సాక్షి, అమరావతి: బల్క్ డ్రగ్ పార్కును కాకినాడ నుంచి అనకాపల్లి జిల్లా నక్కపల్లికి మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పార్కును కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త భాగస్వామ్యంతో 2 వేల ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ రూ.2,190 కోట్లతో ఫార్మాస్యూటికల్ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ఇందు కోసం రూ.1,000 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. భూమిని రాష్ట్ర ప్రభుత్వం భూమిని సమకూరుస్తోంది. అయితే, ప్రభుత్వ భూమి మాత్రమే ఉండాలని కేంద్రం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. దీంతో కాకినాడ నుంచి నక్కపల్లి ప్రాంతానికి ఈ పార్కును మార్చారు. నక్కపల్లి వద్ద ఏపీఐఐసీ భూమి అందుబాటులో ఉండటం, అక్కడ ఇప్పటికే ఫార్మా రంగానికి చెందిన పలు పరిశ్రమలు ఉండటంతో రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, త్వరలోనే టెండర్లను న్యాయ పరిశీలనకు (జ్యుడిషియల్ ప్రివ్యూకు) పంపుతామని ఏపీఐఐసీ వీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. న్యాయపరిశీలన అనంతరం ఆమోదం రాగానే టెండర్లు పిలుస్తామని చెప్పారు. చైనా నుంచి ఫార్మా దిగుమతులను అరికట్టాలన్న ఉద్దేశంతో దేశంలో మూడు బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. తెలంగాణ వంటి 16 రాష్ట్రాలతో పోటీ పడి రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును దక్కించుకుంది. పూర్తిగా పర్యావరణహితమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పార్కును అభివృద్ధి చేస్తారు. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఫార్మా హబ్‌గా తయారవుతుందని, రూ.14,340 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షిస్తుందని అంచనా. ఇక్కడ 30,000 మందికి ప్రత్యక్షంగా, 40,000 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 200కు పైగా ఫార్మా యూనిట్లు ఉన్నాయి. బల్క్ డ్రగ్ పార్కు ద్వారా అదనంగా 100కు పైగా యూనిట్లు వస్తాయని బల్క్ డ్రగ్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అంచనా వేస్తున్నారు.

సింగరేణిలో ఒంటరి పోరే..!

- సిద్ధమైన కార్మిక సంఘాలు
- గత ఎన్నికల్లో ఏఐటీయూసీకి ఐఎన్టీయూసీ మద్దతు
- ఈసారి ప్రత్యర్థులుగానే బరిలోకి..
- ప్రచారానికి రావొద్దని సీఎంకు హెచ్ఎమ్మెస్ లేఖ
- అందరి ప్రధాన ప్రత్యర్థి టీబీజీకేఎస్

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మిక సంఘాలన్నీ ఎలాంటి పొత్తుల్లేకుండానే ఒంటరి పోరుకు సిద్ధమయ్యాయి. నిన్న మొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పని చేసిన కార్మిక సంఘాలు ఈ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా బరిలో నిలిచాయి. ఈ నెల 27న జరిగే 7వ దఫా గుర్తింపు సంఘం ఎన్నికలు ఎప్పుడూ లేనంతగా కొత్త రూపు సంతరించుకున్నాయి. ఇప్పటివరకు జరిగిన ఆరు ఎన్నికలు భిన్నంగా మారాయి. గుర్తింపు సంఘం ఎన్నికలను కార్మిక సంఘాలు ప్రతిష్టాత్మకంగా తీసుకొనేవి. ఈసారి సంఘాల కంటే కూడా మాతృపార్టీలకే చాలా ప్రతిష్టాత్మకంగా మారాయి. అన్ని సంఘాలు కూడా ప్రస్తుత గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌ను ప్రధాన ప్రత్యర్థిగా చేసుకుని ముందుకెళ్తున్నాయి. దీంతోపాటు సమీప ప్రత్యర్థి ప్రతిపక్ష సంఘాల నేతలపై కూడా విరుచుకుపడుతూ ప్రచారం చేస్తున్నారు.

హ్యాట్రిక్ కొట్టాలి..

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ తప్పినా.. సింగరేణిలోనైనా హ్యాట్రిక్ కొట్టాలని టీబీజీకేఎస్ ఉవ్విళ్లూరుతోంది. పార్టీ ఓటమితో కొంత నైరాశ్యంలో ఉన్న కూడా ఇటీవల ఆ సంఘం గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో భేటీ అనంతరం యూనియన్ నాయకత్వం ఉత్తేజపూరితంగా ప్రచారానికి శ్రీకారం చుట్టింది. శ్రీరాంపూర్‌లో యూనియన్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఆర్కే న్యూటెక్ గనిలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తమకంటే ముందు గెలిచిన సంఘాలు పోగొట్టిన హక్కులను తమ రెండు పర్యాయాల హయాంలో తిరిగి సాధించామని, ప్రధానంగా కారుణ్య ఉద్యోగాలు ఇప్పించామని, కార్మికులు తమ వైపే ఉంటారనే నమ్మకం నేతల్లో కనిపిస్తోంది.

గత ఎన్నికల్లో ఏఐటీయూసీతో కలిసిన ఐఎన్టీయూసీ

గత 2017 గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీకి ఐఎన్టీయూసీ మద్దతు ఇచ్చింది. ఐఎన్టీయూసీ పోటీలో లేకుండా రెండోసారి టీబీజీకేఎస్ గెలువకూడదనే ఉద్దేశంతో మద్దతుగా నిలిచింది. అయినా టీబీజీకేఎస్‌నే గెలిచింది. ఈసారి కూడా మద్దతివ్వాలని ఏఐటీయూసీ నేతలు ఐఎన్టీయూసీని కోరారు.



పీఎస్సాఆర్‌కు మద్దతుగా ఆర్కే 7గనిపై ప్రచారంలో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు(ఫైల్)

గెలిపించాం.. ప్రచారానికైతే రావద్దు..

మొన్నటి ఎన్నికల్లో రాజకీయాలకు అతీతంగా బీఆర్ఎస్ ఓటమే లక్ష్యంగా తామంతా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి గెలిపించామని హెచ్ఎమ్మెస్ నేతలు పేర్కొంటున్నారు. ఈ సింగరేణి ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులెవ్వరూ ఐఎన్టీయూసీ మద్దతుగా సింగరేణి గనులపై ప్రచారానికి రావొద్దంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. హెచ్ఎమ్మెస్ సింగరేణి ప్రతీ ఎన్నికల్లో ఒంటరి పోరులో నిలిచింది.

దీనికి వారు ససేమిరా అన్నారని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ.సీతారామయ్య తెలిపారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి గెలిపించామని, పార్టీ పరంగా కాంగ్రెస్ రాష్ట్రంలో బలంగా ఉండడంతో తమ పార్టీ సీపీఐకి ఒక్క సీటు తీసుకొని కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని, ఆ పొత్తు ధర్మంలో భాగంగా సింగరేణిలో బలంగా ఉన్న తమ యూనియన్‌కే ఐఎన్టీయూసీ భేషరతుగా మద్దతు ఇవ్వాల్సి ఉండగా దీనికి దూరంగా ఉండడం దురదృష్టకరమని అన్నారు. కాగా, ఇటీవల ఈ రెండు సంఘాల నేతలు కలిసి గనులపై కాంగ్రెస్ అభ్యర్థుల కోసం ప్రచారం చేశారు. ఇప్పుడు గనులపై తిరిగి ఇద్దరు ఒకరిపై నొకరు విమర్శలు చేసుకోవడం చూసి కార్మికులు.. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరనే దానికి కూడా సింగరేణి కూడా వేదికైందని ముక్కున వేలేసుకుంటున్నారు.

మిగిలిన సంఘాలు కూడా

ఇక మిగిలిన బీఎంఎస్, సీఐటీయూలు కూడా ఒంటరి పోరులోనే నిలిచాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మొత్తం 13 కార్మిక సంఘాలు ఎన్నికల బరిలో నిలిచాయి. కొద్ది ఓటు బ్యాంకుకే పరిమితమైన ఈ సంఘాలు తమ ఎన్నికల గుర్తింపు కోసం పోరులో నిలువడం వారికి తప్పనిసరైంది. ఏదేమైనా డిసెంబర్ 27న కార్మికులు ఏ సంఘానికి పట్టం కడుతారో వేచి చూడాల్సిందే.

రెండు సార్లు ఏఐటీయూసీ, టీఎన్టీయూసీ కలిసే..

ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు జత కట్టిన కూడా సింగరేణి ఎన్నికలకు వచ్చే సరికి అందుకు భిన్నంగానే పొత్తులు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. అక్కడ స్నేహగీతం, ఇక్కడ పోరుగీతమే వినిపించే వారు. 2007, 2012లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీకి టీడీపీ అనుబంధ కార్మిక సంఘం టీఎన్టీయూసీ మద్దతిచ్చింది. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కలిసి టీడీపీ లక్ష్యంగా పోటీ చేసినా కాంగ్రెస్ అధికారం దక్కించుకోవడం జరిగింది. ఆ తరువాత 2012 ఎన్నికల్లో ప్రత్యర్థి సంఘమైన ఐఎన్టీయూసీ ఓటమే లక్ష్యంగా ఏఐటీయూసీ టీఎన్టీయూసీ మద్దతు తీసుకుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్, సీపీఐ పొత్తు నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాలు గనులపై కలిసి ప్రచారం చేశారు. ఇప్పుడు సింగరేణి ఎన్నికల్లో వారే ప్రత్యర్థులుగా మారారు. యూనియన్ అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం వైరి వర్గంగానే ఉండాలనేది ఆ సంఘాల ముఖ్యోద్దేశం.

అధికార పక్షం ఎటువైపు?

- సింగరేణిలో అనుబంధ ఐఎన్‌టీయూసీ పటిష్టం
- మద్దతు పలికిన ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్
- కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయంపై ఆసక్తి



గోదావరిఖని: సింగరేణి గుర్తింపు కార్మిమక సంఘం ఎన్నికలు ప్రధాన పార్టీలు, వాటి అనుబంధ యూనియన్లకు ప్రతిష్టాత్మకంగా మారుతున్నాయి. ఈనెల 27న సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు వేగవంతం చేశారు. ఈమేరకు పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల జాబితా కూడా విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కొంగుబంగారంగా నిలిచిన గోదావరి పరీవాహక ప్రాంతం వెంట ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి బొగ్గు గనుల భవిష్యత్‌కు ఈఎన్నికలు కీలకం కానున్నాయి. బొగ్గుబ్లాకుల ప్రైవేటీకరణలో సంస్థకు చెందిన నాలుగు బొగ్గుబ్లాకులను కేంద్రప్రభుత్వం బహిరంగ వేలానికి పెట్టింది. ఇప్పటి వరకు ఒక బొగ్గు బ్లాక్‌ను ఓ సంస్థ వేలం ద్వారా దక్కించుకున్నప్పటికీ.. ఇంకా ఆ సంస్థకు కేటాయించలేదు. బొగ్గు బ్లాకులు ప్రైవేట్‌పరం చేస్తే సింగరేణి భవిష్యత్ అంధకారంలో పెడ్డట్లే. ఇప్పటికే సంస్థలో రోజురోజుకూ భూగర్భ గనుల సంఖ్య తగ్గిపోవడం, కార్మికుల సంఖ్య 39వేలకు తగ్గిపోవడంతో కోల్ బెల్ట్ ప్రాంత కార్మికుల్లో ఆందోళన పెరుగుతోంది. ఈక్రమంలో సింగరేణి ఎన్నికలు జరుగుతున్నాయి. అన్నిజాతీయ సంఘాలకు ప్రధాన పార్టీలు ఉండగా, ఈసారి అధికార పక్షం మద్దతు కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఈక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

మాతృ పార్టీలు.. అనుబంధ యూనియన్లు..

- అధికార కాంగ్రెస్ పార్టీకి అనుంబంధంగా ఐఎన్‌టీయూసీ ఉంది.
- బీఆర్ఎస్‌కు అనుబంధంగా టీబీజీకేఎస్ ఉంది.
- సీపీఐకి పార్టీ అనుబంధంగా ఏఐటీయూసీ పనిచేస్తోంది.
- సీపీఐ(ఎం)కు అనుబంధ సంఘంగా సీఐటీయూ ప్రచారం నిర్వహిస్తోంది.
- బీజేపీకి అనుబంధంగా బీఎంఎస్ కొనసాగుతోంది.
- హెచ్ఎంఎస్ సంస్థలో పనిచేస్తున్నప్పటికీ మాతృ పార్టీలేదు.
- విప్లవ కార్మిక సంఘాలు ఉన్నా పెద్దగా పోటీ ఇచ్చే పరిస్థితి లేదని భావిస్తున్నారు.
- ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దాని అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీతోపాటు ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్‌లు మద్దతు ప్రకటించాయి.
- అధికార కాంగ్రెస్ పార్టీ ఈసారి గుర్తింపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందని కార్మికులు ఎదురుచూస్తున్నారు.
- కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దానికి అనుబంధంగాఉన్న ఐఎన్‌టీయూసీలో చేరికలు పెరిగాయి.
- తాము అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతు ప్రకటించిన క్రమంలో కాంగ్రెస్ పార్టీ సింగరేణిలో ఏ యూనియన్‌కు మద్దతు ఇవ్వొద్దని హెచ్ఎంఎస్ ఇప్పటికే కోరింది.
- అయితే రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి సింగరేణి పారిశ్రామిక ప్రాంతం కూడా కీలకమే.
- ఇటీవల జరిగిన ఎన్నికల్లో కోల్‌బెల్ట్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కువ సంఖ్యలో గెలిచారు.
- ఈక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కోల్‌బెల్ట్‌ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకునే నిర్ణయం కీలకంగా మారనుంది.

క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలి

- గురుకులాల జాయింట్‌సెక్రటరీ అనంతలక్ష్మి

ధర్మారం(ధర్మపురి): ప్రతీ విద్యార్థి చదువుతోపాటు క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రటరి అనంతలక్ష్మి సూచించారు. నందిమేడారం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో 9వ రాష్ట్రస్థాయి బాలికల క్రీడాపోటీలను శనివారం ఆమె ప్రారంభించారు. రాష్ట్రంలోని 7జోన్‌ల నుంచి 94 గురుకుల విద్యాలయాలకు చెందిన 975 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. అనంతలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కబడ్డీ, హ్యాండ్‌బాల్, బాల్ బాడ్మింటన్, చదరంగం తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడలపై ఆసక్తి చూపిప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సర్పంచ్ సామంతుల జానకి, ప్రిన్సిపాల్ శైలజ, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న అనంతలక్ష్మి

మహిళల భద్రత సమాజం బాధ్యత

- లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన
- జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు

రామగిరి(మంథని): మహిళల భద్రత సమాజంలోని ప్రతీఒక్కరి బాధ్యత అని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు అన్నారు. పని ప్రదేశాల్లోని మహిళలపై లైంగిక వేధింపుల చట్టం గురించి అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో సమీక్షించారు. కార్యాలయాలు, పనిప్రదేశాల్లో లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి చట్టం అమలులోకి వచ్చిందన్నారు. దీనిద్వారా లైంగిక వేధింపుల నివారణ, ఫిర్యాదుల స్వీకరణ, బాధితులకు న్యాయం చేయడం లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌వోటూ జీఎం రఘుపతి, నోడల్ అధికారి రవీందర్‌రెడ్డి, ప్రిసైడింగ్ అధికారి ఆర్.రాజేశ్వరి, సభ్యులు కంది రమ్య, ఆర్.శ్వేత, డీవైపీఎంలు సునీల్‌ప్రసాద్, హరీశ్, సీనియర్ పర్సనల్ అధికారులు పి.రాజేశం, మతీన్ హుస్సేన్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న అధికారులు

ప్రాణం తీసిన విద్యుత్ కంచె



పెద్ద లస్మయ్య (ఫైల్)

నర్సాపూర్(జి): పంట పొలం రక్షణకు అమర్చిన విద్యుత్ కంచె ఆ రైతు పాలిట యమపాశమైంది. పోలీసుల వివరాల ప్రకారం... నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన కాపెల్లి పెద్ద లస్మయ్య(60) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన కున్న రెండెకరాల్లో వేసిన పంటల రక్షణకు అమర్చిన విద్యుత్ కంచెకు అమర్చిన తీగలు కాలికి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య రుక్మాబాయి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ పేర్కొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా ఆదిలాబాద్

ఆదిలాబాద్: హన్మకొండ జిల్లా కేంద్రంలోని జేఎన్ స్టేడియంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ అండర్–14 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. శనివారం 200 మీటర్ల పరుగు పందెంలో కె.నగేశ్ గోల్డ్ మెడల్, వై.లింగ్ సిల్వర్ మెడల్ సాధించినట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు పేర్కొన్నారు. అలాగే హైజంప్‌లో శ్రీకాంత్ (రజత), శివచరణ్ (కాంస్య) పతకాలు సాధించినట్లు తెలిపారు. వీరిని క్రీడా సంఘాల బాధ్యులు, అధికారులు అభినందించారు.

కొలువుదీరిన మూడో శాసనసభ

ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించిన ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ శనివారం కొలువుదీరింది. ఉదయం 11.00 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత సీఎం రేవంత్ రెడ్డి.. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు ప్రమాణం చేశారు. అనంతరం మహిళా ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేసిన తరువాత అక్షర క్రమంలో సభలోని సభ్యులతో ప్రమాణం చేయించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 61 మంది, బీఆర్ఎస్ నుంచి 32 మంది, ఎంఐఎం నుంచి ఆరుగురు, సీపీఐ నుంచి గెలిచిన ఒక్కరు ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీని నియమించడాన్ని నిరసిస్తూ బీజేపీకి చెందిన 8 మంది సభ్యులు సభకు హాజరు కాలేదు. కాలు జారి పడిన కారణంగా శస్త్ర చికిత్స చేయించుకొన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయనకు సహాయకారిగా ఉన్న మాజీ మంత్రి కె. తారక రామారావు సహా ఏడుగురు బీఆర్ఎస్ సభ్యులు, వ్యక్తిగత కారణాలతో ముగ్గురు కాంగ్రెస్ సభ్యులు ప్రమాణస్వీకార కార్యక్రమానికి గైర్హాజరయ్యారు.

ప్రమాణం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీరే..

రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, సీతక్క, దామోదర రాజ నర్సింహ, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, చిట్టెం పర్ణికా రెడ్డి, మట్టా రాగమయి, పద్మావతి రెడ్డి, యశస్విని రెడ్డి, ఆది శ్రీనివాస్, ఆదినారాయణ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అనిరుధ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, బాలు నాయక్ నేనావత్, చిక్కుడు వంశీకృష్ణ, చింతకుంట విజయ రమణారావు, దొంతి మాధవరెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణ రావు, జి. మధుసూదన్‌రెడ్డి, బీర్ల ఐలయ్య, రామ్‌చందర్ నాయక్, కేఆర్ నాగరాజు, కే శంకరయ్య, కసిరెడ్డి నారాయణరెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కోరం కనకయ్య, కె.రాజేశ్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, కె. మదన్ మోహన్ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మల్ రెడ్డి రంగారెడ్డి, మందుల సామ్యేల్, మేడిపల్లి సత్యం, తుడి మేఘారెడ్డి, మురళీ నాయక్ భుక్యా, మైనంపల్లి రోహిత్, నాయిని రాజేందర్‌రెడ్డి, పి. సుదర్శన్‌రెడ్డి, పటోళ్ల సంజీవ్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్ మాలోత్, రేవూరి ప్రకాశ్ రెడ్డి, రేకులపల్లి భూపతి రెడ్డి, టి. రామ్మోహన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, వెడ్మ బొజ్జు, వేముల వీరేశం, గడ్డం వివేక్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి.

అక్బరుద్దీన్ సహా ప్రమాణం చేసిన 101 మంది ఎమ్మెల్యేలు

కేసీఆర్ సహా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకాని 18 మంది సభ్యులు

బీఆర్ఎస్ నుంచి 32 మంది

కోవా లక్ష్మి, లాస్య నందిత, పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, అనిల్ జాదవ్, అరికెపూడి గాంధీ, బండారి లక్ష్మారెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, చింతా ప్రభాకర్, దానం నాగేందర్, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, గంగుల కమలాకర్, గూడెం మహిపాల్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, కేపీ వివేకానంద, కాలే యాదయ్య, కాలేరు వెంకటేశ్, కల్వకుంట్ల సంజయ్, మాణిక్ రావు, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ముఠా గోపాల్, వేముల ప్రశాంత్ రెడ్డి, డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, టి. ప్రకాశ్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, తెల్లం వెంకట్రావ్, హరీశ్‌రావు, విజయుడు.

ఎంఐఎం నుంచి అందరూ

ఎంఐఎం నుంచి అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, జాఫర్ హుస్సేన్, కౌసర్ మొయినుద్దీన్, జుల్ఫీకర్ అలీ, మహ్మద్ మాజీద్ హుస్సేన్, మహ్మద్ మోబిన్ ప్రమాణం చేయగా, ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించిన అక్బరుద్దీన్ ఒవైసీ అంతకు ముందే గవర్నర్ సమక్షంలో ప్రమాణం చేశారు. సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు.

గైర్హాజరైన సభ్యులు ఎవరంటే

కాంగ్రెస్ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నుంచి కేసీఆర్, కేటీఆర్, కడియం శ్రీహరి, కొత్త ప్రభాకర్ రెడ్డి, పద్మారావు గౌడ్, పాడి కౌశిక్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ నుంచి రాజాసింగ్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, హరీష్‌బాబు, కె. వెంకట రమణా రెడ్డి, పాయల్ శంకర్, రామారావు పవార్, పైడి రాకేష్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా గైర్హాజరయ్యారు.



గవర్నర్ తమిళిసైకి పుష్పగుచ్ఛం అందిస్తున్న అక్బరుద్దీన్. చిత్రంలో పోచారం, సీఎం రేవంత్‌రెడ్డి

ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీ

సాక్షి, హైదరాబాద్ తెలంగాణ శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ శనివారం ప్రమాణం చేశారు. శనివారం ఉదయం 8.30కు రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. జాతీయ గీతాలాపన అనంతరం అసెంబ్లీలో సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న అక్బరుద్దీన్ ఒవైసీతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్కతో పాటు బీఆర్ఎస్ పక్షాన మాజీమంత్రి టి.హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రొటెమ్ స్పీకర్‌గా ఎన్నికైన అక్బరుద్దీన్ ఒవైసీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు తెలంగాణ మూడో శాసనసభ తొలి విడత సమావేశం ప్రారంభమైంది. ప్రొటెం స్పీకర్‌గా ఎన్నికైన అక్బరుద్దీన్ శాసనసభకు ఎన్నికైన నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అసెంబ్లీకి ఎన్నికయ్యే నూతన స్పీకర్‌కు బాధ్యతలు అప్పగించిన తర్వాత ప్రొటెం స్పీకర్ బాధ్యత ముగుస్తుంది.

14న స్పీకర్ ఎన్నిక

- శాసనసభ సమావేశాలు మరో మూడు రోజులు.. 15న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం
- శనివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలతో ముగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మూడో శాసనసభ తొలి విడత సమావేశాలు ఈ నెల 14న ప్రారంభమై 16వ తేదీ వరకు కొనసాగే అవకాశముంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో స్పీకర్ ఎన్నిక, గవర్నర్ ప్రసంగం, గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు వంటి అంశాలు ఎజెండాలో ఉంటాయి. శనివారం నూతన శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం శాసనసభ సమావేశాలను ప్రొటెమ్ స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ వాయిదా వేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీ నూతన స్పీకర్ ఎన్నిక షెడ్యూలుకు సంబంధించిన బులెటిన్ ఈ నెల 11 లేదా 12న వెలువడే అవకాశముంది. ఈ బులెటిన్ షెడ్యూల్‌ను బట్టి నూతన స్పీకర్ పదవికి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన తదితరాలు ఉంటాయి. స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవమయ్యే పక్షంలో ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు సభ తిరిగి ప్రారంభమైన వెంటనే కొత్త స్పీకర్ పేరును ప్రొటెమ్ స్పీకర్ అక్బరుద్దీన్ ప్రకటిస్తారు. అనంతరం నూతన స్పీకర్‌ను సభాధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టి బాధ్యతలు అప్పగిస్తారు. నూతన స్పీకర్‌కు అధికార, విపక్ష సభ్యుల అభినందనల అనంతరం తిరిగి ఈ నెల 15వ తేదీకి వాయిదా పడుతుంది. 15న శాసనసభ, శాసన మండలి సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగించే అవకాశముంది. అనంతరం వాయిదా పడే శాసనసభ, మండలి శనివారం ఉదయం వేర్వేరుగా ప్రారంభమై ధన్యవాద తీర్మానంపై చర్చించి ఆమోదిస్తాయి. అయితే ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం ఉండేదీ లేనిదీ కొత్త స్పీకర్ ఎన్నిక తర్వాత స్పష్టత వచ్చే అవకాశముంది. నూతన స్పీకర్‌గా వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ పేరును కాంగ్రెస్ ఇప్పటికే ఖరారు చేసింది.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దూసుకెళ్తాం

- ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గతంకన్నా ఎక్కువ సీట్లు, ఓట్లు సాధించాం.. లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం
- నా పోటీపై పార్టీదే నిర్ణయం..
- మీడియాతో బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మీడియా భేటీలో ఈటల, రఘునందన్

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాకాంక్షల మేరకు రాష్ట్రంలో అధికార సాధన దిశగా బీజేపీ దూసుకుపోతుందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గతంలోని ఒక సీటుతో పోలిస్తే 8 సీట్లలో గెలవడంతోపాటు రెండింతల ఓట్ల శాతాన్ని సాధించిందని తెలిపారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, నేతలు డా. ఎస్.ప్రకాశ్‌రెడ్డి, టి. ఆచారి, మురళీయాదవ్, నరహరి వేణుగోపాల్‌రెడ్డిలతో కలసి ఈటల మీడియాతో మాట్లాడుతూ ఇతర పార్టీలు డబ్బు సంచులు పంచినా ప్రజలు తమకు ఇంత గొప్ప విజయాన్ని కట్టబెట్టారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 36 లక్షల ఓట్లు (15 శాతం ఓట్లు) సాధించేలా చేశారన్నారు. అందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఈటల పేర్కొన్నారు. ప్రజలు, కార్యకర్తలు అందించిన విశ్వాసం, నమ్మకంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 2019లో గెలిచిన సీట్ల కంటే రాష్ట్రంలో అధిక స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని చెప్పారు. అలాగే దేశ వ్యాప్తంగా బీజేపీ 400 సీట్లలో గెలిచి సత్తా చాటుతుందని ఈటల విశ్వాసం వ్యక్తంచేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం గురించి తనకేమీ తెలియదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. దీనిపై పార్టీ నాయకత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

కడియం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం: రఘునందన్

బీఆర్ఎస్ 39 సీట్లతోపాటు బీజేపీకి 8, ఎంఐఎంకు 7 సీట్లు కలిస్తే తమ బలం పెరిగి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ స్టేషన్ ఘనపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో టీడీపీలోని ఆయన పాత మిత్రుడైన కడియం శ్రీహరి కలవదలుచుకుంటే తమకేమీ అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు. ప్రజలిచ్చిన తీర్పుతో రాష్ట్రంలో బీజేపీ ప్రతిపక్ష పాత్ర పోషించనుందని, ఎంఐఎంతో అంటకాగే పార్టీలతో బీజేపీ ఎలాంటి సంబంధాలు పెట్టుకోదని ఆయన స్పష్టంచేశారు. బీజేపీకి ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని, ఈ ఎన్నికల్లో ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని ముందుకు సాగుతామన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులొద్దు...

బీజేపీ నేతలపై సోషల్ మీడియాలో పెడుతున్న అభ్యంతరకర పోస్టులను పార్టీ నాయకత్వం గమనిస్తోందని రఘునందన్‌రావు ఒక ప్రశ్నకు బదులిచ్చారు. వాటిపై సరైన సమయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తగిన నిర్ణయం తీసుకుంటారన్నారు. అప్పటివరకు అందరూ సంయమనం పాటించాలని, ఓటమి బాధతో సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టొద్దని విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. కార్యకర్తలు నిరుత్సాహానికి గురికావొద్దని, మళ్లీ పూర్తిస్థాయి శక్తితో పుంజుకుంటామన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేల అసెంబ్లీ బహిష్కరణ

తొలిరోజు ప్రమాణ స్వీకారానికి గైర్హాజరు

ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ నియామకంపై ధ్వజం

ప్రభుత్వం సభ సంప్రదాయాలను ఉల్లంఘించిందంటూ గవర్నర్‌కు ఫిర్యాదు

స్పీకర్ ఎన్నిక జరిగాక తమ ఎమ్మెల్యేలు ప్రమాణం చేస్తారన్న కిషన్‌రెడ్డి



కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీని రాష్ట్ర ప్రభుత్వం నియమించడాన్ని తప్పుబడుతూ అసెంబ్లీలో తొలిరోజు జరిగిన సభ్యుల ప్రమాణస్వీకారాన్ని బీజేపీ ఎమ్మెల్యేలు బహిష్కరించారు. ప్రొటెం స్పీకర్ ఎదుట తాము ప్రమాణం చేయబోమని స్పష్టంచేశారు. శనివారం అసెంబ్లీ గేటు ఎదుట రాజాసింగ్ మినహా మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. అరగంటపాటు రోడ్డుపైనే బైఠాయించి నినాదాలు చేశారు. వారి వద్దకు వచ్చిన అసెంబ్లీ చీఫ్ మార్షల్ సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కు తగ్గలేదు. అంతకుముందు ఈ అంశంపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ఫిర్యాదు చేసేందుకు రాజ్‌భవన్‌కు వారు వెళ్లగా ఆ సమయానికి గవర్నర్ అందుబాటులో లేరు. దీంతో గవర్నర్ కార్యదర్శి సురేంద్రమోహన్‌కు వినతిపత్రం ఇచ్చి వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం సభా విధానాలు, సంప్రదాయాలను ఉల్లంఘించి సీనియర్ సభ్యులను కాదని అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించడం ఎంతమాత్రం సరికాదని బీజేపీ ఎమ్మెల్యేలు వినతిపత్రంలో పేర్కొన్నారు. కొన్ని వర్గాల ప్రజలను ఆకర్షించేందుకే ప్రభుత్వం పనిగట్టుకొని ఈ నిర్ణయాన్ని తీసుకుందని.. దీన్ని బీజేపీ రాష్ట్రశాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలియజేశారు. ప్రొటెం స్పీకర్ నామినేషన్‌ను తిరస్కరించడంతోపాటు పూర్తిస్థాయి స్పీకర్ ఎన్నికకు సంబంధించిన ప్రక్రియను నిలిపేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని గవర్నర్‌ను కోరారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో ఎమ్మెల్యేలు టి.రాజాసింగ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, వెంకట రమణారెడ్డి, రామారావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణ, పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్‌బాబు, పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి సమావేశమయ్యారు. ప్రమాణ స్వీకారానికి వెళ్లాలా వద్దా అనే విషయమై అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా నడుచుకోవాలని ఎమ్మెల్యేలు నిర్ణయించారు. అంతకుముందు ఈ అంశంపై బీజేఎల్పీ సమావేశంలో వాడీవేడి చర్చ జరిగినట్లు తెలిసింది. పార్టీ అధిష్టానానికి చెప్పకుండానే ఎమ్మెల్యే రాజాసింగ్ ఏకపక్షంగా అసెంబ్లీని బహిష్కరిస్తామని సోషల్ మీడియా ద్వారా పేర్కొనడాన్ని నేతలు తప్పుబట్టినట్లు తెలియవచ్చింది. ఈ భేటీ అనంతరం కిషన్‌రెడ్డితో కలసి ఏడుగురు ఎమ్మెల్యేలు చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయంలో పూజలు నిర్వహించగా రాజాసింగ్ మాత్రం విడిగా బయటకు వెళ్లిపోయారు. ఆలయానికి కూడా ఆయన వెళ్లలేదు. ఆ తర్వాత ఢిల్లీలోని జాతీయ నాయకత్వాన్ని ఫోన్లో కిషన్‌రెడ్డి సంప్రదించగా ప్రమాణస్వీకారాన్ని బహిష్కరించాలని ఆదేశించడంతో అందుకు అనుగుణంగా ఎమ్మెల్యేలు వ్యవహరించారు. అయితే ఈ నిర్ణయాన్ని రాజాసింగ్‌కు తెలియజేసేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చిందని... అందుకే మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు రాజ్‌భవన్‌కు వెళ్లినప్పుడు, అసెంబ్లీ ఎదుట నిరసన తెలిపినప్పుడు ఆయన పాల్గొనలేదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు స్పీకర్ ఎన్నిక జరిగాక ఆయన ఎదుటే బీజేపీ ఎమ్మెల్యేలు ప్రమాణం చేస్తారని కిషన్‌రెడ్డి తెలిపారు.

పాడేరు, చింతపల్లిలో దట్టంగా పొగమంచు



సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): అల్లూరి జిల్లాలో పొగమంచు దట్టంగా కురుస్తోంటే... మరోవైపు చలిగాలులు వణికిస్తున్నాయి. తుపాను సమయంలో పెరిగిన ఉష్ణోగ్రతలు క్రమేణా తగ్గుముఖం పడుతున్నాయి. గడచిన రెండు రోజుల నుంచి మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం అరకు లోయ కేంద్ర కాఫీ బోర్డులో 12.6 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డులో 14 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 15.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాడేరుతో పాటు అరకులోయ, చింతపల్లి ప్రాంతాల్లో ఉదయం 9గంటల వరకు మంచుతెరలు వీడడం లేదు. శనివారం ఉదయం కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

సీఎం సహా చాలామంది దైవ సాక్షిగా ప్రమాణం

పవిత్ర హృదయం సాక్షిగా సీతక్క, కూనంనేని సహా కొందరు

- సభా నియామకాలకు కట్టుబడి... అంటూ పలువురు
- ఉర్దూలో ఎంఐఎం సభ్యులు
- ఇంగ్లిష్‌లో ప్రమాణం చేసిన 15 మంది
- అసెంబ్లీలో 119 మందికిగానూ 101 మంది సభ్యుల ప్రమాణ స్వీకారం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన 119 మందిలో శనివారం ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్‌తో కలిసి 101 మంది ప్రమాణం చేశారు. వీరిలో 15 మంది ఆంగ్లంలో ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులు లాస్య నందిత, పద్మావతి రెడ్డి, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, బండారి లక్ష్మారెడ్డి, గడ్డం వినోద్, మధుసూదన్ రెడ్డి, కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, తోట లక్ష్మీకాంతారావు, కె. మదన్ మోహన్ రావు, ముఠా గోపాల్, మైనంపల్లి రోహిత్, తెల్లం వెంకట్రావ్, గడ్డం వివేక్ ఆంగ్లంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎంఐఎం నుంచి గెలుపొందిన జాఫర్ హుస్సేన్, కౌసర్ మొయినుద్దీన్, జుల్ఫీకర్ అలీ, మహ్మద్ మాజీద్ హుస్సేన్, మహ్మద్ మోబిన్ ఉర్దూలో ప్రమాణం చేశారు.

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సహా అధిక సంఖ్యలో సభ్యులు దైవసాక్షిగా ప్రమాణం చేశారు.
- మంత్రి సీతక్క, సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు సహా పలువురు సభ్యులు పవిత్ర హృదయం సాక్షిగా ప్రమాణం చేశారు. వారిలో ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, అరికపూడి గాంధీ, చిక్కుడు వంశీకృష్ణ, దొంతి మాధవరెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, కె. శంకరయ్య, కసిరెడ్డి నారాయణ రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, మాగంటి గోపినాథ్, మక్కాన్‌సింగ్, రేవూరి ప్రకాశ్ రెడ్డి, వాకిటి శ్రీహరి, వేముల వీరేశం ఉన్నారు.

"దేశ సార్వభౌమాధికారాన్ని"పలకడంలో ఇక్కడా ఇబ్బందే

ప్రమాణ స్వీకారంలో భాగంగా 'సభా నియమాలకు కట్టుబడి ఉంటానని' చేసే ప్రతిజ్ఞ సందర్భంగా సభ్యులు చాలా మంది 'సభా నియామకాలకు కట్టుబడి ఉంటానని' చదివారు. 'భారత దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడుతానని...'అనే వాక్యాన్ని పలుకడానికి సహజంగానే చాలా మంది సభ్యులు ఇబ్బంది పడ్డారు.

బీఆర్ఎస్ సభ్యులకు సీఎం అభివాదం.. రాజగోపాల్‌రెడ్డికి ఆలింగనం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 11.05 గంటలకు సభలోకి వచ్చిన వెంటనే డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, లాస్య నందిత , కోవాలక్ష్మి తదితరుల వద్దకు వెళ్లి అభివాదం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వద్దకు వెళ్లి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఎంఐఎం సభ్యులను ప్రత్యేకంగా వెళ్లి కలిశారు.

- ప్రమాణ స్వీకారోత్సవం చూసేందుకు కుటుంబసభ్యులు కూడా సభకు వచ్చారు.
- అన్ని పార్టీల శాసనసభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ వద్దకు వెళ్లి అభివాదం చేశారు. అనంతరం కాంగ్రెస్ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి అభివాదం చేసి, ఫొటోలు దిగారు.
- కొత్త ఎమ్మెల్యేలకు అసెంబ్లీ నియమావళి, ఇతర మెటీరియల్‌తో కూడిన కిట్‌ను ప్రమాణం చేసిన ప్రతి ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రమాణ స్వీకారోత్సవానికి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల కుటుంబసభ్యులు కూడా తరలి వచ్చారు.
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సింగరేణి కార్మికుడి దుస్తుల్లో అసెంబ్లీకి వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శాసనసభలో మక్కాన్‌సింగ్‌ను రేవంత్ ప్రత్యేకంగా అభినందించడం కనిపించింది.
- మంత్రి సీతక్క ప్రమాణం చేసిన తరువాత బీఆర్ఎస్ మహిళా సభ్యులు కోవాలక్ష్మి, లాస్య నందిత, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వద్దకు వెళ్లి కలిశారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి కలవడం కనిపించింది.

క్లుప్తంగా...

ప్రమాణానికి మరోరోజు సమయం ఇవ్వండి

- శాసనసభ కార్యదర్శికి కేటీఆర్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: శస్త్రచికిత్స జరిగిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు సహా సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు శనివారం జరిగిన శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. ఈ నేపథ్యంలో ప్రమాణ స్వీకారానికి మరో రోజు సమయం ఇవ్వాలని శాసనసభ కార్యదర్శిని కేటీఆర్ కోరారు. కేసీఆర్ వెంట ఆస్పత్రిలో ఉన్నందున తెలంగాణ భవన్‌లో జరిగిన టీఆర్ఎస్ఎల్పీ సమావేశానికి కూడా కేటీఆర్ హాజరు కాలేదు. కేసీఆర్ ఆరోగ్యం కుదుటపడ్డాక ఎమ్మెల్యేగా మరోరోజు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు రాజీనామా

సాక్షి, హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), పాడి కౌశిక్‌రెడ్డి (హుజూరాబాద్) శనివారం తమ పదవులకు రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ముగ్గురు ఎమ్మెల్సీలు శాసన సభ్యులుగా ఎన్నికైన నేపథ్యంలో తమ మండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. వీరు ఈ నెల 14న స్పీకర్ సమక్షంలో ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాగా, మెదక్ ఎంపీగా ఉన్న కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడా దుబ్బాక ఎమ్మెల్యేగా ఎన్నికైన నేపథ్యంలో సోమవారం తన పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేయనున్నారు.

ఎమ్మెల్యేలకు రాజన్న ప్రసాదం

పంపిణీ చేసిన వేములవాడ ఎమ్మెల్యే

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీకి ఎన్నికై ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన నూతన ఎమ్మెల్యేలకు శనివారం రాజన్న ప్రసాదం పంపిణీ చేశారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ (కాంగ్రెస్) ప్రసాదాన్ని తీసుకొచ్చి ఎమ్మెల్యేలతో పాటు అసెంబ్లీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ 'సాక్షి'తో మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేలకు తిరుపతి ప్రసాదం ఇచ్చేవారని, ఇప్పుడు తన నియోజకవర్గం నుంచి రాజరాజేశ్వరుడి ప్రసాదం అందజేయడం ఆనందంగా ఉందని చెప్పారు. కాగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యేలందరికీ శాసనసభ సచివాలయం ఆకర్షణీయమైన లెదర్ బ్యాగ్‌ను అందజేసింది. ఇందులో సభ్యులకు అవసరమయ్యే అసెంబ్లీ నిబంధనలు, ప్రొసీడింగ్స్‌కు సంబంధించిన పుస్తకాలున్నాయి.

సీపీఎస్‌ను రద్దు చేయించండి

కోదండరాంకు టీసీపీఎస్ఈఏ వినతి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే ఇచ్చిన హామీల అమలు ప్రక్రియను ప్రారంభించడం అభినందనీయమని తెలంగాణ కంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి హనుమాండ్ల భాస్కర్, అసోసియేట్ అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను శనివారం హైదరాబాద్‌లో టీసీపీఎస్ఈఏ ప్రతినిధులు కలిశారు. సీపీఎస్‌ను రద్దు చేయించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సీపీఎస్‌ను రద్దు చేయించి పాత పింఛన్ విధానాన్ని అమల్లోకి తేవాలని కోరామని చెప్పారు.

శ్రీవారి సేవలో ఆర్జేడీ అధినేత లాలూ

సుప్రభాత సేవలో కుటుంబ సమేతంగా దర్శనం



తిరుమల: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబ సమేతంగా శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువ జామున లాలూ, ఆయన సతీమణి రబ్రీ దేవి, కుమారుడు తేజస్వీ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి సుప్రభాత సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం వీరికి వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
10-12-2023



క్వార్టర్ ఫైనల్లో భారత్

జూనియర్ పురుషుల హాకీ ప్రపంచకప్‌లో భారత్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. కౌలాలంపూర్‌లో పూల్ ‘సి’లో శనివారం జరిగిన పోరులో యువ భారత్ జట్టు 10–1తో కెనడాను చిత్తు చేసింది. ఈ విజయంతో తమ పూల్‌లో రెండో స్థానంలో నిలిచిన భారత్ నాకౌట్‌కు అర్హత సంపాదించింది. భారత జట్టులో ఆదిత్య అర్జున్ (8వ, 43వ నిమిషాల్లో), రోహిత్ (12వ, 55వ ని.), అమన్‌దీప్ లక్రా (23వ, 51వ ని.) రెండేసి గోల్స్ సాధించారు. విష్ణుకాంత్ (42వ ని.), రాజిందర్ (42వ ని.), కుష్వాహ సౌరభ్ ఆనంద్ (51వ ని.), ఉత్తమ్ సింగ్ (58వ ని.) తలా ఒక గోల్ చేశారు. కెనడా తరఫున నమోదైన ఏకైక గోల్‌ను జూడ్ నికోల్సన్ 20వ నిమిషంలో చేశాడు. మంగళవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో భారత్... పూల్ ‘డి’ విజేత నెదర్లాండ్స్‌తో తలపడుతుంది.

ఆసియా కప్ క్రికెట్ (అండర్–19)లో నేడు
భారత్ X పాకిస్తాన్
ఉ.గం. 11 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కాశ్వీ బన్‌గయీ కరోడ్‌పతి

- డబ్ల్యూపీఎల్ వేలంలో చండీగఢ్ పేసర్‌కు రూ. 2 కోట్లు
- ఆసీస్ ప్లేయర్ అనాబెల్‌కూ రూ. 2 కోట్లు
- 30 మందిని ఎంచుకున్న ఐదు జట్లు


కాశ్వీ గౌతమ్


వృంద


అనాబెల్

ముంబై: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్ కోసం జరిగిన మినీ వేలంలో ఇద్దరు భారత యువ క్రీడాకారిణుల పంట పండింది. చండీగఢ్‌కు చెందిన పేస్ బౌలర్ కాశ్వీ గౌతమ్, కర్నాటక బ్యాటర్ వృందా దినేశ్‌ల పంట పండింది. కాశ్వీని గుజరాత్ జెయింట్స్ రూ. 2 కోట్లకు ఎంచుకోగా...వృందాను రూ.1 కోటి 30 లక్షలకు యూపీ వారియర్స్ తీసుకుంది. ఆస్ట్రేలియా యువ క్రీడాకారిణి అనాబెల్ సదర్లాండ్‌ను కూడా ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 2 కోట్లకే తమ జట్టులోకి చేర్చుకుంది. గత ఏడాదిలాగే ఈ సారి కూడా అద్భుత ఫామ్‌లో ఉన్నా... శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టును వేలంలో ఏ జట్టూ తీసుకోలేదు. మొత్తం 165 మంది ప్లేయర్లు మహిళల లీగ్‌లో వేలం కోసం అందుబాటులోకి రాగా ఐదు జట్లూ కలిపి 30 మందిని ఎంచుకున్నాయి. వీరిలో 9 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. 2024 ఫిబ్రవరిలో డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ మ్యాచ్‌లు జరుగుతాయి.

వారిద్దరికి ఎందుకంటే...

గత సీజన్ వేలంలో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు వేలంలో రూ.1.80 కోట్లు పలకగా, ఇప్పటి వరకు భారత్‌కు ఆడని (అన్‌క్యాప్డ్) కాశ్వీకి అంతకంటే ఎక్కువ మొత్తం లభించడం విశేషం. సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అయిన కాశ్వీ కోసం అన్ని జట్లూ పోటీ పడ్డాయి. గత నెలలో జాతీయ టి20 టోర్నీలో 12 వికెట్లు తీసిన కాశ్వీ ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన ‘ఎ’ సిరీస్‌లో ఆడింది. అంతకు ముందు ఆసియా కప్ అండర్–23లో విజేతగా నిలిచిన జట్టులోనూ సభ్యురాలు. కాశ్వీ కనీస ధర రూ. 10 లక్షలతో వేలం మొదలు కాగా, ప్రధానంగా పోటీ యూపీ, గుజరాత్ మధ్యే నడిచింది. చివరకు గుజరాత్ ఆమెను సొంతం చేసుకుంది. మూడేళ్ల క్రితం అండర్–19 వన్డేలో ఒకే ఇన్నింగ్స్‌లో 10 వికెట్లు తీసిన రికార్డు కాశ్వీకి ఉంది. 22 ఏళ్ల వృంద దూకుడైన బ్యాటింగ్‌కు మారుపేరు. గత రెండు సీజన్లుగా నిలకడగా ఆడిన వృంద ఈ ఏడాది సీనియర్ వన్డే టోర్నీలో 477 పరుగులతో కర్నాటక ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించింది. అనాబెల్ ఆసీస్ తరఫున 23 వన్డేలు, 22 టి20లు ఆడింది.

వేలంలో టాప్

అనాబెల్ (ఆస్ట్రేలియా) - రూ. 2 కోట్లు
కాశ్వీ గౌతమ్ (భారత్) - రూ. 2 కోట్లు
వృంద దినేశ్ (భారత్) - రూ.1.30 కోట్లు
షబ్నిమ్ (దక్షిణాఫ్రికా) - రూ. 1.20 కోట్లు
ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (ఆస్ట్రేలియా) - రూ. 1 కోటి
ఏక్తా బిష్త్ (భారత్) - రూ. 60 లక్షలు
వేర్‌హమ్ (ఆస్ట్రేలియా) - రూ. 40 లక్షలు

మన ప్లేయర్లు ముగ్గురు...

భారత్ తరఫున 17 టి20లు ఆడిన ఆంధ్ర ఓపెనర్ సబ్బినేని మేఘనను బెంగళూరు రూ. 30 లక్షలకు, ఇంకా సీనియర్ స్థాయిలో ఆడని హైదరాబాద్ బ్యాటర్ ఏడుకొండల త్రిష పూజితను గుజరాత్ జెయింట్స్ రూ. 10 లక్షలకు తీసుకున్నాయి. 2008నుంచి 2014 మధ్య భారత్ తరఫున 50 వన్డేలు, 37 టి20లు ఆడి ఆ తర్వాత జాతీయ జట్టుకు దూరమైన 35 ఏళ్ల హైదరాబాద్ లెఫ్టార్మ్ స్పిన్నర్ గౌహర్ సుల్తానాను రూ. 30 లక్షలకు యూపీ వారియర్స్ ఎంచుకోవడం విశేషం. మరో హైదరాబాద్ అమ్మాయి గొంగిడి త్రిష మాత్రం వేలంలో ఎంపిక కాలేదు.

సిరీస్ అప్పగించేశారు!

- రెండో టి20లోనూ భారత్ ఓటమి
- 2–0తో సిరీస్ ఇంగ్లండ్ మహిళల సొంతం


భారత కెప్టెన్ హర్మన్‌ను అవుట్ చేసిన ఆనందంలో ఇంగ్లండ్ జట్టు

ముంబై: భారత మహిళల జట్టు ఆఖరి మ్యాచ్ మిగిలుండగానే టి20 సిరీస్‌ను ఇంగ్లండ్‌కు అప్పజెప్పింది. శనివారం జరిగిన రెండో టి20లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ చేతిలో పరాజయం చవిచూసింది. దీంతో ఇంగ్లండ్ 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. టాస్ నెగ్గిన ఇంగ్లండ్ ఫీల్డింగ్‌కు మొగ్గు చూపగా ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత అమ్మాయిల జట్టు 16.2 ఓవర్లలో 80 పరుగులకే కుప్పకూలింది. జెమీమా రోడ్రిగ్స్ (33 బంతుల్లో 30; 2 ఫోర్లు) మాత్రమే ఇంగ్లండ్ బౌలింగ్‌ను కొంత వరకు ఎదుర్కోగలిగింది. స్మృతి మంధాన (10) మాత్రమే రెండంకెల స్కోరు చేయగా... మిగతా వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ చార్లి డీన్ (2/16), లారెన్ బెల్, సోఫీ ఎకిల్‌స్టోన్, సారా గ్లెన్ తలా రెండు వికెట్లు తీశారు. తర్వాత సునాయాస లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ త్వరత్వరగా వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. అయితే చివరకు 11.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు డాని వైట్ (0), సోఫియా డన్‌క్లీ (9) విఫలమైనా... అలైస్ కాప్సీ (21 బంతుల్లో 25; 4 ఫోర్లు), నట్ సీవర్ (16) కాసేపు క్రీజులో నిలవడంతో విజయం దక్కింది. సిరీస్‌లో నామమాత్రమైన చివరి టి20 మ్యాచ్ నేడు ఇదే వేదికపై జరుగుతుంది.

రెండో టెస్టులో కివీస్ గెలుపు

మిర్పూర్: రెండో టెస్టులో న్యూజిలాండ్ 4 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై గెలిచింది. రెండు టెస్టుల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. బౌలింగ్‌కే అనుకూలిస్తున్న పిచ్‌పై నాలుగో రోజు 14 వికెట్లు కూలాయి. 38/2 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 35 ఓవర్లలో 144 పరుగులకే ఆలౌటైంది. జాకీర్ హసన్ (59) ఒంటరి పోరాటం చేశాడు. ఎజాజ్ పటేల్ 6, సాన్‌ట్నర్ 3 వికెట్లు పడగొట్టారు. 137 పరుగుల లక్ష్యాన్ని 39.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి కివీస్ ఛేదించింది. ఫిలిప్స్ (40 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), సాన్‌ట్నర్ (35 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. మెహదీహసన్ మిరాజ్ 3, తైజుల్ ఇస్లామ్ 2 వికెట్లు తీశారు.

సఫారీ సవాల్‌కు సై

- భారత్, దక్షిణాఫ్రికా మధ్య టి20 పోరు
- నేడు ఇరు జట్ల మధ్య తొలి మ్యాచ్
- రా.గం. 7.30 నుంచి ‘స్టార్‌స్పోర్ట్స్–1’లో ప్రసారం

డర్బన్: భారత గడ్డపై వన్డే ప్రపంచకప్‌ను ఎగరేసుకుపోయిన ఆస్ట్రేలియాను పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా గట్టి దెబ్బ కొట్టింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో స్టార్లు, అనుభవజ్ఞులు లేకపోయినా... సూర్యకుమార్ సేన టి20 సిరీస్‌ను సాధించింది. ఇప్పుడు కూడా దాదాపు అలాంటి జట్టుతోనే విదేశీ గడ్డపై గట్టి ప్రత్యర్థి అయిన దక్షిణాఫ్రికాతో కఠిన సవాల్‌కు టీమిండియా సై అంటోంది. రిజర్వ్ బెంచ్ మెరిసేందుకు, ఐపీఎల్ వేలానికి ముందు అందరికంటా పడేందుకు యువ ఆటగాళ్లకు ఇది లక్కీ చాన్స్ అని చెప్పొచ్చు. యశస్వి జైస్వాల్, రుతురాజ్ ఆస్ట్రేలియా బౌలింగ్‌పై తమ సత్తా చాటుకున్నారు. మిడిలార్డర్‌లో రింకూ సింగ్, జితేశ్ శర్మలు కూడా వచ్చిన అవకాశాల్ని వినియోగించుకున్నారు. ఇదంతా బాగున్నప్పటికీ సిరీస్ స్వదేశంలో జరిగింది. ఇప్పుడు విదేశీ గడ్డపై యంగ్ ఇండియా ఏ మేరకు రాణిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

గిల్, జడేజా రావడంతో...

ఆసీస్‌పై విజయవంతమైన జట్టుకు తాజాగా రెగ్యులర్ ఓపెనర్ శుబ్‌మన్ గిల్, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, సీమర్ సిరాజ్‌లు కలవడం టీమిండియాకు కచ్చితంగా కలిసొచ్చే అంశం. ఓపెనింగ్‌లో రుతురాజ్ ఫామ్‌లో ఉండటం, టాపార్డర్‌లో శ్రేయస్ అయ్యర్ అందుబాటులో ఉండటం ప్రత్యర్థి బౌలింగ్‌కు ఇబ్బందికరం. దీంతో బ్యాటింగ్ ఆర్డర్ ఇంకాస్త పటిష్టంగా మారింది. రవిబిష్ణోయ్, అర్‌ష్‌దీప్‌లతో బౌలింగ్ విభాగం కూడా మెరుగైన స్థితిలో ఉంది. సీనియర్లు రోహిత్ శర్మ, కోహ్లి, రాహుల్‌లు లేని జట్టును ఆల్‌రౌండ్ నైపుణ్యంతో కూడిన జట్టు ముందుకు తీసుకెళ్తుందనడంలో ఎవరికీ ఏ సందేహం లేదు.



మార్క్‌రమ్ సారథ్యంలో...

దక్షిణాఫ్రికా కూడా పలువురు సీనియర్ ఆటగాళ్లు బవుమా, రబడా, నోర్జే, ఇన్‌గిడి గైర్హాజరీలో కొత్త ముఖాలతో బరిలోకి దిగుతుంది. మార్క్‌రమ్ నేతృత్వంలోని సఫారీ జట్టుకు సొంతగడ్డ అనుకూలతలు ఉన్నప్పటికీ టి20 ఫార్మాట్‌లో ఏదైనా సాధ్యమే! హెండ్రిక్స్, స్టబ్స్, క్లాసెన్, మిల్లర్‌లు ధనాధన్ ఆటలో మెరిపించే సత్తా ఉన్నవారు. కొయెట్జీ, షమ్సీ, కేశవ్ మహరాజ్‌లు బౌలింగ్‌లో ఇటీవల నిలకడగా రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య హోరాహోరీ సమరం తప్పదు.

పిచ్–వాతావరణం

టి20లకు సరిపోయే పిచ్. బ్యాటింగ్‌కు అనుకూలమైనప్పటికీ ఉదయం వాన ముప్పుతో ఆరంభంలో నెమ్మదించే అవకాశముంది. అయితే మ్యాచ్ సమయానికల్లా (రాత్రి) వర్షం బెడద ఉండకపోవచ్చు.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), గిల్, రుతురాజ్, అయ్యర్, రింకూ సింగ్, జితేశ్ శర్మ, జడేజా, దీపక్ చహర్, కుల్దీప్ / రవి బిష్ణోయ్, సిరాజ్, అర్‌ష్‌దీప్.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), హెండ్రిక్స్, బ్రీట్జ్‌కే, స్టబ్స్ / క్లాసెన్, మిల్లర్, ఫెరీరా, జాన్సెన్, కేశవ్ మహరాజ్, కొయెట్జీ, బర్గర్, షమ్సీ

టైటాన్స్ మరో ఓటమి



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) తాజా సీజన్‌లోనూ తెలుగు టైటాన్స్ నిరాశాజనక ప్రదర్శన కొనసాగిస్తోంది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ జట్టు పరాజయం చవిచూసింది. శనివారం బెంగళూరులో జరిగిన పోరులో యూపీ యోధాస్ 48–33 స్కోరుతో టైటాన్స్‌పై గెలిచింది. టైటాన్స్ కెప్టెన్ పవన్ సెహ్రావత్ 11 పాయింట్లు సాధించాడు. రజనీశ్ (6), మిలాద్ (4) మెరుగనిపించారు. యూపీ జట్టులో సురేందర్ గిల్ (14) అదరగొట్టాడు. మిగతా వారిలో ప్రదీప్ నర్వాల్ (8), నితీశ్ (5), నితిన్ పన్వార్ (4) రాణించారు.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	4	3	1	0	16
యూపీ యోధాస్	3	2	1	0	11
పట్నా పైరేట్స్	2	2	0	0	10
పుణేరి పల్టన్	2	2	0	0	10
బెంగాల్ వారియర్స్	2	1	0	1	8
యు ముంబా	3	1	2	0	6
తమిళ్ తలైవాస్	1	1	0	0	5
దబంగ్ ఢిల్లీ	2	1	1	0	5
హరియాణా స్టీలర్స్	2	1	1	0	5
జైపూర్ పింక్ పాంథర్స్	2	0	1	1	4
బెంగళూరు బుల్స్	4	0	4	0	4
తెలుగు టైటాన్స్	3	0	3	0	1

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

సినిమా

2023 రౌండప్

అనువాదం అదిరింది



కథ బాగుందా? బొమ్మ (సినిమా) అనువాదం అయినా తెలుగు ప్రేక్షకులు అదిరిపోయే వసూళ్లు ఇస్తారు. అలా ఈ ఏడాది డబ్బింగ్ బొమ్మల వసూళ్లు బాగానే ఉన్నాయి. కొన్ని భారీ వసూళ్లు సాధిస్తే.. కొన్ని ఫర్వాలేదనిపించుకున్నాయి. కొన్ని చిత్రాలు నిరాశపరిచాయి. ఏది ఏమైనా ఈ ఏడాది అనువాదం బొమ్మ అదిరిందనే చెప్పాలి. ఆ విశేషాల్లోకి...

● జైలర్

రజనీకాంత్‌కి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అయితే ఇటీవల ఆశించిన విజయాలు ఇవ్వకుండా ఫ్యాన్స్‌ను నిరుత్సాహపరిచిన ఆయన ‘జైలర్’తో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి వచ్చేశారు. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రజనీకాంత్, రమ్యకృష్ణ జోడీగా నటించారు. ఈ మూవీలో జైలర్ ముత్తువేల్ పాండ్యన్‌గా రజనీ నటించారు. కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రంలో మోహన్ లాల్, జాకీ ష్రాఫ్, శివరాజ్ కుమార్ వంటి స్టార్స్ అతిథి పాత్రల్లో అలరించారు. తెలుగు, తమిళ భాషల్లో ‘జైలర్’ సూపర్ హిట్.

● వారసుడు.. లియో

విజయ్ హీరోగా నటించిన తమిళ చిత్రం ‘వారిసు’. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ‘దిల్’ రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి రేస్‌లో జనవరి 11న తమిళంలో రిలీజైంది. ‘వారసుడు’ పేరుతో తెలుగులోకి అనువదించి, సంక్రాంతి పోటీలోనే జనవరి 14న రిలీజ్ చేశారు. తమిళంలో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ మూవీ తెలుగులోనూ హిట్‌గా నిలిచింది. ఇక విజయ్ నటించిన మరో చిత్రం ‘లియో’. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ తెలుగులో డబ్ చేసి, అక్టోబర్ 19నే రిలీజ్ చేశారు. తెలుగులో ‘లియో’ టైటిల్‌పై వివాదం చెలరేగినా, ఆ తర్వాత సద్దుమణిగింది. తమిళంలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన ‘లియో’ తెలుగులోనూ మంచి వసూళ్లు రాబట్టింది.

మాతృక హిట్..

అనువాదం ఫట్

తమిళ్, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో హిట్‌గా నిలిచిన పలు చిత్రాలు తెలుగులో ఫర్వాలేదనిపించుకున్నాయి. కొన్ని మాతృకలో హిట్టయినా, ఇక్కడ ఆశించిన ఫలితం సాధించలేకపోయాయి. విశాల్ ‘మార్క్ ఆంటోనీ’, అదా శర్మ ‘ది కేరళ స్టోరీ’, ఎస్.జె. సూర్య, రాఘవా లారెన్స్‌ల ‘జిగర్తాండ డబుల్ ఎక్స్’, రక్షిత్‌శెట్టి ‘సప్తసాగరాలు దాటి’ రెండు భాగాలు, దుల్కర్ సల్మాన్ ‘కింగ్ ఆఫ్ కోత’, కార్తీ ‘జపాన్’, రాఘవా లారెన్స్ ‘చంద్రముఖి 2’, శివ రాజ్‌కుమార్ ‘ది ఘోస్ట్’, రిషబ్ శెట్టి ‘బాయ్స్ హాస్టల్’, పూ రాము, కాళీ వెంకట్ కీలక పాత్రల్లో నటించిన ‘దీపావళి’ వంటి చిత్రాలు మాతృకలో ఫర్వాలేదనిపించినా తెలుగులో ఆశించిన స్థాయిలో ప్రేక్షకాదరణ పొందలేకపోయాయి. సల్మాన్ ఖాన్ ‘టైగర్ 3’, టైగర్ ష్రాఫ్ ‘గణపథ్’ వంటి హిందీ చిత్రాలు తెలుగులో హిట్ టాక్‌ని సొంతం చేసుకోలేకపోయాయి.

● పొన్నియిన్ సెల్వన్-2

కల్కి కృష్ణమూర్తి నవల పొన్నియిన్ సెల్వన్ ఆధారంగా దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన చిత్రం ‘పొన్నియిన్ సెల్వన్ 1’. చోళ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే కథ ఇది. విక్రమ్, ఐశ్వర్యా రాయ్, త్రిష, కార్తీ, ‘జయం’ రవి, శోభిత ధూళిపాళ్ల, ప్రకాశ్‌రాజ్, శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించారు. మణిరత్నం, సుభాస్కరన్ నిర్మాతలు. రెండు భాగాలుగా రూపొందిన ఈ సినిమా తొలి భాగం గత ఏడాది విడుదలై, తమిళ్, తెలుగు భాషల్లో హిట్ అయింది. ‘పొన్నియిన్ సెల్వన్ 2’ ఈ ఏడాది ఏప్రిల్ 28న రిలీజైంది. తెలుగులో నిర్మాత ‘దిల్’ రాజు రిలీజ్ చేయగా మంచి వసూళ్లు రాబట్టింది.

● పఠాన్.. జవాన్

‘జీరో’ (2018) సినిమా తర్వాత దాదాపు నాలుగేళ్లు గ్యాప్ తీసుకుని షారుఖ్ ఖాన్ నటించిన చిత్రం ‘పఠాన్’. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో స్పై యాక్షన్ నేపథ్యంలో ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టించింది. ప్రపంచ వ్యాప్తంగా రూ. వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి హిందీ సినిమాగా ‘పఠాన్’ రికార్డులు సృష్టించింది. తెలుగులోనూ ఈ సినిమా హిట్‌గా నిలిచింది. ఇక షారుక్ నటించిన మరో చిత్రం ‘జవాన్’ కూడా తెలుగులో ఓకే అనిపించుకుంది. తమిళ దర్శకుడు అట్లీ తెరకెక్కించిన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ. 1200 కోట్లు వసూలు చేసిందని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. షారుక్ నటించిన తాజా చిత్రం ‘డంకీ’ ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఈ సినిమా కూడా హిట్ అయితే మూడు విజయాలతో షారుక్ ఈ ఏడాది హ్యాట్రిక్ సాధించినట్లే.

● యానిమల్

‘అర్జున్ రెడ్డి’ ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన హిందీ చిత్రం ‘యానిమల్’. రణ్‌బీర్ కపూర్, రష్మిక మందన్నా జంటగా నటించారు. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 1న రిలీజైంది. తెలుగులో ఈ చిత్రాన్ని ‘దిల్’ రాజు రిలీజ్ చేశారు. ఈ చిత్రంలోని అడల్ట్ కంటెంట్‌పై కొన్ని విమర్శలు వచ్చినప్పటికీ అవేవీ వసూళ్లను ఆపలేకపోయాయి. విడుదలైన రోజు నుంచి ఇప్పటికీ భారీ వసూళ్లతో దూసుకెళుతోంది.

● బిచ్చగాడు 2

విజయ్ ఆంటోని కెరీర్‌లో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన చిత్రం ‘బిచ్చగాడు’ (‘పిచ్చైకారన్’). శశి దర్శకత్వం వహించిన ఈ సినిమా 2016లో విడుదలై ఘనవిజయం సాధించింది. తెలుగులో ‘బిచ్చగాడు’గా విడుదలై, బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ‘బిచ్చగాడు’ విడుదలైన ఏడేళ్లకు ఈ ఏడాది ‘బిచ్చగాడు 2’ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విజయ్ ఆంటోని హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం భారీ అంచనాలతో తమిళ, తెలుగు భాషల్లో విడుదలైంది. రిలీజ్ రోజున మిక్స్‌డ్ టాక్ వచ్చినా, మంచి వసూళ్లు రాబట్టింది.

● 2018

కేరళ ప్రాంతంలో 2018లో వచ్చిన వరదల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం ‘2018’. టొవినో థామస్, కుంచకో బోబన్, అపర్ణా బాలమురళి, లాల్, ఆసిఫ్ అలీ నటించారు. జూడ్ ఆంటోని జోసెఫ్ దర్శకత్వం వహించారు. వేణు కున్నప్పిళ్లై, సీకే పద్మ కుమార్, ఆంటోని జోసెఫ్ నిర్మించిన ఈ సినిమా మే 5న ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైంది. రూ. వంద కోట్లు వసూలు చేసిన తొలి మలయాళ చిత్రంగా రికార్డు సృష్టించింది. మలయాళంలో విడుదలైన 20 రోజులకే ఈ చిత్రం తెలుగులోనూ ‘2018’ పేరుతోనే అనువాదం అయింది. నిర్మాత ‘బన్నీ’ వాసు తెలుగులో విడుదల చేయగా, ఇక్కడ కూడా హిట్‌గా నిలిచింది. 2018లో కేరళలో వచ్చిన వరదలు, అప్పుడు ప్రజలు పడ్డ ఇబ్బందులు, భావోద్వేగాలను కళ్లకు కట్టినట్లు చూపించారు.

రామ్‌చరణ్‌కి గోల్డెన్ బాలీవుడ్ యాక్టర్ అవార్డు



హీరో రామ్ చరణ్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గుర్తింపు దక్కింది. అమెరికాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 2023 పాప్ గోల్డెన్ అవార్డ్స్‌లో గోల్డెన్ బాలీవుడ్ యాక్టర్‌గా నిలిచారు. ఈ విషయాన్ని పాప్ గోల్డెన్ కమిటీ అధికారికంగా వెల్లడించింది. ‘ఆర్ఆర్ఆర్’తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న రామ్ చరణ్‌తో పాటు ఈ అవార్డు కోసం షారుఖ్ ఖాన్, దీపికా పదుకోన్, అదా శర్మ, విషెస్ బన్సల్, అర్జున్ మాథుర్, రిద్ధి డోగ్రా, రాశీ ఖన్నా నామినేషన్స్ దక్కించుకోగా ఫైనల్‌గా రామ్ చరణ్‌ని వరించింది. ఇటీవలే రామ్ చరణ్ ‘ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్’ (ఆస్కార్) క్లాస్ ఆఫ్ యాక్టర్స్ జాబితాలో చోటు దక్కించుకున్నారు. తాజాగా ‘గోల్డెన్ బాలీవుడ్ అవార్డు’ కి ఎంపికవడంతో ఆయన అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

ఇలా కదా సినిమా తీయాలి అనిపించింది

- అల్లు అరవింద్


● వెంకటేశ్, అల్లు అరవింద్, చందు, సాయిపల్లవి, నాగార్జున, నాగచైతన్య, బన్నీ వాసు

‘‘వాస్తవ ఘటనలతో తెరకెక్కుతోన్న ‘తండేల్’ చిత్రం స్క్రిప్ట్, ప్రీ ప్రొడక్షన్‌కి ఏడాదిన్నర పట్టింది. ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో ‘తండేల్’ టీమ్ అంతా కూర్చొని ప్రతి విషయాన్ని చర్చించుకున్నప్పుడు సంతోషంగా అనిపించింది. ఇలా కదా సినిమా తీయాలి అనే తృప్తి కలిగింది’’ అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. నాగచైతన్య హీరోగా సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం ‘తండేల్’. చందు మొండేటి దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ సమర్పణలో ‘బన్నీ’ వాసు నిర్మిస్తున్న ఈ సినిమా శనివారం ప్రారంభమైంది. ముహూర్తం వేడుకకు హీరో నాగార్జున కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వెంకటేశ్ క్లాప్ ఇచ్చారు. అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందజేశారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ–‘‘తండేల్’ అన్ని సినిమాల్లా కాదు. బలమైన కథ, చాలా ప్రత్యేకమైనది.. కావాల్సిన సమయం తీసుకొని పక్కాగా ప్లాన్ చేసుకొని వెళ్దామని అరవింద్‌గారు ప్రోత్సహించారు. నా కెరీర్‌లో గుర్తుండిపోయే విజయాన్ని ‘100% లవ్’ సినిమాతో అరవింద్ గారే ఇచ్చారు. ఇప్పుడు ‘తండేల్’ని ఆయన నిర్మించడం ఆనందంగా ఉంది’’ అన్నారు. ‘‘ఏడాదిన్నరగా ‘తండేల్’ కథపై పని చేశాం. నేను నా బెస్ట్ ఇస్తాను’’ అన్నారు చందు మొండేటి. ‘‘మూడేళ్ల క్రితం ఈ స్క్రిప్ట్ గీతా ఆర్ట్స్‌కి వచ్చింది.. అప్పటి నుంచి కథ విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాం. ఏడాదిన్నరగా ప్రీ ప్రొడక్షన్ పనులు జరిగాయి’’ అన్నారు ‘బన్నీ’ వాసు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: శ్యామ్‌దత్.

ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు

- దర్శకుడు సాయికిరణ్ దైదా



‘‘తెలుగులో ఇప్పటిదాకా వచ్చిన హారర్ సినిమాలకు పూర్తి భిన్నంగా ‘మా పిండం’ ఉంటుంది. భయపెట్టాలని హారర్ సీన్స్ పెట్టలేదు. బలమైన కథ ఉంది. ప్రేక్షకులకు ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది’’ అన్నారు దర్శకుడు సాయికిరణ్ దైదా. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం ‘పిండం’. యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న రిలీజ్ కానుంది. సాయికిరణ్ దైదా మాట్లాడుతూ– ‘‘చిన్నప్పటి నుండి నాకు రాయడం అంటే ఇష్టం. అమెరికాలో వ్యాపారం చేస్తున్నా స్క్రిప్టులు రాసేవాడిని. కోన వెంకట్‌గారు అమెరికాలో పరిచయమయ్యారు. నేను రాసుకున్న ఓ క్రైమ్ కామెడీ కథ ఆయనకు నచ్చింది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా ఆ సినిమా డల్లాస్‌లోనే షూటింగ్ జరగాల్సి ఉంది. కోవిడ్ కారణంగా కుదరలేదు. నల్గొండ జిల్లాలో జరిగిన ఒక ఘటన చుట్టూ కల్పిత కథ అల్లుకుని ‘పిండం’ తీశాను. ఇది హారర్ సినిమా కాబట్టి భయపెట్టే సీన్స్ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాను. నెక్ట్స్ ‘కృష్ణుడి లంక’ టైటిల్‌తో సినిమా చేయబోతున్నాను’’ అన్నారు.

సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 10-12-2023

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

నకిలీ సీఎంఓ అధికారి అరెస్టు

- డబుల్ బెడ్రూం ఇళ్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం
- రూ.కోట్లలో వసూలు చేసిన ప్రవీణ్ సాయి
- ఏడాదిగా నగరంలో భూ సెటిల్‌మెంట్లతో వసూళ్లు
- మాటువేసి పట్టుకున్న ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కార్యాలయ అధికారి (సీఎంఓ) అని ప్రచారం చేసుకుంటూ మోసాలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ను ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ) పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలికి చెందిన ప్రవీణ్ సాయి బీటెక్ పూర్తయ్యాక హైదరాబాద్‌కు వచ్చి, వనస్థలిపురంలో ఉంటున్నాడు. స్థానికంగా ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో ఎంటెక్‌లో చేరాడు. విలాసవంతమైన జీవనానికి అలవాటు పడిన ప్రవీణ్ సాయి అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఏడాది కాలంగా సీఎంఓ అధికారిగా ప్రచారం చేసుకుంటూ అమాయకులను మోసం చేయడం ప్రారంభించాడు. మంత్రులు, ఎమ్మెల్యేలతో సత్సంబంధాలు ఉన్నాయని ప్రచారం చేసుకొని, డబుల్ బెడ్రూం ఇళ్లు, స్థలాలు ఇప్పిస్తానని అమాయకులను మోసం చేసేవాడు. మంత్రులు, ఎమ్మెల్యేల నకిలీ లెటర్ హెడ్‌లతో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులు, యువత నుంచి పెద్దఎత్తున డబ్బు వసూలు చేశాడు. నకిలీ ఎన్‌ఓసీలు, ల్యాండ్ డాక్యుమెంట్లు సృష్టించి స్థలాలు విక్రయించేవాడు. బేగంపేటలో పలువురు బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తానని రూ.లక్షల్లో వసూలు చేశాడు. ఈ కేసులో ప్రవీణ్ సాయి మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉండటంతో గతంలో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

రూ.30 కోట్ల భూ సెటిల్‌మెంట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్‌లో రూ.30 కోట్లు విలువ చేసే భూమి సెటిల్‌మెంట్ చేయిస్తానని చెప్పి, బాధితుడితో రూ.12 కోట్లకు ఒప్పందం చేసుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.8 లక్షలు తీసుకొని, బాధితుడిని ఆ ల్యాండ్‌లో నిలబెట్టి ఫొటోలుతీసి బోర్డు కూడా పాతాడు. కొద్దిరోజుల తర్వాత ఆ ప్రాంతానికి వెళ్లిన బాధితుడు ఆ స్థలంలో బోర్డు లేకపోవడంతో అనుమానం కలిగింది. వెంటనే ప్రవీణ్ సాయికి ఫోన్ చేయగా పొంతనలేని సమాధానం చెప్పడంతో మోసపోయానని గ్రహించి అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం నిందితుడు అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం రాగా.. వెంటనే అరెస్టు చేశారు.

నేడు నేవీ డే

పాక్‌పై విజయానికి ప్రతీకగా ఏటా నౌకాదళ దినోత్సవం

సాక్షి, విశాఖపట్నం: భారత్ పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో విజయానికి ప్రతీకగా ఏటా డిసెంబర్ 4న నౌకాదళ దినోత్సవం (నేవీ డే) నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం విశాఖలోని తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో జరుగుతుంది. అయితే ఈ ఏడాది మిచాంగ్ తుపాను కారణంగా 4వ తేదీన జరగాల్సిన వేడుకలను 10కి వాయిదా వేశారు. తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఆర్కే బీచ్ వద్ద ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఈ ప్రదర్శనలు ప్రారంభమవుతాయి. నేవీ యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, సబ్‌మెరైన్స్, హెలికాప్టర్లతో నేవీ సిబ్బంది తమ సామర్థ్యాన్ని, ధైర్యసాహసాలను, ప్రతిభా పాటవాల్ని విన్యాసాల రూపంలో ప్రదర్శిస్తారు. తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ వార్ మెమోరియల్ సందర్శన అనంతరం నేవీ హౌస్‌లో ఉన్నతాధికారులు, అతిథులకు తేనీటి విందు ఇస్తారు. సుమారు 2 వేలమంది నౌకాదళ సిబ్బంది ఈ విన్యాసాల్లో పాలుపంచుకుంటారు. వీటిని ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించవచ్చు.

ముఖ్య అతిథిగా గవర్నర్ నజీర్

నౌకాదళ దినోత్సవానికి ఈ ఏడాది ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుని 1 గంటకు పోర్టు గెస్ట్ హౌస్‌కు వస్తారు. సాయంత్రం 4.15 గంటలకు నేవీ విన్యాసాలకు హాజరవుతారు. సాయంత్రం 5.35 గంటల వరకు అక్కడ జరిగే విన్యాసాలు, ప్రదర్శనలను తిలకిస్తారు. అనంతరం తూర్పు నౌకాదళ (ఈఎన్‌సీ) చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఆధ్వర్యంలో నేవీ హౌస్‌లో 'ఎట్ హోం' పేరిట నిర్వహించే తేనీటి విందుకు హాజరవుతారు. తిరిగి రాత్రికి రాజ్‌భవన్‌కు బయల్దేరి వెళతారు.

మాజీ మంత్రుల కార్యాలయాల్లో దస్త్రాల చోరీ!

- పశుసంవర్ధక శాఖలో ఫైల్స్ తరలించుకుపోయారని ఫిర్యాదు
- మాజీ మంత్రి తలసాని ఓఎస్డీపై కేసు నమోదు
- విద్యా పరిశోధన కేంద్రంలోనూ ఫైల్స్ ఎత్తుకెళ్లినట్టు ప్రచారం
- పోలీసులు రావడంతో పరారైన వ్యక్తులు

సాక్షి, హైదరాబాద్, నాంపల్లి (హైదరాబాద్): మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ కల్యాణ్‌పై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మాసబ్‌ట్యాంక్‌లోని పశు సంవర్ధకశాఖ కార్యాలయంలోనికి అక్రమంగా ప్రవేశించిన కల్యాణ్ బీరువాలో ఉన్న దస్త్రాలను కారులో తరలించుకునిపోయారు. వాచ్‌మన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేశారు. నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం... మాజీ మంత్రి తలసాని ఓఎస్డీ కళ్యాణ్ శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలోనికి అక్రమంగా ప్రవేశించారు. అక్కడి సిబ్బంది సహాయంతో బీరువాలో ఉన్న ఫైళ్లను చింపేశారు. అంతటితో ఆగకుండా చించివేసిన ఫైళ్లను తన కారులో తరలించుకుని పోయారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సైతం పనిచేయకుండా చేశారు. దీంతో వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కళ్యాణ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అతడికి సహకరించిన కంప్యూటర్ ఆపరేటర్స్ ఎలిజ మోహన్, అటెండర్లు వెంకటేశ్, ప్రశాంత్‌లపైనా కేసులు నమోదు చేశామని చెప్పారు.



బీరువాలోని ఫైళ్లను చిందరవందర చేసిన దృశ్యం

ఎస్‌సీఈఆర్‌టీ కార్యాలయంలోనూ...

హైదరాబాద్ ఎల్బీ స్టేడియం ఎదురుగా ఉన్న రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) కార్యాలయం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు అధికారిక దస్త్రాలు ఎత్తుకెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక్కడే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కార్యాలయం ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. మాజీ మంత్రి కార్యాలయం నుంచి ఒక ఆటోలో కొంతమంది ఫైళ్లు తీసుకెళ్తున్నట్టు తమకు సమాచారం వచ్చిందని అబిడ్స్ పోలీసులు తెలిపారు. కార్యాలయం వాచ్‌మెన్ వెల్లడించిన ప్రకారం కొన్ని బస్తాల్లో కాగితాలు, ఫైళ్లు తీసుకెళ్లినట్టు పోలీసులు చెబుతున్నారు. అందులో ఏమున్నాయనేది విచారణ జరిపితే తెలుస్తుందని, అన్ని కోణాల్లో వివరాలు సేకరిస్తున్నామని అన్నారు. వాస్తవానికి రెండో శనివారం కావడంతో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉంటుంది. గేట్ కూడా మూసివేస్తారు. కానీ ఆగంతకులు లోనికెలా వచ్చారు? తాళం ఎలా తీశారు అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ ఘటన సెలవు రోజున... అదీ రాత్రి సమయంలో జరగడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఫైళ్లు తీసుకెళ్లిన వ్యక్తి ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా అనుమానిస్తున్నారు. కార్యాలయంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తీసుకెళ్లారని భావిస్తున్న దస్త్రాలు ఏ శాఖకు సంబంధించినవి? వాటి ప్రాధాన్యం ఏమిటనేది తేలాల్సి ఉంది. ఎస్‌సీఈఆర్‌టీ కార్యాలయం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆధీనంలో ఉంటుంది. దీనిపై పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేనను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆమె ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

ఎక్సలెన్స్ సెంటర్లుగా డైట్ కళాశాలలు

- శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు డైట్ కళాశాలలు ఎంపిక

సాక్షి, అమరావతి: ప్రపంచ అవకాశాలను అందుకునేలా.. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేసే ఉపాధ్యాయులకు ఈ దిశగా శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఏపీలో తొలివిడతగా మూడు జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎంపిక చేసింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 125 డైట్ కళాశాలలను మోడల్ డైట్స్ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)గా ఎంపిక చేయగా.. వాటిలో రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు జిల్లాలకు చెందిన మూడు డైట్ కళాశాలలకు అవకాశం దక్కింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు, శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయ విద్యార్థులను నూతన విద్యా విధానానికి అనువుగా శిక్షణ ఇచ్చేందుకు వీటిని తీర్చిదిద్దనున్నారు. ఈ మూడు సెంటర్ల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.24 కోట్లను మంజూరు చేసింది. రాష్ట్రంలో మొత్తం 13 డైట్ కాలేజీలు ఉండగా.. మూడు కేంద్రాలకు మోడల్ డైట్ గుర్తింపు లభించింది.



శ్రీకాకుళం డైట్ కళాశాల

చండూరులో వెయ్యేళ్ల నాటి శిల్పాలు

వాటిని కాపాడుకోవాలన్న పురావస్తు పరిశోధకుడు ఈమని



చండూరులో శిల్పాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి తదితరులు

మానవపాడు: జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చండూరులో ఉన్న వెయ్యేళ్ల నాటి శిల్పాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం చండూరులో సురవరం ప్రతాప్‌రెడ్డి సాహితీ వైజయంతి ట్రస్ట్ సమన్వయకర్త సురవరం గిరిధర్‌రెడ్డి, గ్రామపెద్దలు, అధికారులతో కలిసి శిల్పాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న క్రీ.శ. 8, 9 శతాబ్దాల నాటి నాగదేవతల శిల్పాలు, 11, 12 శతాబ్దాల నాటి వీరగల్లు, 13వ శతాబ్దం నాటి భైరవ, సూర్య శిల్పాలు, 16వ శతాబ్దం నాటి చెన్నకేశవస్వామి, 18వ శతాబ్దం నాటి దంపతుల శిల్పాలతోపాటు చాళుక్య కాలపునాటి గణపతి శివలింగం, నందివిగ్రహాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. 15వ శతాబ్దం నాటి జయ, విజయుల శిల్పాలు గ్రామ చరిత్రకు అద్దం పడుతున్నాయని పేర్కొన్న ఆయన బాదామీ చాళుక్యుల నుంచి విజయనగర కాలానికి చెందిన శిల్పాల గురించి వివరించారు. ఈ శిల్పాలను పీఠాలపై ఉంచి.. చారిత్రక వివరాలతో నామ ఫలకాలను ఏర్పాటు చేస్తే రాబోయే తరాలు తెలుసుకోవడానికి సులభంగా ఉంటుందని ఈమని శివనాగిరెడ్డి సూచించారు.

అతడి గుండె చెదురుతోంది!

మహిళలతో పోలిస్తే పురుషుల్లోనే గుండెపోటు మరణాలు ఎక్కువ

- గతేడాది రాష్ట్రంలో 284 మంది గుండెపోటుతో మృత్యువాత
- ఇందులో 257 మంది పురుషులు; 27 మంది మహిళలు
- ఆంధ్రప్రదేశ్‌లో 176 మంది మృతి
- ఇందులో 162 మంది మగవారు; 14 మంది స్త్రీలు
- అత్యధికంగా మహారాష్ట్రలో 12,591 మందికి గుండెపోటు
- ఎన్‌సీఆర్‌బీ తాజా నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: అస్థిరమైన జీవనశైలి, హార్మోన్ల ప్రభావంతో తెలుగు రాష్ట్రాలు సహా అన్ని ప్రధాన రాష్ట్రాల్లోనూ మహిళల కంటే మగవాళ్లే ఎక్కువ గుండెపోటుతో మరణిస్తున్నారు. గతేడాది తెలంగాణ రాష్ట్రంలో 284 మంది గుండెపోటుతో మరణించగా.. ఇందులో 257 మంది పురుషులు కాగా.. 27 మంది స్త్రీలున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 176 మంది మృత్యువాత పడగా.. 162 మంది మగవాళ్లు, 14 మంది ఆడవారున్నారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ఇటీవల విడుదల చేసిన యాక్సిడెంటల్ డెత్స్ అండ్ సూసైడ్స్ ఇండియా (ఏడీఎస్ఐ)–2022 నివేదికలో బహిర్గతమైంది.

గుండెపోట్లు ఎందుకంటే..

గుండె జబ్బులకు ప్రధాన కారణం జన్యు సంబంధమైనవే. బలహీన గుండె కండరాలు ఉంటే హార్ట్ ఎటాక్‌లకు ఎక్కువ ఆస్కారం ఉంటుంది. మహిళలకు మెనోపాజ్ దశ వరకు శరీరంలో హార్మోన్లు భద్రత కల్పిస్తాయి. కానీ, పురుషులకు అలా ఉండదు కాబట్టి యుక్త వయసులో కూడా మగవారికి గుండెపోటు ప్రమాదం ఎక్కువ. అతిగా మాంసం వినియోగం, కొవ్వు, జంక్ ఫుడ్ వంటి ఆహారపు అలవాట్లతో పాటు శారీరక, మానసిక ఒత్తిడి, అస్థిరమైన జీవనశైలి వల్ల గుండెపోటు వస్తుంటుంది.

గుండె ఆగుతున్న వారిలో యువకులే ఎక్కువ


గతేడాది దేశంలో 32,410 మంది గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించగా.. ఇందులో 28,005 మంది పురుషులు, 4,405 మంది మహిళలు ఉన్నారని. 2021లో 28,413 మంది హార్ట్ ఎటాక్‌తో మృత్యువాత పడ్డారు. అంటే ఏడాదిలో 12.5 శాతం పెరిగింది. గతేడాది 289 మంది మైనర్లకు హార్ట్ ఎటాక్ రాగా.. ఇందులో 185 మంది బాలురు, 104 మంది బాలికలున్నారు. 18 నుంచి 45 ఏళ్ల 12,759 మంది యువత గుండెపోటుకు గురికాగా.. 11,210 మంది పురుషులు, 1,549 మంది స్త్రీలు, 45–60 ఏళ్ల వయసు ఉన్న 12,290 మంది గుండె పోటుతో మరణించగా.. మగవాళ్లు 10,854 మంది, సమహిళలు 1,436 మంది ఉన్నారు. అలాగే 60 ఏళ్ల పైబడిన వాళ్లు 7,069 మంది మరణించగా.. 5,756 మంది పురుషులు, 1,313 మంది మహిళలున్నారు.

ఏం చేయాలంటే...



- సాధ్యమైనంత వరకు మానసిక, పని ఒత్తిడిని తగ్గించుకోవాలి.
- ఉదయం, సాయంత్రం వ్యాయామం తప్పనిసరి.
- స్వచ్ఛమైన గాలి, వెలుతురు వచ్చే ప్రాంతంలో ప్రతి రోజు కొంత సమయం గడపాలి.
- ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవాలి. ఇందుకోసం నిత్యం యోగా, ధ్యానం వంటివి చేయాలి.
- 35 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరూ క్రమం తప్పకుండా గుండె పరీక్షలు చేయించుకోవాలి.
- స్వీయ సంతృప్తి అత్యవసరం. లేనిపోని ఆర్భాటాలకు, డాబులకు పోయి మానసిక ఒత్తిడి తెచ్చుకోకూడదు.

– డాక్టర్ ఏజీకే గోఖలే గుండె శస్త్ర చికిత్స నిపుణులు, అపోలో ఆసుపత్రి



టాప్ కాలేజీల్లో ఇంజనీరింగ్ సీట్ల పరిమితి ఎత్తివేత!

2024 నుంచి అమలుకు సన్నాహాలు

- మూడేళ్ల ఫలితాలు, నియామకాలు కొలమానం
- రాష్ట్రంలో పది కాలేజీలకు ఈ హోదా లభించే అవకాశం
- ముసాయిదా విడుదల చేసిన ఏఐసీటీఈ
- డ్రాఫ్ట్‌పై తెలంగాణ ఉన్నతాధికారుల సమీక్ష

సాక్షి, హైదరాబాద్: అత్యుత్తమ ప్రతిభగల ఇంజనీరింగ్ కాలేజీల్లో విద్యార్థుల ప్రవేశానికి పరిమితి ఎత్తివేయబోతున్నారు. ఇందుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ మేరకు ముసాయిదా ప్రతిని రూపొందించింది. దీన్ని రాష్ట్రాల ఉన్నతవిద్యా మండళ్లకు పంపింది. వచ్చే ఏడాది (2024) నుంచి దీన్ని అమల్లోకి తేవాలని భావిస్తోంది. బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ), బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) కోర్సుల విషయంలోనూ ఈ విధానాన్ని అనుసరించాలని ప్రతిపాదించింది. ఇటీవల విడుదల చేసిన హ్యాండ్‌బుక్‌లోనూ ఏఐసీటీఈ దీన్ని ప్రస్తావించింది. ముసాయిదా ప్రతిని సమీక్షించేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి సిద్ధమవుతోంది. యూనివర్సిటీల వీసీలు, మండలి ఉన్నతాధికారులు ఈ అంశంపై చర్చించేందుకు సమావేశమవుతున్నారు.

రాష్ట్రంలో పది కాలేజీలకు అవకాశం..

రాష్ట్రంలో 174 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా అటానమస్ కాలేజీలను కలుపుకొని 100 కాలేజీలకు 'న్యాక్'అక్రెడిటేషన్ ఉంది. వాటిల్లో అత్యుత్తమ ప్రమాణాలు కనబరిచే కాలేజీల జాబితాను గుర్తించాల్సి ఉంటుంది. దీనికోసం ఎక్స్‌పర్ట్ విజిటింగ్ కమిటీ (ఈవీసీ)ని మండలి నియమించాల్సి ఉంటుంది. ఇందులో ఏఐసీటీఈ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, అనుబంధ గుర్తింపు ఇచ్చే యూనివర్సిటీల సభ్యులు ఉంటారు. విద్యార్థుల హాజరు శాతం, ఏటా కౌన్సెలింగ్‌లో ఏ కాలేజీకి ఎందరు దరఖాస్తు చేస్తున్నారు? ఏయే కోర్సులను డిమాండ్ చేస్తున్నారు? ఆయా కోర్సుల్లో చేరేవారి పురోగతి ఎలా ఉంది? కాలేజీలో చేరిన విద్యార్థుల మార్కుల వివరాలను పరిశీలించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఉపాధి పొందిన తీరు, లభించిన వార్షిక వేతనం వంటి అంశాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. ఇలా రాష్ట్రంలో అన్ని అర్హతలు ఉన్న కాలేజీలు 10 వరకూ ఉంటాయని మండలి వర్గాలు చెబుతున్నాయి. అయితే కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ పెరిగాక సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి సంప్రదాయ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గాయి.



దీన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటారా? అనే విషయమై ఏఐసీటీఈ స్పష్టత ఇవ్వలేదు. కాలేజీల్లో ఉండే మౌలికవసతులను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పినా, దానిపైనా స్పష్టత ఇవ్వలేదని అధికారులు అంటున్నారు.

సీట్లు పెరిగేనా?

ప్రస్తుతం ప్రతి కాలేజీలోని ఒక్కో బ్రాంచిలో గరిష్ఠంగా 4 సెక్షన్లనే అనుమతిస్తున్నారు. ఒక్కో సెక్షన్‌లో 60 సీట్ల చొప్పున మొత్తం 240 సీట్లు ఉంటున్నాయి. అయితే నాలుగు సెక్షన్లు ఉన్న కాలేజీలు పదుల సంఖ్యలోనే ఉన్నాయి. వాటిల్లోనూ ఎక్కువగా సీఎస్ఈ, కొత్తగా వచ్చిన కంప్యూటర్ కోర్సులే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరిమితి ఎత్తేసినా కొత్తగా సీట్లు పెరుగుతాయా? అనే సందేహాలు కూడా ఉన్నాయి. కొత్త విధానం వల్ల యూనివర్సిటీల అనుబంధ గుర్తింపు తీసుకోవాల్సిన అవసరం ఉండదని అధికారులు అంటున్నారు.

విస్తృత చర్చ చేపడతాం..

ఏఐసీటీఈ ముసా యిదా ప్రతిపై త్వరలో ఉన్నత స్థాయి చర్చ చేపడతాం. ఏఐసీటీఈ ప్రతిపాదనలు రాష్ట్రంలో అమలు చేయగలమా లేదా? అనేది పరిశీలించాల్సి ఉంది. వీసీలు, నిపుణుల అభిప్రాయాలు తీసుకున్నాక దీనిపై ఏఐసీటీఈకి అభిప్రాయం తెలియజేస్తాం.

– ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్

నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేదు

శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదంపై పోటు సిబ్బంది

తిరుమల: నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి తావు లేకుండా దిట్టం మేరకు శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదాలు తయారు చేస్తున్నామని తిరుమల శ్రీవారి ఆలయ పోటులో పనిచేస్తున్న శ్రీ వైష్ణవ బ్రాహ్మణులు స్పష్టం చేశారు. ఇటీవల డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో లడ్డూ నాణ్యతకు సంబంధించి భక్తుల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకున్న టీటీడీ అధికారులు పోటు సిబ్బందితో శనివారం సమావేశమయ్యారు. అందులో పనిచేస్తున్న పలువురు మాట్లాడుతూ తాము కొన్ని తరాలుగా పారంపర్యంగా లడ్డూ తయారీలో నైపుణ్యం సాధించామని చెప్పారు. లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి, శనగపిండి, చక్కెర, ఎండు ద్రాక్ష, బాదం తదితర దినుసులను దిట్టం ప్రకారం టీటీడీ అధికారులు అందిస్తున్నారని, లడ్డూ నాణ్యత తగ్గే అవకాశం లేదని స్పష్టం చేశారు.

ఏపీ లోక్ అదాలత్‌లో భారీగా కేసుల పరిష్కారం

సాక్షి, అమరావతి: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయి. ఈ లోక్ అదాలత్‌లో 21,574 కేసులను పరిష్కారించగా, రూ.74.053 కోట్లు పరిహారం అందజేశారు. ఈ 21,574 కేసుల్లో 16,807 పెండింగ్ కేసులు కాగా, 4,767 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని న్యాయస్థానాల్లో 386 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టులో కూడా లోక్ అదాలత్ జరిగింది. న్యాయమూర్తులు జస్టిస్ తర్లాడ రాజశేఖర రావు, జస్టిస్ వేణుతురుమిల్లి గోపాల కృష్ణారావు బెంచ్‌లను నిర్వహించారు. మొత్తం 137 కేసులు పరిష్కరించారు. రూ.2.85 కోట్లు పరిహారంగా అందజేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

గొర్రెకు మేకపిల్ల జననం


మేకపిల్లకు జన్మనిచ్చిన గొర్రె

దేవరుప్పుల: జనగామ జిల్లా దేవరుప్పుల మండలం గొల్లపల్లిలో కోనేటి సోమయ్యకు చెందిన గొర్రెకు మేకపిల్ల జన్మించింది. శనివారం జరిగిన ఈ వింతను చూసి పెంపకందారులు, స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన జనగామ–సూర్యాపేట రహదారి పక్కనే జరగడంతో బాటసారులు సైతం ఆసక్తిగా గమనించారు. దానిని వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ విషయమై మండల పశువైద్యాధికారి సింధుప్రియ మాట్లాడుతూ ఒకే మందలో గొర్రెలు, మేకలు తిరిగినప్పుడు అనుహ్య సంపర్క ప్రక్రియతో ఇలాంటి సంఘటనలు అరుదుగా జరుగుతాయని పేర్కొన్నారు.

జ్యువెలరీ దుకాణాల్లో ఆదాయపన్ను శాఖ సోదాలు

లెక్కల్లో చూపని 25 కేజీల బంగారం స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: పన్ను ఎగవేత ఆరోపణలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని పలు ప్రాంతాల్లో రెండు సంస్థలకు చెందిన జ్యువెలరీ దుకాణాల్లో ఆదాయపన్ను (ఐటీ)శాఖ రెండ్రోజులపాటు సోదాలు నిర్వహించింది. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో చేసిన సోదాల్లో లెక్కల్లో చూపని 25 కిలోల బంగారాన్ని ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.